తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 27.10.2025 | సంపుటి :12 సంచిక : 96 | పేజీలు :12 వెల : రూ. 4/-


హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









రష్యా అమ్ములపొదిలో


# అధునాతన అణు క్షిపణి

**అణుశక్తి.. అపరిమిత పరిధి.. 'బూరెవెస్ట్‌నిక్' సొంతం**

- గోల్డెన్ డోమ్ కూడా అడ్డుకోలేని విధంగా తయారీ
- 15 గంటల పాటు గాలిలో ఉండి 14 వేల కి.మీ.ల ప్రయాణం
- క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు ప్రకటించిన పుతిన్

**మాస్కో(జనంసాక్షి):** రష్యా అమ్ములపొదిలో సరికొత్త అస్త్రం వచ్చి చేరనుంది. అణుశక్తితో నడిచే 'బూరెవెస్ట్‌నిక్' క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు దేశాధినేత పుతిన్ ప్రకటించారు. అపరిమితమైన పరిధి కలిగిన ఈ క్షిపణి మోహరింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సాయుధ దళాలను ఆదేశించారు. రష్యా సైన్యం ఇటీవల 'అణు' విన్యాసాలు నిర్వహించింది. పుతిన్ వాటిని స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలోనే రష్యా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ఇతర సైనిక కమాండర్లతో ఆయన ఓ సమావేశంలో మాట్లాడారు. పరీక్షల సమయంలో 'బూరెవెస్ట్‌నిక్' క్రూయిజ్ క్షిపణి 15 గంటల పాటు గాల్లోనే ఉందని, 14 వేల కిలోమీటర్లు ప్రయాణించిందని తెలిపారు. అంతకుముందు సైనిక ఉన్నతాధికారులతో పుతిన్ భేటీ అయ్యారు.

మిగతా 2లో..




# దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

## తొలి దశలో అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబంగాల్‌లో నిర్వహణ




- ఇప్పటికే ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులతో రెండుసార్లు సమావేశమైన సీఈసీ
- వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభించే ఛాన్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** వచ్చే వారం నుంచి కేంద్ర ఎన్నికల సంఘం 10 నుంచి 15 రాష్ట్రాలలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టనుందని తెలిసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను మొదటగా ప్రారంభిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, బంగాల్ రాష్ట్రాల్లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కనుక ఈ రాష్ట్రాల్లో మొదటిగా ఎస్ఐఆర్ చేపట్టే అవకాశం. వచ్చే వారం కేంద్ర ఎన్నికల సంఘం ఈ తొలి దశ ఎస్ఐఆర్‌పై ప్రకటన విడుదల చేయనున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడినా లేదా ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రక్షాళన ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ మలి దశలో ఉంటుందని వెల్లడించాయి. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో రెండు సార్లు కాన్ఫరెన్స్ నిర్వహించింది. మెజార్టీ రాష్ట్రాలలో చివరిసారిగా 2002-04 మధ్య ఎస్ఐఆర్

మిగతా 2లో..

**వచ్చే వారం నుంచి తమిళనాడులో 'ఎస్ఐఆర్'**

ఓటు హక్కును హరించి.. ఎన్నికల్లో గెలిచేందుకు యత్నిస్తున్నాయి

భాజపా-అన్నాడీఎంకేపై సీఎం స్టాలిన్ ఫైర్

2లో..

# శభాష్ చైతన్య..



## డీసీపీ ధైర్య సాహసాలను అభినందిస్తున్నా

## డీజీపీ శివధర్‌రెడ్డి ప్రశంస

### డీసీపీతోపాటు ఆయన గన్‌మెన్‌ను పరామర్శించిన డీజీపీ



- దొంగను పట్టుకునే క్రమంలో కత్తితో నిందితుడు దాడిచేశాడు
- ఓమర్ అన్సారీ ఆరోగ్యం కూడా నిలకడగా ఉంది
- పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నాం
- విక్టోరియా గ్రౌండ్ సంఘటనపై డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యలు

వార్త 2లో

# రహదారిపై మళ్లీ రాజుకున్న అగ్నికీలలు

**తప్పిన పెనుప్రమాదం • మరో స్లీపర్ బస్సులో మంటలు**

**డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులందరూ సురక్షితం**



**లక్నో(జనంసాక్షి):** యూపీకి చెందిన ఓ ప్రైవేటు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డబుల్ డెక్కర్ ఏసీ స్లీపర్ బస్సులో మంటలు వ్యాపించినప్పటికీ డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ వేపై వెళుతున్న సమ యంలో ఓ ఏసీ స్లీపర్ బస్సు టైర్ల కింద నుంచి మం టలు చెలరేగాయి. దీన్ని గమనించిన డ్రైవర్.. వెంటనే బస్సును ఆపేసి ప్రయాణికుల్ని కిందకు దించేశాడు. అదే సమయంలో పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని మంటల్ని అదుపు చేశారు.

మిగతా 2లో..

కర్నూలు బస్సు ప్రమాదం..

## కుటుంబ సభ్యులకు మృతదేహాల అప్పగింత

**కర్నూలు(జనంసాక్షి):** కర్నూలు బస్సు ప్రమాదంలో మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను డీఎన్ఏ నివేదిక ఆధారంగా కుటుంబ సభ్యులకు అధికా రులు అప్పగించారు. మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా వారికి అందించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ సిరి పర్యవేక్షించారు.

మిగతా 2లో..

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌దే



## ఉపఎన్నికలో భారీ మెజార్టీ ఖాయం

- అక్కడ గత పదేళ్లుగా భారాస అభ్యర్థులే గెలిచారు
- మరి ఓట్ చోరీ ఎవరూ చేశారో చెప్పాలి
- కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం
- పార్టీకి సేవచేసిన కుటుంబాలకు ప్రాధాన్యం
- రాష్ట్రంలోని పరిస్థితులను పార్టీ హైకమాండ్ గమనిస్తోంది
- రాష్ట్రానికి కేంద్రం నుంచి సరైన సహకారం లేదు
- ఢిల్లీ పర్యటనలో మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 46వేల మంది చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మంత్రుల పంచాయితీ ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పరిస్థితులను పార్టీ హైకమాండ్ గమనిస్తోందన్నారు. కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని మహేశ్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. తొలి నుంచి పార్టీకి సేవచేసిన కుటుంబాలకు అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి సరైన సహకారం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఆ తర్వాత అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డంకులు పెడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 10 ఏళ్లు భారత రాష్ట్రసమితి అభ్యర్థులే గెలిచారని, మరి ఓట్ చోరీ ఎవరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తొలుత ఫిర్యాదు చేసింది సీఎం రేవంత్‌రెడ్డే అని గుర్తు చేశారు. అధికారులు, మంత్రులు ఎవరైనా జవాబుదారీగా ఉండాలని సూచించారు.





## ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్

# విజయ దుందుభి

**విజయ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని ప్యానల్ వైపే జర్నలిస్టుల మొగ్గు**

- అధ్యక్షుడిగా విజయ్ కుమార్ రెడ్డి ఘనవిజయం
- ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల రమేష్, ఉపాధ్యక్షుడిగా ఏ రాజేష్, ట్రెజరర్ గా రమేష్ వైట్ల ఎన్నిక
- మహిళ విభాగం నుంచి ఉపాధ్యక్షురాలుగా ఏ.అరుణ గెలుపు
- ప్రెస్‌క్లబ్ వద్ద టపాసులు పేల్చి.. మిన్నంటిన సంబరాలు

హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి)

హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో సాక్షి రెసిడెంట్ ఎడిటర్ ఎస్.విజయ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని ఫ్రెండ్స్ ప్యానల్ విజయ దుందుభి మోగించింది. అధ్యక్షుడిగా శ్రీగిరి విజయ్ కుమార్ రెడ్డి ఘన విజయం సాధించగా ప్రధాన కార్యదర్శిగా వరికుప్పల రమేష్, మహిళ ఉపాధ్యక్షురాలుగా ఏ.అరుణ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఏ.రాజేష్, ట్రెజరర్‌గా రమేష్ వైట్ల ఎన్నికయ్యారు. మిగతా స్థానాల్లోను ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థులు పైచేయి సాధించారు. మొత్తం 1283 ఓటర్లు ఉండగా.. 1093 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ప్రధానంగా ఫ్రెండ్స్ ప్యానెల్ వైపు అత్యధిక మంది జర్నలిస్టులు మొగ్గు చూపారు. ఫ్రెండ్స్ ప్యానెల్ ప్రకటించిన భవిష్యత్ కార్యాచరణ

మిగతా 2లో..

ఫీజు బకాయిలు చెల్లించకపోతే

# నవంబరు 3 నుంచి నిరవధిక బంద్

- రూ.1200 కోట్లు ఇస్తామని కేవలం రూ.300 కోట్లు విడుదల చేశారు
- ఈ డబ్బులతో కాలేజీలు నడిపే పరిస్థితులులేవు
- తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని ఇంజినీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలలు నవంబరు 3 నుంచి బంద్ పాటి స్తామని తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు తెలిపారు. ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో కాలేజీలు నడిపే పరిస్థితుల్లో లేమన్నారు. రూ.1200 కోట్ల బకాయిలు చెల్లిస్తామని కేవలం రూ.300 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. "మంత్రులు మాకు సహకరించడం లేదు. నవంబరు 1 లోపు రూ.900 కోట్లు విడుదల చేయాలి. మిగిలిన బకాయిలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

మిగతా 2లో..



# కెనడాపై మళ్లీ వడ్డింపులు



## 10 % అదనంగా సుంకాలు విధించిన ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు తన ప్రతాపం చూపారు. తాజాగా కెనడియన్ వస్తువులపై సుంకాలను అదనంగా 10 శాతం మేరకు పెంచుతున్నట్లు వెల్లడించారు. దివంగత అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ నాడు సుంకాలపై చేసిన ప్రసంగానికి సంబంధించిన ఆడియో క్లిప్పులను కెనడా వినియోగించిన దరిమి లా ఆగ్రహంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పొరుగు దేశమైన కెనడా రూపొందించిన ఒక టీవీ వాణిజ్య ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి. అమెరికా ఇటీవలే కెనడాపై 35 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు విధించింది. అయితే ఈ సుంకాల తగ్గింపుపై రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే వీటిపై ఒక ఒప్పందం కుదురుతుందని కెనడా అధికారులు భావిస్తున్న తరుణంలో అందుకు భిన్నంగా జరిగింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ- డొనాల్డ్ ట్రంప్ మధ్య ఇటీవలే ఓవల్ ఆఫీస్‌లో స్నేహపూర్వక సమావేశం జరిగింది. అయితే ఇంతలోనే ఊహించని విధంగా ట్రంప్.. కెనడాతో చర్చల రద్దును ప్రకటించారు. దీనికి కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రభుత్వం ప్రసారం చేసిన ఒక టీవీ ప్రకటన అని సమాచారం. ఈ ప్రకటనలో అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ .. సుంకాలు, ఆంక్షలు దీర్ఘకా లంలో అమెరికన్లకు ముప్పు తీసుకొస్తాయని వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన గత వారం రోజులుగా అమెరికా టీవీ ఛానెల్స్‌లో ప్రసారమవుతోంది.

ఉక్రెయిన్‌పై మళ్లీ

## క్షిపణుల వర్షం

డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా..

9లో..

భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ దేశాలు

# మూలస్తంభం

## మలేసియా శిఖరాగ్ర సదస్సులో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోదీ

- ఆసియాలో శాంతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేయాలని పిలుపు
- సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు ప్రశంస







**న్యూఢిల్లీ/కౌలాలంపూర్(జనంసాక్షి):** 21వ శతాబ్దం భారత్, ఆసియాన్ దేశాల శతాబ్దమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మలేసియాలో కౌలాలంపుర్ జరుగుతోన్న ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ఆదివారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ దేశాలు మూలస్తంభమని పునరుద్ఘాటించారు. 2026ను ఆసియాన్-భారత్ సముద్ర సహకార సంవత్సరంగా మోదీ ప్రకటించారు. ఆసియాన్ సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు అతిథ్య మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంను మోదీ అభినందించారు. ఈ ఏడాది సమ్మిట్ థీమ్ అయిన సమ్మిళితత్వం, స్థిరత్వం ఇరుభాగస్వామ్యాల ఉమ్మడి ప్రయత్నాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తుందన్నారు. విద్య, పర్యటకం, సైన్స్, టెక్నాలజీ, ఆరోగ్యం, గ్రీన్ ఎనర్జీ, సైబర్ భద్రతలో ద్వైపాక్షిక సహకారాన్ని బలంగా ప్రోత్సహిస్తున్నట్లు మోదీ చెప్పారు. ఆసియా అంతటా శాంతి, శ్రేయస్సు కోసం భారత్, ఆసియాన్ మధ్య సహకారం ముఖ్యమని ప్రధాని నొక్కి చెప్పారు. భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి

మిగతా 2లో..



# ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఫ్రెండ్స్‌ప్యానెల్ విజయ దుందుభి

జర్నలిస్టులను ఆకర్షించింది. విజయ్ కుమార్ రెడ్డి గెలుపు చారిత్రక అంశంగా ముందుకొచ్చిన తరుణంలో ప్రెస్‌క్లబ్ స్థలాన్ని పరిరక్షించుకోవడం, జర్నలిస్టుల సంక్షేమం కూడా ప్రధాన కర్తవ్యమనీ ప్రకటించిన దరిమిలా జర్నలిస్టులు ఫ్రెండ్స్‌ప్యానెల్‌ను ఆదరించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగినానంతరం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రాత్రి వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది. ఫ్రెండ్స్ ప్యానెల్ వైపే అత్యధిక ఓట్లు పోలవడంతో సంబరాలు మిన్నంటాయి. ప్రెస్‌క్లబ్ వద్ద విజయ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. గెలుపొందిన ఇతర సభ్యులను కూడా అభినందించారు. ఈ సందర్భంగా గెలుపొందిన సభ్యులు మాట్లాడుతూ.. తమ పట్ల ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తామన్నారు. తమను ఆదరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు ప్రకటించారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే విజేత ప్యానల్ సభ్యులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పరిరక్షించుకోవడం, జర్నలిస్టుల సంక్షేమం కూడా ప్రధాన కర్తవ్యమనీ ప్రకటించడంతో జర్నలిస్టులు ఫ్రెండ్స్ ప్యానెల్ ను ఆదరించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగినానంతరం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రాత్రి వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది. ఫ్రెండ్స్ ప్యానెల్ వైపై అత్యధిక ఓట్లు పోలవడంతో సభ్యులు సంబరాలు మునిగిపోయారు. ప్రెస్ క్లబ్ వద్ద విజయ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. గెలుపొందిన ఇతర సభ్యులను కూడా అభినందించారు.

# ఆఫ్ఘన్‌తో శాంతి చర్చల్లో ఒప్పందం కుదరకపోతే బహిరంగ యుద్ధమే

**పాక్ రక్షణశాఖ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొద్దిరోజులుగా యుద్ధ వాతావరణం నెలకొంది. దాడులు, ప్రతి దాడులతో రెండు దేశాల సరిహద్దుల్లో టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది.మరోవైపు.. ఇరు దేశాల నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా పాక్ రక్షణశాఖ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శాంతి చర్చల్లో ఒప్పందం కుదరకపోతే బహిరంగ యుద్ధమే అని కామెంట్స్ చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలపై చర్చ నడుస్తోంది.తాజాగా పాక్ రక్షణశాఖ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'ఆఫ్ఘనిస్థాన్ శాంతిని కోరుకుంటుందనే విశ్వాసం ఉంది. ఒకవేళ శాంతి ఒప్పందం కుదరకపోతే వాళ్లతో బహిరంగ యుద్ధం చేస్తాం. అందుకు మాకు ఓ అవకాశం ఉంది. కానీ, వాళ్లు శాంతిని కోరుకుంటారని విశ్వసిస్తున్నా. ఇరు పక్షాలు కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నాయని అనుకుంటున్నా. గత నాలుగైదు రోజులుగా సరిహద్దులు ప్రశాంతంగానే ఉన్నాయి' అని అన్నారు. అయితే, ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్న వేళ ఆసిఫ్ ఈ విధంగా స్పందించారు.మరోవైపు.. మహమ్మద్ ఆసిఫ్ వ్యాఖ్యలపై పాకిస్తాన్ మాజీ మంత్రి, క్వామి వతన్ పార్టీ అధినేత అఫ్తాబ్ షెర్పావ్ ఘాటు విమర్శలు చేశారు. తాజాగా అఫ్తాబ్ స్పందిస్తూ..'ఆసిఫ్ వ్యాఖ్యలు బాధ్యతారహితంగా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలు అనవసరం. ప్రభుత్వ సీనియర్ మంత్రి నుండి ఇటువంటి వ్యాఖ్యలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత దెబ్బతీస్తాయి. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చల ప్రక్రియను దెబ్బతీస్తాయి. చర్చల ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. దశాబ్దాల సంఘర్షణలో అధికారులు శాంతి, ప్రాంతీయ స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన భవిష్యత్తును నిర్ధారిస్తారు' అని కామెంట్స్ చేశారు.ఇదిలా ఉండగా.. ఖతార్, తుర్కియే మధ్యవర్తిత్వంతో దోహా వేదికగా రెండోసారి శాంతి చర్చలు జరుగుతున్నాయి. కాగా, అక్టోబర్ 18,19 తేదీల్లో జరిగిన మొదటి చర్చల్లో పా?కిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్‌లు తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలోనే శనివారం ఇస్తాంబుల్‌లో ఇరు దేశాల మధ్య చర్చలు మొదలయ్యాయి. ఆదివారం కూడా చర్చలు కొనసాగుతున్నాయి.

# అధికారులే నేరస్థులను రక్షిస్తున్నారు

**- వైద్యురాలి ఆత్మహత్యపై రాహుల్ ఆవేదన**

**ముంబై(జనంసాక్షి):** ఓ ఎస్సై తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ.. మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో ఓ వైద్యురాలు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. మహారాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులే నేరస్థులను రక్షిస్తుంటే.. బాధితులు ఇక న్యాయాన్ని ఎలా ఆశిస్తారని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే దారుణాలకు పాల్పడితే వారు ఇంకెవరిని ఆశ్రయిస్తారని ప్రశ్నించారు. వైద్యురాలి ఆత్మహత్య ను ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. న్యాయంకోసం పోరాటంలో మృతురాలి కుటుంబసభ్యులకు తాము మద్దతుగా నిలబడతామన్నారు. వైద్య పరీక్షలకు తీసుకురాకుండానే నిందితులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ పోలీసులు, అధికారులు, ఎంపీ వైద్యురాలిని బెదిరించడం వంటి చర్యలు అక్కడి ప్రభుత్వ వ్యవస్థలోని అవినీతికి నిదర్శమని రాహుల్ అన్నారు. అటువంటి నేరస్థులు పెట్టిన హింసలకు వైద్యురాలు బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపాతో సంబంధమున్న కొందరు వ్యక్తులు కూడా అవినీతికి పాల్పడాలని వైద్యురాలిని బెదిరించారన్నారు. ఆత్మహత్యకు ముందు 26 ఏళ్ల వైద్యురాలు రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు శనివారం నిందితులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రశాంత్ బంకర్, ఎస్సై గోపాల్ బదానేలను అరెస్టు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు, బాధితురాలు ఇద్దరూ బంధువులేనని దర్యాప్తులో తేలిందని అధికారి ఒకరు తెలిపారు. ఎంపీపై ఆమె చేసిన ఆరోపణలపై విచారణ కొనససాగుతోందన్నారు. కాగా ఈ ఆత్మహత్య మహారాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

# దేశంలో 22 ఫేక్ యూనివర్సిటీలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఢిల్లీ కోట్లా ముబారక్‌పుర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీ చేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏ చట్టం కింద ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది.యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది. వీటిల్లో 9 దేశ రాజధాని దిల్లీలో ఉన్నాయి. ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా.. మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి.దిల్లీలోని విద్యార్థులను బ్రోకర్ నెట్‌వర్క్‌లతో మాయచేసి.. ఈ విశ్వవిద్యాలయాలు ఆకర్షిస్తున్నాయి. తమ సంస్థలకు పేర్లు పెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ వంటి పదా లు వాడుతున్నారు. ఇక యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ వంటి పదాలను వినియోగిస్తున్నారు. విద్యార్థులు ఏదైనా సంస్థలో చేరే సమయంలో దాని పేరు సెక్షన్ 2(ఎఫ్) లేదా 3 కింద యూజీసీ గుర్తించిన జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి.

# శభాష్ చైతన్య..

**డీసీపీ ధైర్య సాహసాలను అభినందిస్తున్నా**

- డీజీపీ శివధర్‌రెడ్డి ప్రశంస
- డీసీపీ, గన్‌మెన్‌ను ఆస్పత్రిలో పరామర్శించిన డీజీపీ
- దొంగను పట్టుకునే క్రమంలో కత్తితో నిందితుడు దాడిచేశాడు
- ఓమర్ అన్సారీ ఆరోగ్యం కూడా నిలకడగా ఉంది
- పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నాం..
- విక్టోరియా గ్రౌండ్ సంఘటనపై డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యలు




**హైదరాబాద్ బ్యూరో, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** హైదరాబాద్ నడిబొడ్డున తుపాకీ కాల్పుల ఘటనపై డీజీపీ శివధర్ రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. శనివారం చాదర్‌ఘాట్‌లో పోలీసులపై మొబైల్ స్నాచర్లు కత్తితో దాడికి యత్నం చేశారని తెలిపారు. సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడే వారిని పట్టుకునే క్రమంలో నిందితులు కత్తితో దాడి చేశారని, డీసీపీ చైతన్య కుమార్, గన్‌మెన్ మూర్తి 750 మీటర్లు వెంబడించి నింది తులను చేజ్ చేశారని తెలిపారు. అందులో భాగంగా నిందితులు కత్తితో దాడి చేశారని చెప్పారు. నిందితుడు సయ్యద్ ఒమర్ అన్సారీపై 22 కేసులు ఉన్నాయని స్పష్టం చేశారు. కలపథర్ పరిధిలో ఒమర్ అన్సారీపై రౌడీ షీట్ ఉందని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో ధైర్యసాహసాలు కనబరిచిన డీసీపీ, గన్‌మెన్ ఆర్యోగ్య పరిస్థితిని తాను తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఇద్దరు అధికారులు నేడు డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నిందితుడు ఒమర్ అన్సారీ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగిందని, ఇతని ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉందని చెప్పారు.

**ప్రజలెవ్వరూ భయపడొద్దు : సీపీ సజ్జనార్**

డీసీపీ సౌత్ జోన్ నేతృత్వంలో ఈ కేసుతో సంబంధం ఉన్న ఆటో డ్రైవర్, మరొక వ్యక్తిని పట్టుకోవడానికి పోలీస్ బృందాలు పని చేస్తున్నాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. కొన్ని ఆధారాలు కూడా లభించాయన్నారు. ఇటీవల ఒమర్ కదలికలు, అతనికి ఉన్న పరిచాయలపై ఆరా తిస్తున్నామని, విజబుల్ పోలీసింగ్ కూడా పెంచామని వివరించారు. నగర ప్రజలెవ్వరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, పోలీసులు ఎప్పుడూ రక్షణగా ఉంటారని ధైర్యం చెప్పారు. రౌడీ షీటర్లు, దొంగల పట్ల ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. మొబైల్ స్నాచింగ్ గ్యాంగ్స్‌పై కూడా నిఘా పటిష్టం చేశామని సజ్జనార్ అన్నారు. డీసీపీ చైతన్య కుమార్‌కు మెడ భాగంలో గాయాలు ఉన్నాయని, గన్‌మెన్ మూర్తికి కాలికి గాయమైందని చెప్పారు. డ్రైవర్ సందీప్ అప్రమత్తంగా ఉండి కీలక పాత్ర పోషించారని అభినందించారు. డీసీపీ చైతన్య, మూర్తి, డ్రైవర్ సందీప్ ముగ్గురు ధైర్యసాహసాలు చూపారని కొనియాడారు. ఐదు పోలీసు బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

**దర్యాప్తు జరపాలని ఎంఐఎం డిమాండ్**

ఈ కాల్పుల ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఆల్ ఇండియా మజ్లిస్ ఇ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) డిమాండ్ చేసింది. ఆసుపత్రిలో అన్సారీని ఏఐఎంఐఎం బహదూర్‌పురా మొహమ్మద్ ముబీన్ పరామర్శించారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్వతంత్ర విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని అన్నారు. ఏం జరిగిందో దానిపై దర్యాప్తు చేయాలని, నిజమైన వాస్తవాలను బయటకు తీసుకురావడానికి స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణపైనా మొంథా ఎఫెక్ట్

**తుపాను ప్రభావంతో నేడు, రేపు భారీ వర్షాలు**

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో రేపు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఈ నెల 28 నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వెల్లడి తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో రేపు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం కొన్ని ఈశాన్య జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడతాయని, మరికొన్ని ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఈరోజు, రేపు తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 28 నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది : ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వాయుగుండం ఇవాళ తీవ్ర వాయుగుండంగా మారి అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాగల 24 గంటల్లో ఈ తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి తుపానుగా మారి నైరుతి బంగాళాఖాతం, దాని సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. తదుపరి ఈ తుపాను మొదట వాయవ్య దిశలో తదుపరి ఉత్తర వాయవ్య దిశలో కదిలి మరింత బలపడి ఈ నెల 28 నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వెల్లడించారు. తదుపరి తూర్పు వాయువ్య దిశలోనే కదులుతూ ఈ నెల 28న సాయంత్రానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మచిలీపట్నం - కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు. అమరావతి: మొంథా తుపాను 28న అర్ధరాత్రి కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెప్పినట్లు ఏపీ హోం మంత్రి అనిత తెలిపారు. దీనిపై గత నాలుగు రోజులుగా సీఎం చంద్రబాబు అప్రమత్తం చేస్తున్నారన్నారు. తుపాను నేపథ్యంలో అప్రమత్తతపై విపత్తుల నిర్వహణ శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. 100కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్న తరుణంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.భారీ హోర్డింగ్‌లను ముందుగానే తొలగిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సాధ్యమైనంత వరకు ఆస్తినష్టం తగ్గించే విధంగా చూస్తున్నామన్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ తుపాను సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. 6 ఎన్డీఆర్ఎఫ్, 13 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. కోస్తా జిల్లాలన్నింటిపైనా తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందని, కాకినాడ పరిధిలోని 6 మండలాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. అవసరమైతే ప్రజలను తరలించేందుకు హెలికాప్టర్లను కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.మొంథా తుపాను దృష్ట్యా రెవెన్యూ అధికారులను మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## రహదారిపై మళ్లీ రాజుకున్న అగ్నికీలలు

డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం కానీ, గాయాల బారిన పడటం కానీ జరగలేదన్నారు. ఈ ఘటన ఢిల్లీ నుంచి లక్నో మీదుగా గోండా వస్తున్న సమయంలో జరిగినట్లు తెలిపారు. ఆ సమయంలో 39 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. టోల్ ప్లాజాకు 500 మీటర్ల దూరంగా ఉండగా బస్సులో మంటలు వ్యాపించినట్లు పేర్కొన్నారు.బస్సు టైర్ల కింద నుంచి మంటలు రావడంతో దాన్ని రోడ్డుపైనే నిలిపేసిన డ్రైవర్ జగత్ సింగ్ చాలా చాక్యంగా వ్యవహరించినట్లు పోలీసులు ప్రశంసించారు.

## కర్నూలు బస్సు ప్రమాదం.. కుటుంబ సభ్యులకు మృతదేహాల అప్పగింత

మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు.ఈ ప్రమాదంలో బస్సులోని 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో గుర్తు తెలియని మృతదేహానికి సంబంధించి చిత్తూరు నుంచి ఒకరు వచ్చారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. తమ తండ్రి కనిపించడం లేదని ఆ వ్యక్తి చెప్పారన్నారు. డీఎన్ఏ నివేదిక ఆధారంగా ఆ మృతదేహం ఎవరిదనే విషయం తేలుతుందని స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో బస్సు డ్రైవర్ మద్యం తాగలేదని నివేదికలో తేలిందని ఎస్పీ చెప్పారు.

## రష్యా అమ్ములపొదిలో అధునాతన అణు క్షిపణి

రష్యా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ వాలెరీ గెరాసిమోవ్ నేతృత్వంలోని కమాండర్లతో సంభాషించారు. 10వేల మందికిపైగా ఉక్రెయిన్ సైనికులను చుట్టుముట్టినట్లు గెరాసిమోవ్ వివరించారు. 31 బెటాలియన్లతో కూడిన ఉక్రెయిన్ సాయుధ దళాల బృందాన్ని అడ్డుకున్నట్లు చెప్పారు.

గోల్డెన్ డోమ్ కూడా అడ్డుకోలేని విధంగా తయారీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్ని నెలల క్రితం ప్రకటించిన గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థ సైతం ఈ క్రూయిజ్ క్షిపణిని అడ్డుకోలేదనే అంచనాలు వెలువడుతున్నాయి. అణు-శక్తితో నడిచే, అపరిమిత శ్రేణి గల క్రూయిజ్ మిసైల్ కావడంతో గోల్డెన్ డోమ్‌ను సైతం దాటుకొని దాడి చేయగలదనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో గోల్డెన్ డోమ్ రూపకల్పనలో అమెరికా మార్పులు చేయవచ్చని తెలుస్తోంది.గోల్డెన్ డోమ్ నిర్మాణం కోసం ఇప్పటికే 25 బిలియన్ డాలర్లు కేటాయించారు. దీని మొత్తం నిర్మాణానికి 175 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్?ను పర్యవేక్షించేందుకు అమెరికా స్పేస్‌ఫోర్స్‌కు చెందిన ఫోర్‌స్టార్ జనరల్ మైఖేల్ గుట్లిన్ నియమించారు ట్రంప్. గోల్డెన్ డోమ్ వ్యవస్థ భూమి, అంతరిక్షం నుంచి అమెరికా గగనతలంపై ఓ కన్నేసి ఉంచి రక్షణ కల్పిస్తుంది. అమెరికా వైపు వచ్చే క్షిపణులు, ఇతర ముప్పులను ముందుగానే పసిగడుతుంది. చాలావరకు అవి టేకాఫ్ అవ్వక ముందే లేదా మార్గమధ్యలోనే వాటిని ధ్వంసం చేసే సత్తా వీటికి ఉండనుంది. అయితే అణుశక్తితో నడిచే "బురెవెస్ట్‌నిక్" క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రష్యా ప్రకటించిన నేపథ్యంలో గోల్డెన్ డోమ్‌ను ఏ తరహాలో నిర్మిస్తారనే విషయమై ఆసక్తి నెలకొంది.

## ఫీజు బకాయిలు చెల్లించకపోతే నవంబరు 3 నుంచి నిరవధిక బంద్

నవంబరు 1న రూ.900 కోట్లు విడుదల చేయకపోతే.. 3 నుంచి నిరవధిక బంద్ చేస్తాం.నవంబరు 10వ తేదీ లోపు 2లక్షల మందితో సమావేశం నిర్వహిస్తాం. ప్రభుత్వ వైఖరికి అనుగుణంగా మా నిరసన కార్యక్రమాలు ఉంటాయి. ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలు అడిగినప్పుడే ప్రభుత్వ విచారణలు ఉండకూడదు. వాళ్ల స్వార్థం కోసం మమ్మల్ని భయపెడితే ఊరుకోం. ఒక్క పోలీసును కూడా కాలేజీలోకి అనుమతించం" అని వివరించారు.



# దేశవ్యాప్తంగా ఓటర్ల సవరణ

ప్రక్రియ చేపట్టారు.ఇదిలా ఉండగా బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమం ముగిసింది. దాదాపు 7.42 కోట్ల ఓటర్లతో తుది జాబితా సెప్టెంబర్ 30న ఈసీ ప్రచురించింది. ఓటర్ల జాబితాలను తమ వెబ్‌సైట్‌లలో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. నకిలీ ఓటర్లను తొలగించడమే లక్ష్యంగా ఈసీ ఈ ఎస్?ఐఆర్ చేపట్టింది. అంతేకాదు ఈ ప్రక్రియ ద్వారా విదేశీ అక్రమ వలసదారులను కూడా గుర్తించింది. బంగ్లాదేశ్, మయన్మార్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో అక్రమ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది.

13వేల మంది ఏఐఏడీఎంకే మద్దతుదారుల పేర్లు తొలగించారు!

మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియ వచ్చే వారం తమిళనాడులో ప్రారంభమవుతుందని భారత ఎన్నికల సంఘం మద్రాసు హైకోర్టుకు తెలిపింది. అయితే చెన్నైలోని టి నగర్ నియోజకవర్గంలో 13,000 మంది ఏఐఏడీఎంకే మద్దతుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఓ మాజీ ఎమ్మెల్యే హైకోర్టును ఆశ్రయించారు. 1998లో నియోజకవర్గంలో 2,08,349 మంది ఓటర్లు ఉండగా, 2021లో ఓటర్ల సంఖ్య కేవలం 36,656 మాత్రమే పెరిగిందని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. జనాభా, ఓటర్ల జాబితాలోని ఓటర్ల సంఖ్య మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని 13,000 మంది ఏఐఏడీఎంకే మద్దతుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, మరణించిన వారి పేర్లను తొలగించలేదని ఆయన ఆరోపించారు.

కేసును వచ్చే వారానికి వాయిదా వేసిన ధర్మాసనం!

ఈ విషయంపై ఈసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని పిటిషనర్? పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు టి నగర్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను తిరిగి ధ్రువీకరించాలన్నారు. తప్పుడు చేరికలను తొలగించి తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఈసీని ఆదేశించాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## వచ్చే వారం నుంచి తమిళనాడులో 'ఎస్ఐఆర్'

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం వచ్చే వారం ప్రారంభించనుంది. దీన్ని అధికార డీఎంకే పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలోనే భాజపా, అన్నాడీఎంకేపై ముఖ్యమంత్రి స్టాలిన్ విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు కలిసి 'ఎస్ఐఆర్' ద్వారా ప్రజల ఓటు హక్కును హరించి.. ఎన్నికల్లో గెలిచేందుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. డీఎంకే శ్రేణులను ఉద్దేశించి ఈ మేరకు ఓ లేఖ విడుదల చేశారు. "తమిళనాడులోనూ ఎన్నికల ప్రయోజనాల కోసం 'ఎస్ఐఆర్' నిర్వహణకు పావులు కదుపుతున్నారు. శ్రామికులు, ఎస్సీలు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించడం ద్వారా 2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవొచ్చని భాజపా, దాని మిత్రపక్షం అన్నాడీఎంకే భావిస్తున్నాయి. ఎన్నికల క్షేత్రంలో ప్రజలను ఎదుర్కొనే శక్తి లేనివారు, వారి ఓటు హక్కులను లాక్కొని విజయం సాధిస్తామని భావించేవారు.. తమిళనాడు విషయానికొస్తే మాత్రం బోల్తాపడతారు" అని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. అప్రజాస్వామిక చర్యలను ప్రజలతో కలిసి చట్టబద్ధంగా ఎదుర్కొంటామని తెలిపారు.అన్నాడీఎంకే చీఫ్, ప్రతిపక్ష నేత ఎడప్పాడి కె. పళనిస్వామిపైనా సీఎం స్టాలిన్ మండిపడ్డారు. ఈశాన్య రుతుపవనాల కారణంగా రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలోనూ.. ఆయన రాజకీయ ప్రయోజనాలను పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అండగా నిలిచే ప్రయత్నాలేమీ చేయడం లేదని విమర్శించారు. ధాన్యం సేకరణ విషయంలో ఆయన చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలేనని ఖండించారు. అటువంటి వాటిని పట్టించుకోకుండా ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తూనే ఉంటామన్నారు.

## భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ దేశాలు మూలస్తంభం

ఆసియాన్ ప్రధాన మూలస్తంభమని ప్రధాని వ్యాఖ్యానించారు.'భారత్, ఆసియాన్ కలిసి ప్రపంచ జనాభాలో నాలుగోవంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మేం కేవలం భౌగోళికంగా మాత్రమే కాకుండా లోతైన చారిత్రక సంబంధాలు, ఉమ్మడి విలువలను పంచుకుంటాం. మేం గ్లోబల్ సౌత్ లో భాగస్వాములం. మేం కేవలం వాణిజ్య భాగస్వాము లమే కాదు. సాంస్కృతిక భాగస్వాములం కూడా. భారత యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ ప్రధాన స్తంభం. భారత్ ఎల్లప్పుడూ ఆసియాన్ కేంద్రీకరణకు, ఇండో-పసిఫిక్‌పై ఆసియాన్ దృక్పథానికి మద్దతు ఇస్తుంది. అనిశ్చితి యుగంలో కూడా భారత్, ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నిరంతరం పెరుగుతోంది. మా బలమైన భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, అభివృద్ధికి ఆధారంగా మారుతుంది' అని ప్రధాని మోదీ తెలిపారు.ప్రతి విపత్తులోనూ ఆసియాన్ భాగస్వామ్యులకు భారత్ ఎల్లప్పుడూ అండగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. విపత్తు, సముద్ర భద్రత, నీలి ఆర్థిక వ్యవస్థలో ఇరు భాగస్వామ్యుల మధ్య సహకారం వేగంగా పెరుగుతోందన్నారు. 2026ను ఆసియాన్-భారత్ సముద్ర సహకార సంవత్సరంగా మోదీ ప్రకటించారు. శాంతియుత, స్థిరమైన,సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంత అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. '21వ శతాబ్దం మన శతాబ్దం. ఇది భారత్-ఆసియాన్ శతాబ్దం. ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యం మొత్తం మానవాళికి ఉజ్వల భవిష్యత్తును నిర్మిస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను. ఆ దిశగా మీ అందరితో భారత్ చేతులు కలిపి పనిచేసేందుకు కట్టుబడి ఉంది' అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆసియాన్‌లో కొత్తగా చేరిన ఈస్ట్ తైమూర్‌కు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. భారత్‌కు సమన్వయకర్తగా పనిచేస్తున్నందుకు ఫిలిప్పీన్స్‌ను ప్రశంసించారు. థాయిలాండ్ మహారాణి సిరికిట్ మృతికి ప్రధాని సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారమే ప్రారంభమైన ఆసియాన్ సదస్సు 28 వరకు జరగనుంది. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా భారత్- ఆసియాన్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గణనీయంగా పెరిగాయి. వాణిజ్యం, పెట్టుబడి పాటు భద్రత, రక్షణల్లో సహకారంపై దృష్టి సారించాయి.

## జీఎస్టీ మార్పులు అన్ని వర్గాల్లో సంతోషం

**- 127వ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ**

**- తెలంగాణ పోరాట వీరుడు కుమురం భీమ్‌కు నివాళి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జీఎస్టీలో మార్పులు ఈ సారి పండుగ సీజన్లో అన్ని వర్గాల్లో సంతోషాన్ని తీసుకువచ్చాయని ప్రధాని మోదీ అభివర్ణించారు. 127వ మన్‌కీ బాత్ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సారి సీజన్లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయన్నారు. వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని వెల్లడించారు."ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికి సేవలు అందిస్తోంది. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి ఫుల్ మీల్స్ తినొచ్చు. మీరు కిలో వ్యర్థాలు ఇస్తే.. లంచ్ లేదా డిన్నర్ ఏర్పాటు చేస్తారు. అదే అర కిలో ఇస్తే.. అల్పాహారం ఇస్తారు. ఈ కేఫ్‌ను అంబికాపుర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది" అని ప్రధాని అభినందించారు. తెలంగాణ పోరాట వీరుడు కుమురం భీమ్‌కు ప్రధాని మోదీ నివాళి అర్పించారు. నిజాం పాలనపై ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. "భారత్‌ను దోచుకోవడానికి బ్రిటిష్ పాలకులు అన్ని మార్గాలను వాడారు. ఆ సమయంలో హైదరాబాద్ ప్రజల ప్రతిస్పందన వీరోచితంగా ఉంది. బ్రిటిష్ వారు నిజాం పాలనను బలపరిచారు. పేదలు, గిరిజనులపై నాడు జరిగిన వేధింపులు వర్ణనాతీతం. ప్రజల భూములను సీజ్ చేశారు. అలాంటి కష్టకాలంలో 20 ఏళ్ల కుర్రాడు ఆ అన్యాయాలకు ఎదురొడ్డి నిలబడ్డాడు. అతడి పేరు చెప్పబోయే ముందు.. ఆ కుర్రాడి వీరత్వం గురించి తెలుసుకోండి. నాటి రోజుల్లో నిజాంపై ఒక్కమాట మాట్లాడటం కూడా నేరమే. కానీ, ఆ కుర్రాడు నిజాం అధికారి సిద్ధిఖీని బహిరంగంగానే సవాల్ చేశాడు. అతడిని మట్టుబెట్టాడు. అరెస్టును తప్పించుకొన్నాడు. అక్కడి నుంచి అతడు అస్సాం చేరుకొన్నాడు. ఆ యువ వీరుడి పేరు కుమురం భీం. ఆయన జయంతిని అక్టోబర్ 22న నిర్వహించారు. కేవలం 40 ఏళ్లే బతికినా.. ప్రజలపై చెరగని ముద్ర వేశారు. నిజాంకు చాలా కాలంపాటు సవాలుగా నిలిచారు. 1940లో నిజాం సైనికులు ఆయన్ను హత్య చేశారు. ఆయన గురించి తెలుసుకునేందుకు యువత వీలైనంత ప్రయత్నించాలని కోరుతున్నాను" అని మోదీ అన్నారు.



# ప్రపంచమంతా 'కౌ-బేస్డ్ ఆర్గానిక్ ఫార్మింగ్'పై దృష్టి

- గోమాత సేవలను పాఠ్యాంశాల్లో చేర్చాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ (జనంసాక్షి) : గోసంతతిని కాపాడుకోవడం మత విశ్వాసం కానేకాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గోవును కాపాడితే ప్రకృతిని కాపాడినట్లేనని, ప్రకృతిని కాపాడితే మన భవిష్యత్తును కాపాడినట్లేనని చెప్పారు. ఇది సైన్స్ అంగీకరించిన వాస్తవాలని తెలిపారు. ఇస్లాంలోనూ కొందరు మతపెద్దలు గోవును పక్కన పెట్టుకుని నమాజ్ చేసిన దృశ్యాలను తాను చూశానని అన్నారు. హైదరాబాద్ లోని నారాయణగూడ కేఎంఐటీ ఇంజనీరింగ్ కాలేజీలు తెలంగాణ గో సేవా విభాగం ఆధ్వర్యంలో "గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజానం"పై ఆదివారం రాష్ట్రస్థాయి పరీక్షలు నిర్వహించారు. విజేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. "గోవు జీవన చక్రంలో ప్రతి అణువూ పర్యావరణ మిత్రం. ఇవి కేవలం మతపరమైన విశ్వాసాలు కావు. సైన్స్ ( శాస్త్రం) అంగీకరించిన నిజాలు. అందుకే ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ కూడా "కౌ-బేస్డ్ ఆర్గానిక్ ఫార్మింగ్" వైపు అడుగులు వేస్తున్నాయి. ఈరోజు విదేశాలు ఆసక్తి చూపుతున్న ఈ "కౌ-బేస్డ్ ఆర్గానిక్ ఫార్మింగ్" శతాబ్దాల క్రితమే మన భారతదేశం ఆచరించి అద్భుత ఫలాలను అందించింది" అని అన్నారు. మన రాష్ట్రంలో 4 కోట్ల మంది జనాభా ఉంటే రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 42 లక్షల పశు సంపద మాత్రమే ఉంది. అందులో సగం పాలు ఇవ్వనివే ఉన్నాయి. నిజం చెప్పాలంటే ఇవి ఇచ్చే పాలు ఒక్క హైదరాబాద్ నగరానికే సరిపోవు. అందుకే ప్యాకెట్ పాలు, పౌడర్ డబ్బాలపై ఆధారపడుతున్నాం. ఈ పద్ధతి మారాలి. ప్రతి గ్రామంలో గోశాలను ఏర్పాటు చేస్తాం. ప్రతి పాఠశాలలో పిల్లలకు గోమాత విలువ నేర్పేలా పాఠ్యాంశాలను చేరుస్తాం. ప్రతి రైతు తన నేలకి గోవుతో బంధం తిరిగి ఏర్పరిచేలా చర్యలు తీసుకుంటాం. వ్యవసాయానికి అనుబంధంగా పశు పోషణను ప్రోత్సహించాలని బండి సంజయ్ సూచించారు.



# పులి వెనక్కి..

## వస్తున్న పులులు ఎందుకు ఉండడం లేదు?

- అడవులు, వాటి ఆవాసాలు లేకపోవడమే కారణమా?
- తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి పులుల రాక
- శీతాకాలంలో జిల్లా అడవులపై పులుల చూపు!
- ఒకటీ రెండు రోజులు ఉండి తిరిగి సొంత గూటికి పయనం

**పులి అది ఎలా ఉంటుందో ఒక్కసారైనా అడవిలో దాన్ని చూడాలనే కోరిక ప్రతీ ఒక్కరికీ మనుసులో ఉంటుంది. పులిని చూడాలని వేల రూపాయలు ఖర్చు పెట్టి మరీ పులుల సంరక్షణ కేంద్రాల్లో వైల్డ్ లైఫ్ ఫోటో గ్రాఫర్స్ దేశ వ్యాప్తంగా అన్ని వైల్డ్ లైఫ్ సాంచరీలో తిరుగుతూ ఫోటోలను వారి కెమెరాల్లో బంధిస్తుంటారు. మరి అటు వంటి బెబ్బులి పులి నయా పైసా ఖర్చు లేకుండా పక్క రాష్ట్రం నుంచి మన జిల్లా అడవుల్లో సంచరిస్తుండడం జిల్లా వాసుల అదుష్టం అనే చెప్పాలి. కానీ వచ్చిన పులికి ఇక్కడ తగిన ప్రాధాన్యం లేకుండా పోవడం బాధాకరం అనే చెప్పాలి. ఎందుకంటే జిల్లా అడవుల్లో సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికినీ పెద్ద పులి మాత్రం చుట్టపు చూపుగానే వస్తూ పోతుందే తప్ప కానీ ఈ అడవుల్లో ఉండేందుకు ఏమాత్రం ఇష్టపడడం లేదు. ఉన్నా రెండు మూడు రోజులు తప్ప ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడుతుంది అనే దానిపై జనంసాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం..**

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :**

ఆ అడవిలో ఒకే ఒక్క పులి ఉంటే చాలు. ఆ అడవి సురక్షితంగా ఉంటుంది. ఆ బెబ్బులి వంద మంది అటవీశాఖ అదికారులు నిర్వర్తించే విధులతో సమానం. ఎందుకంటే అడవిలో పెద్దపులి సంచరిస్తుందంటే అందరిలో ఓ భయం. ముఖ్యంగా అడవుల్లో కలప స్మగ్లింగ్, చెట్లు నరికేవారికి పులి గాండ్రింపే ఓ హెచ్చరిక లాంటిది. కానీ ప్రస్తుతం పులి గాండ్రింపులు ఎక్కడా వినిపించడం లేదు. అడవులు ఉన్నాయా అంటే ఉన్నాయి. అంతే! ఎక్కడో ఒక చోట ప్రతీసారీ అడవుల నరికివేత కారణంగా అక్రమ కలప స్మగ్లింగ్ కొనసాగుతుండడంతో ఉన్న అడవులు కాస్త మైదాన ప్రాంతాలుగా మారి పోతుందడం వల్ల పులికి తల దాచుకోవడం కోసం తగిన ఆవాస ప్రాంతాలు, వేటాడి తినేందుకు తగిన శాఖాహార జంతువులు, తాగేందుకు నీరు, గడ్డి మైదానాలు లేకపోవడం, కారిడార్ లేకపోవడం, వంటి సౌకర్యాలు కాన రాక పులి మన జిల్లా అడవుల్లో ఉండేందుకు అనాసక్తి చూపుతుంది.

### తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి పులుల రాక


గడిచిన గత ఐదు సంవత్సరాల కాలం నుంచి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో పులుల తాకిడి తరచూ కొనసాగుతూ వస్తోంది . పక్కనే ఉన్న మహారాష్ట్ర యావత్ మాల్ జిల్లాలో ఉన్న తిప్పేశ్వర్ పులుల సంరక్షణ కేంద్రం అభయారణ్యం నుంచి పులుల అప్పుడప్పుడు వస్తూ పోతున్నాయి. జిల్లాకు కూత వేటు దూరంలో తిప్పేశ్వర్ అడవి వ్యాపించి ఉండడం, సరిహద్దులో పెన్ గంగా నది ఉండడం వల్ల నదిని దాటుకుంటూ మన జిల్లాలో అడవులు ఎక్కువగా ఉన్న తలమడుగు, గొల్ ఘడ్ తాంసి, బోథ్, సిరిచెల్మ, బేల, భీంపూర్, తాంశీ, ఇచ్చోడ, ఉట్నూర్ డివిజన్ ఆడవుల గుండా కవ్వాల్ అడవుల వైపు పులి వెళ్ళిపోతుంది. మన జిల్లా అడవుల్లో పులికి కావాల్సిన కారిడార్ లేక పోవడం కారణంగా పులి ఈ ప్రాంతంలో ఉండడానికి ఆసక్తి చూపలేక పోతుంది. దీంతో జిల్లాలో పెద్ద పులుల చుట్టం చూపుగానే వస్తూ పోతూ పలువురి కంట పడుతున్నాయి.

### ధ్వంసం అవుతున్న వాటి ఆవాస ప్రాంతాలు.

ఎక్కడో అడవుల్లో తలదాచుకుంటున్న పులులు అవి నివసించే ఆవాస ప్రాంతాలు, అడవులు ధ్వంసం అవ్వడం, లేదా ఆక్రమణలకు గురి కావడం కారణంగా పులులు అడవులను వీడి మన కంటికి కనిపించకుండా పోతున్నాయి. క్రమంగా జిల్లా అడవుల్లో పులి అనేది లేకుండా పోతుంది. ఎక్కడో దూర ప్రాంతం నుంచి వచ్చి స్థావరం కోసం వెతికి వెతికి ఒకటి రెండు రోజులు ఉండి ఆవాసం దొరకక తిరిగి వెళ్ళిపోతుంది. శాఖాహార జంతువులు, గడ్డి మైదానాలు పెంచాల్సిన అవసరం ఉంది. పులి అడవుల్లో ఆవాసం ఏర్పరచు కోవాలంటే దానికి ఆహారం కోసం ముఖ్యంగా జింకలు, దుప్పులు, అడవి పందులు, ఇతర శాఖాహార జంతువులను వేటాడి ఆహారంగా తీసుకుంటుంది. ఈ శాఖాహార జంతువులు ఉండాలంటే గడ్డి మైదానాలు విరివిగా ఉండాలి అప్పుడే పులికి కావాల్సిన ఆహారం దొరుకుతుంది. కానీ అవేమీ లేకపోవడం కారణంగా పులికి వేటాడదానికి ఏమి దొరకక ఆహారం కోసం వెతుకుతూ పోతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఇంకా అటవీశాఖ చొరవ తీసుకుని జిల్లాలో వస్తూ పోతున్న పులులకు ఇక్కడే శాశ్వతంగా ఉండేవిధంగా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు. అదే విధంగా పులులకు వచ్చి పోయేందుకు కారిడార్ ను ఏర్పాటు చేస్తే జిల్లాలో పులి ఇక్కడే ఉండే అవకాశం లేకపోలేదు.

# బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన అవసరం

- ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించవచ్చు
- మహిళా ఆరోగ్యంగా వుంటేనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుంది
- యశోద ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన సదస్సులో మంత్రి సీతక్క




హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన సదస్సు ఆదివారం నాడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభతో పాటు పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది, సామాన్య ప్రజలు పాల్గొన్నారు. సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ "రొమ్ము క్యాన్సర్ సమాజాన్ని పట్టిపీడిస్తోంది. కానీ దాన్ని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించడం చాలా సులభం. ప్రస్తుతం అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ రాగానే జీవితం ముగిసిందనే భయాలు అవసరం లేదు. క్యాన్సర్ పేషెంట్లకు వైద్యులు విశ్వాసం కల్పిస్తే, దానిని జయించడం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. "క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం అత్యవసరం. వైద్యులు ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండాలి. యశోద ఆసుపత్రి ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమైన విషయం. కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన క్యాంపులు నిర్వహించాలి. అప్పుడే వైద్య వృత్తి సార్థకమవుతుంది" అని అన్నారు. "తెలంగాణ ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖల ద్వారా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తోంది. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయించడం ద్వారా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలకు వైద్యులు తోడ్పాటు అందించాలి" అని మంత్రి పేర్కొన్నారు. "ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇల్లు ఆరోగ్యకరంగా ఉంటుంది. ప్రజల ఆరోగ్యం సమాజ ఆరోగ్యం. వైద్యులు మానవతను జోడించి సేవ చేయాలి. సింపతి, ఎంపతి తో రోగులను చూసుకుంటే జబ్బు త్వరగా నయం అవుతుంది. డాక్టర్ల తెల్ల కోటు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో, వారి సేవా భావం కూడా అంత స్వచ్ఛంగా ఉండాలి. సమాజ అభివృద్ధిలో డాక్టర్ల పాత్ర కీలకం" అని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన నటి డా. శ్రీలీల, యశోద హాస్పిటల్ డైరెక్టర్ ఫాల్గుణ గోరుకంటి, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డా. లింగయ్య, ఆంకాలజీ విభాగం అధిపతి డా. రాజేష్, ఇతర వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.



# బ్యాలెట్ యూనిట్‌లకు ర్యాండమైజేషన్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే బ్యాలెట్ యూనిట్ (సప్లిమెంటరీ) లకు ర్యాండమైజేషన్ ఆదివారం చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ లో చేపట్టారు. నోటా తో కలిపి మొత్తం 59 అభ్యర్థులు బరిలో ఉండడంతో ఎన్నికల నిర్వహణకు అదనంగా బ్యాలెట్ యూనిట్ ల అవసరం అయ్యాయి. డీఈఓ, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కోసం బ్యాలెట్ యూనిట్ లను కేటాయించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# పెండ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య



**పర్వతగిరి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామంలో పెండ్లి కాలేదని మనస్థాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య పాల్పడి మరణించారని ఎస్ ఐ బి ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నీలం సాయిలు కుమారుడు చౌటపెల్లి తన కుమారుడు మృతుడు నీలం రాజు(30) యాదవ వ్యవసాయం గ్రామం.చౌటపల్లి తనతో పాటే వ్యవసాయం పనులు చేసుకుంటూ ఉండేవాడు సుమారు ఒక సంవత్సరం క్రితం నరాల వీక్నెస్ వలన శ్రీనివాస పినాకిల్ హాస్పిటల్ నందు ట్రీట్మెంట్ చేపించినారు, ఆ తర్వాత కొద్ది రోజులకు అతనికి మతిమరుపు వచ్చినది తనలో తానే మాట్లాడుకుంటూ ఉండేవాడు తనకు పెండ్లి చేయమని తరచూ అడిగేవాడు. తనకు పెండ్లి కావడం లేదు అని మనసులో పెట్టుకొని మన స్థాపానికి చెంది తేదీ 11. 10. 2025 రోజు ఉదయం ఏడున్నర గంటలకు పొలం పనికి వెళ్తానని చెప్పి బావి దగ్గర పురుగుల మందు తాగగా అటువైపు వెళుతున్న నీలం దయాకర్ 30 సం. అది గమనించి రాజుని బండి పై అశోక్ 35 సంవత్సరాలు సహాయంతో మెడికవర్ హాస్పిటల్ హనుమకొండ కి తీసుకువెళ్లినారు తేదీ 26. 10 .25 రోజు మధ్యాహ్నం 12.00 గంటలకు ఎంజీఎం హాస్పిటల్కు తీసుకువెళ్లగా డాక్టర్ పరిశీలించి చనిపోయినారని తెలిపినారు ఇట్టి విషయంపై ఫిర్యాదు ఇచ్చిన దరఖాస్తు పై పర్వతగిరి పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనదని తెలిపారు.

# మణిపూర్‌లో డెంగ్యూ విజృంభన

**మణిపూర్ (జనంసాక్షి) :** మణిపూర్‌లో డెంగ్యూ విజృంభిస్తున్నది. అక్టోబర్ 25 నాటికి ఆ రాష్ట్రవ్యాప్తంగా 3,334 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 2,323 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇంఫాల్ తూర్పులో మొత్తం 608 కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో గత 24 గంటల్లో 69 కొత్త కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ తెలిపింది. ఇంఫాల్ వెస్ట్‌లో కొత్తగా 38 కేసులు, ఇంఫాల్ తూర్పులో 21 కొత్త కేసులను గుర్తించినట్లు పేర్కొంది. మణిపూర్‌లోని అన్ని జిల్లాల్లో డెంగ్యూ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

# ఎంబీబీఎస్ సాధించిన విద్యార్థులకు సన్మానం

- మైనార్టీ గురుకులాల్లో చదివి.. ప్రతిభ కనబర్చి..
- కేసీఆర్ కృషి వల్లేనని కేటీఆర్, హరీశ్‌రావు వెల్లడి



**జహీరాబాద్ (జనంసాక్షి) :** జహీరాబాద్ లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు పొందిన విద్యార్థులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సన్మానించారు. ఎంబీబీఎస్ సీట్ సాధించిన మైనార్టీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను కేటీఆర్ , హరీశ్ రావు శాలువతో సత్కరించి సన్మానించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ గురుకుల పాఠశాలలు పెట్టి మైనార్టీలకు నాణ్యమైన విద్యను అందించారని తెలిపారు. తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వల్ల మైనార్టీలకు ఎంత లాభం జరిగిందనేది మీకే బాగా తెలుసు అని అన్నారు. మైనార్టీ వెల్ఫేర్ స్కూల్లో చదివి తల్లిదండ్రులకు, కేసీఆర్ కలను నిజం చేసిన మిమ్మల్ని సన్మానించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో 203 మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసింది కేసీఆర్ అని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ ఇబ్రహీం కుమారుడు ఒబేదు ఎంబీబీఎస్ సీటు సాధించారని అన్నారు. ఒబేద్ తండ్రి ఇబ్రహీం మాట్లాడుతూ.. ' మేం ఒక్కటి నుంచి ఇంటర్మీడియట్ వరకు మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివించాం. కేసీఆర్ ప్రవేశపెట్టిన మైనార్టీ గురుకులాలు మా జీవితాలను మార్చేశాయి. ఈరోజు మా కుమారుడు డాక్టర్ చదువుతున్నాడు. మేము చాలా సంతోషంగా ఉన్నాం.' అని తెలిపారు. ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని ఒబేద్ తెలిపాడు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీలకు గురుకులాలు నిర్మించి మాకు చదువు చెప్పడం మా అదృష్టమని అన్నాడు. 2016లో మైనార్టీ గురుకులాలో అడ్మిషన్ పొంది ఈరోజు ఎంబీబీఎస్ సీట్ సాధించామంటే అది కేసీఆర్ వల్లే అని తెలిపాడు. జహీరాబాద్ మైనార్టీ గురుకులాల్లో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన తాసిల్ కమల్ మాట్లాడుతూ.. నీట్ లో 444 మార్క్స్ వచ్చి గవర్నమెంట్ వనపర్తి లో సీట్ సాధించానని అన్నారు. మైనార్టీ గురుకులాల్లో మమ్మల్ని సొంత పిల్లల్లాగా చూసుకున్నారని తెలిపారు. నేను ఈరోజు ఎంబీబీఎస్ సాధించానంటే దానికి కారణం కేసీఆర్ అని పేర్కొన్నారు. మేము ఎప్పటికీ కేసీఆర్ గారికి రుణపడి ఉంటామని తెలిపారు. రైతు కుమార్తె ఫిర్దోస్ మాట్లాడుతూ.. నేను జహీరాబాద్ మైనార్టీ గురుకులాలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివానని తెలిపారు. మంచి విద్యాబోధన అందించిన కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి మేము ధన్యవాదాలు చెప్పారు.' మేం అయిదుగురం అక్క చెల్లెళ్లం. ఒక తమ్ముడు ఉన్నారు. మా తండ్రి రైతు. తినడానికి కూడా చాలా కష్టంగా ఉండేది. అలాంటి మేము ఫీజులు కట్టి స్కూళ్లలో చదవలేకపోయాం. కేసీఆర్ నిర్మించిన మైనార్టీ గురుకులాల వల్లే నేను చదవగలిగాను. ఈరోజు డాక్టర్ చదువు కూడా చదువుతున్నాను.' అని అన్నారు. ప్రియా ఏంజెల్ అని జర్నలిస్ట్ కుమార్తె మాట్లాడుతూ.. ' జహీరాబాద్ మైనార్టీ గురుకులంలో చదివి ఎంబీబీఎస్ అడ్మిషన్ సాధించారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ వనపర్తిలో ఫ్రీగా ఎంబీబీఎస్ సీట్ సాధించడం నాకు ఎంతో గర్వంగా ఉంది. 2016లో జహీరాబాద్ మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ పొంది 5వ తరగతి నుంచి ఉచితంగా ఇంటర్మీడియట్ వారికి చదివించారు. నా తండ్రి జర్నలిస్ట్. సరైన వేతనం లేక ప్రైవేట్ పాఠశాలలో చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. కొన్ని సమస్య వల్ల ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండేవాళ్ళం. కేసీఆర్ నిర్మించిన గురుకులాల మా జీవితాలను మార్చేసింది. ' అని అన్నారు.

# ఔరంగాబాద్ రైల్వేస్టేషన్ పేరు మార్పు

- శంభాజీనగర్ రైల్వే స్టేషన్‌గా మార్చిన దక్షిణ మధ్య రైల్వే



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ పేరును ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్‌గా మార్చినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. పేరు మార్పును అధికారికంగా అమలు చేస్తున్నామని.. స్టేషన్‌లోని అన్ని సైన్‌బోర్డులు, టిక్కెట్లు, ప్రకటనలు డిజిటల్ సిస్టమ్స్‌లో కొత్త పేరును అప్‌డేట్ చేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. స్టేషన్‌కు కొత్త కోడ్‌ను సీపీఎస్ఎన్ అని తెలిపింది. మహారాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు, హోం మంత్రిత్వ శాఖ ఆమోదం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే పేర్కొంది. మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీని గౌరవించే లక్ష్యంతో ఛత్రపతి శంభాజీనగర్ స్టేషన్‌కు కొత్త పేరును మార్చినట్లు పేర్కొంది. పేరు మార్పు తర్వాత స్టేషన్‌కు సంబంధించిన అన్ని సమాచారం, టికెట్లను కొత్త పేరుతోను ప్రయాణికులకు జారీ చేయనున్నట్లు రైల్వే అధికారుల తెలిపారు. ఇకపై స్టేషన్ పేరు 'ఛత్రపతి శంభాజీనగర్'గా అన్ని ప్లాట్‌ఫారమ్‌లు, రైళ్ల ప్రకటనల్లో వినిపిస్తుందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. గతంలో 2022లో ఔరంగాబాద్ నగరం పేరును ఛత్రపతి శంభాజీనగర్‌గా పేరు మార్చడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా రైల్వే స్టేషన్ పేరు మార్చడంతో ఈ ప్రక్రియ పూర్తయింది. బీజేపీ నేత, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం అక్టోబర్ 15న పేరు మార్చడానికి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం గమనార్హం.

మూడు సంవత్సరాల కిందట అప్పటి ప్రభుత్వం ఔరంగాబాద్ నగరాన్ని ఛత్రపతి శంభాజీనగర్‌గా పేరు మార్చింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు, మరాఠా రాజ్యానికి రెండో పాలకుడు అయిన ఛత్రపతి శంభాజీ గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఔరంగాబాద్‌కు గతంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పేఉ ఉంది. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం.. ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ 1900లో హైదరాబాద్ ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ప్రారంభించారు. ఛత్రపతి శంభాజీనగర్ ఒక పర్యాటక కేంద్రం. నగరం చుట్టూ అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయి. ఇందులో అజంతా-ఎల్లోరా గుహలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ లిస్ట్‌లో చేర్చింది.

## కరిగిన నిరసన

నా దేశ చైతన్యం
నిరసన ర్యాలీ కొవ్వొత్తులు
కరిగి నేలకొరిగేంతవరకే

వీధి చివరకు వీరుడిగ వెళ్లి
దిష్టి బొమ్మల దహనంలో
అలసి సొలసేంతవరకే

ఇంటి అరుగుపై దేశ బాగుకై
వెన్నుచూపని చర్చాయుద్ధాలు
భార్య వేసే భోజన విరామ కేకల వరకే

ఈ దేశ నాశనం చేసేటోళ్ళంత మన కుల
మత జెండాలు చేతపట్టేంత వరకే

నోటు కట్టలతో మన ఓటు స్వరాలను
పీకనొక్కి మూగపోయేంతవరకే

మొదటి పేజీలో తాటికాయంత తాజా వార్త
కడ పేజీన కంటి తుడుపులా
కనుమరుగయ్యేంతవరకే

మరెందరో నిర్భయల
నిస్సహాయతను
సామాజిక మాధ్యమాల్లో షేరు
చేసేంతవరకే

నా దేశ చైతన్యం
నిండిపోయిన స్వార్థ గుండెలతో
మేలుకొనక నిదుర పోయేంతవరకే



నేపా సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత, విజయవాడ. 8639442397

## దూరం

కాళ్ళల్లో సత్తువ ఉంటే
గమ్యం దూరం కాదు
హృదయం లో ప్రేమ ఉంటే
బంధువులు దూరం కారు

రేడియమ్

# నాయకులారా.. ప్రజాస్వామ్యపు అర్థాన్ని పరిరక్షించండి

**"ప్రజాస్వామ్యం" అనే పదం యొక్క ఆవిర్భావం ప్రాచీన గ్రీకు నాగరికతలో జరిగింది. గ్రీకు భాషలోని "డెమోక్రటియా" అనే పదం నుంచి ఇది పుట్టింది. ఇందులోని "డీమోస్" అంటే ప్రజలు, "క్రటియా" అంటే పాలన లేదా శక్తి. అని అర్థం. దీని ప్రకారం ప్రజాస్వామ్యం అంటే "ప్రజల పాలన" లేదా "ప్రజల చేత నడిచే ప్రభుత్వం." ఈ ప్రజాస్వామ్య భావనకు పుట్టినిల్లు గ్రీకు దేశంలోని ఏథెన్స్ నగరం, అక్కడ ప్రతి పౌరుడికీ పాలనలో నేరుగా పాల్గొనే హక్కు ఉండేది. ఆ విధానాన్నే "ప్రత్యక్ష ప్రజాస్వామ్యం" అని పిలిచారు. గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రజాస్వామ్యాన్ని "ప్రజలచే ఏర్పడే ప్రజల ప్రభుత్వం"గా వివరించాడు. అనంతరం ప్రముఖ అమెరికా దేశ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ప్రజాస్వామ్యం అంటే "ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల ద్వారానే నడిచే ప్రభుత్వం" అని అద్భుతంగా నిర్వచించాడు. కాలక్రమేణా ఈ భావన ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి, అనేక దేశాల పాలనా విధానాలకు మార్గదర్శకంగా నిలిచింది. భారతదేశం కూడా తన రాజ్యాంగ ప్రస్తావికలో "భారతదేశం ఒక ప్రజాస్వామ్య గణతంత్ర దేశం" అని గర్వంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం అనేది ప్రజల సంకల్పానికి ప్రతిబింబం, ప్రజల హక్కులకు పరిరక్షణ, ప్రజల శ్రేయస్సుకై నడిచే పటిష్టమైన జవాబుదారీ పాలనా విధానం.**

రాచరిక వ్యవస్థలను రూపుమాపి, ప్రజలే ప్రభువులు అనే భావంతో ఏర్పడిన ప్రజాస్వామ్యంలో రాజకీయం ప్రధాన పాత్రను పోషిస్తుంది. రాజకీయం అంటే ప్రజా శ్రేయస్సు కోసం అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి, వాటిని సక్రమంగా అమలు చేయడానికి పన్నే యుక్తి. ప్రజాస్వామ్యంలో ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి కోసం అవసరమైన పాలన యుక్తులను పన్నే ప్రజా నాయకులను ప్రజలే ఎన్నుకుంటారుబీ వారినే రాజకీయ నాయకులు అంటారు. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజకీయం అంటే పాలనా యుక్తిబీ ఆ యుక్తిని అమలు చేసే వారిని రాజకీయ నాయకులని అంటారు. కానీ నేటి పరిస్థితుల్లో రాజకీయం అంటే ఒకటి చెప్పి మరొకటి చేసే కుయుక్తిగా, నమ్మించి మోసం చేసే సాధనంగా మారిపోయింది. ఒకప్పుడు పాలనాదక్షతకు ప్రతీకగా ఉన్న రాజకీయం నేడు కపటానికి ప్రతిరూపంగా మారిపోతోంది. రాజకీయం చేయడం అనేది ఇప్పుడు ఒక మోసపూరితమైన మాటగా మిగిలిపోతోంది. మన కులమని, మన మతమని, మన ప్రాంతమని ప్రజలను ఎక్కడికక్కడ విభజిస్తూ తమ కుయుక్తులను పన్నుతున్నారు నేటి రాజకీయ నాయకులు. దీంతో రాజకీయాలు రోజురోజుకీ మరింత దిగజారిపోతూ ప్రజాస్వామ్యం పునాదులను కదిలించి వేస్తున్నాయి.



ప్రస్తుత రాజకీయ నాయకుల ఆలోచనా విధానంలో, మానసిక స్థితిలో గణనీయమైన అనైతిక మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతి చిన్న కార్యక్రమాన్నీ ఎంతో గొప్పగా చెప్పుకునే నాయకులు, అదే కార్యక్రమాలను వారి ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు నిర్వహిస్తే, వారిని తీవ్ర పదజాలంతో విమర్శించడం నేటి రాజకీయ సంస్కృతిగా మారిపోయింది. ఒక రాజకీయ పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని గుడ్డిగా మరో పార్టీ వ్యతిరేకించడమే రాజకీయమని భావించే పరిస్థితి ఏర్పడింది. ప్రెస్ మీట్లు పెట్టి నిర్మాణాత్మక చర్చలను జరుపుకుండా, సద్విమర్శలను చేయకుండా, మంచి సలహాలను సూచించకుండా ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు, పరుష పదజాలంతో దూషణలు చేసుకుంటూ, ప్రజాభివృద్ధికి ఉపయోగించవలసిన విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. నేటి రాజకీయ పార్టీలు ప్రజల కోసం పనిచేసే అత్యుత్తమ సేవా రంగాలుగా కాకుండా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే అవినీతి వ్యాపార సంస్థలుగా మారిపోతున్నాయి. రాజకీయ పార్టీలు వాటిని నడిపే నాయకుల ఆలోచనా ధోరణి ఈ విధంగా ఉంటే ప్రజాస్వామ్య విలువలు క్రమక్రమంగా అంతరించిపోయి, ప్రజా ప్రభుత్వాలలో 'ప్రజా' అనే పదం పోయి ప్రభుత్వాలు మాత్రమే మిగులుతాయి.

ప్రజలు ఓటు ద్వారా ఎన్నికాబడిన "ప్రజా ప్రభుత్వాలు" ప్రజలకు శాశ్వతమైన అభివృద్ధిని అందించకుండా వారిని ఆకర్షించడానికి ఎటువంటి దీర్ఘకాలిక ప్రయోజనాలు లేని సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ ప్రజలను మోసం చేస్తున్నాయి. సమాజ, దేశ అభివృద్ధి కంటే వారి పార్టీ ప్రయోజనాలే ప్రధానమనేలా నేటి రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు ప్రజల ఓట్ల కోసం తప్పు అని తెలిసినా తప్పుడు హామీలు ఇస్తూ బలహీనతలతో ఆడుకుంటున్నారు ఈ రాజకీయ నాయకులు. ప్రజలు కూడా తాత్కాలికమైన ప్రయోజనాలకు ఆశపడి అప్రయోజకులను తమ నాయకులుగా ఎన్నుకొని వారి అభివృద్ధిని వారే నాశనం చేసుకుంటున్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ప్రభుత్వాలు మారుతున్నా, పాలనా విధానాలలో మాత్రం ఎటువంటి మార్పు రావడం లేదు. ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా సమాజ అభివృద్ధి కంటే వారి పార్టీ అభివృద్ధికే పెద్దపీట వేస్తుంది. నేటి ప్రజాస్వామ్యంలో ప్రజలు ఐదేళ్లకోసారి, ఓటు వేసే ముందు మాత్రమే ఈ రాజకీయ నాయకులకు కనిపిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యపు అర్థాన్ని అపహాస్యం చేస్తుంది.

రాజకీయ నాయకులు చేసే అక్రమాలు, తప్పులను, వారిని గుడ్డిగా అభిమానించే అభిమానులు ఏమాత్రం ఆలోచించకుండా సమర్థిస్తూ ఉంటారు. వారు అభిమానించే నాయకుడు తప్పు చేసినప్పుడు అతనిని ఎవరైనా విమర్శిస్తే, ఈ అభిమానులు సామాజిక మాధ్యమాలలో తమ నాయకుడిని విమర్శించిన వారిపై విపరీతమైన దుర్భాషలతో పోస్టులు పెడుతున్నారు. విమర్శించిన వారిని కించపరిచే విధంగా మీమ్స్, మార్ఫిడి ఫోటోలు అసభ్యంగా తయారు చేసి షేర్ చేస్తున్నారు. ఇది సమాజానికి చేటుచేసే విష సంస్కృతి. నిజమైన అభిమానం అంటే, ఒక నాయకుడిని గుడ్డిగా సమర్థించడం కాదు. ఆ నాయకుడు చేసే మంచి పనుల నుంచి స్ఫూర్తిని పొందడం, తప్పు జరిగినప్పుడు సద్విమర్శలు చేయడం. కానీ, గుడ్డి అభిమానంతో అసభ్యకరమైన చర్చలు, పోస్టులు సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తూ సంఘ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారు ఈ అభిమానులు. నేటి రాజకీయ నాయకులు మాయ మాటలతో అభిమానులను రెచ్చగొట్టి వారి స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు. ఇలాంటి ఆలోచనా విధానాన్ని నాయకులు మార్చుకోవాలి. లేకపోతే సమాజంలో ఐక్యత దెబ్బతింటుంది. నాయకులు తమ అభిమానులకు సరిగ్గా మార్గనిర్దేశం చేయాలి. ఎందుకంటే, తప్పు చేసినా కూడా పొగిడే అభిమానులను కలిగి ఉన్న నాయకుడు ఎప్పటికీ నైతికంగా అభివృద్ధి చెందలేడు. కాబట్టి, నాయకులు తమ అభిమానుల్లో స్ఫూర్తిని రగిలించి, వారు సమాజానికి గొప్పగా ఉపయోగపడేలా తీర్చిదిద్దాలి.

ముగింపు మాటగా... ప్రజాస్వామ్యాన్ని సమాజంలో పటిష్టంగా నిర్మించాలంటే కేవలం చట్టాలను రూపొందించడం మాత్రమే కాక, వాటిని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో, సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలోనే వారి పాత్ర ఆగిపోకూడదు. తమ ఓట్ల ద్వారా నాయకులను ఎన్నుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ప్రజలు, ఆ ప్రభుత్వ బాధ్యతలను నిర్వహిస్తున్న నాయకులు ప్రజాస్వామ్య పరిరక్షణకై సమన్వయంతో కలిసి పనిచేయాలి. నాయకులు ప్రజలు వారికి కట్టిపెట్టిన అధికారాన్ని ప్రజా శ్రేయస్సు కోసం వినియోగించాలి. నాయకులు పెత్తనం చెలాయించే అధికారులుగా కాక, ప్రజాక్షేమం కోరుకునే సేవకులుగా పనిచేయాలి. అభిమానులు వ్యక్తులను కాక, ఆ వ్యక్తులు చేసే గొప్ప కార్యక్రమాలను అభిమానించాలి. తమ అభిమాన నాయకుడిపై విమర్శలు వచ్చినప్పుడు, ఆ విమర్శలలో నిజాన్ని విశ్లేషించి, నిర్మాణాత్మకంగా స్పందించాలి. అంతేగాని, ఒకరు విమర్శించగానే గుడ్డిగా తమ అభిమాన నాయకులను సమర్థించకూడదు. ప్రజాస్వామ్యంలో విశ్లేషకుల నిర్మాణాత్మక చర్చలు, విశ్లేషణలు, ప్రతిపక్షాల సద్విమర్శలు, పోరాటాలు అన్నీ ముఖ్యమైన అంశాలే. ఇవి ప్రజలకు విషయాలపై అవగాహన కలిగిస్తాయి. ప్రభుత్వాలను పరిపాలించే రాజకీయ నాయకులు, వారిని ఎన్నుకున్న ప్రజలు, నాయకుల చుట్టూ ఉన్న అభిమానగణం, ప్రభుత్వ అధికారులు, ప్రతిపక్షాలు అందరూ సమిష్టిగా, అవగాహనతో చట్టాలను అమలు చేయగలిగితే ప్రజాస్వామ్యపు నిజమైన అర్థం శాశ్వతంగా పరిరక్షించబడుతుంది.



నసుబోలు రాజశేఖర్
తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి
9885739808,8330969808

## మృత్యు కుహరాలు

పిల్లలు ఆడుకునే రంగురంగుల బొమ్మలు కావవి
కావలి కారులు లేని మృత్యు కుహరాలు
పైన ధగధగలు లోన ప్రమాణాల లేమి

ఎందుకు ఎక్కుతారో
ఎందుకు దిగుతారో తెలియదు
ఇంపైన సీటు ఇరుకిరుకు దారిని గమనింప చేయదు
కాలం వెంట పరుగు ఈ లోకం నుండి నిష్క్రమణ దాకా
ఎక్కడెక్కడో రిజిస్ట్రేషన్.. మరెక్కడో ఫిట్నెస్



వెరసి తెలుగు రాష్ట్రాల్లో రోడ్లపై తిరుగు
టూరిస్ట్ పర్మిట్ లు స్టేజి క్యారియర్లు గా విచ్చలవిడి గా
కళ్లు మూసుకున్న కబోది గా రాజ్యాలు
లంచగొండి రాజ్యంలో
ప్రాణాలకు వెలకట్టే రాజ్యంలో
మానవీయ విలువలను చంపేసే పెట్టుబడి కరాళ నృత్యం
ప్రజారోగ్యం ప్రజారవాణా ఎక్కడుంటే క్షేమమో
ఎరుగని జనం
పెట్టుబడి రాజ్యం చెట్టపట్టాలేసుకొని తిరిగినా
నోరు పెగలదు
వెలను ప్రశ్నించరు
ఊరవతల దాబాల్లో ఏం సేవిస్తున్నా కిమ్మనరు
వేగాన్ని ఆస్వాదిస్తారు
ఏ క్షణం ఏం జరుగునో ఎరుగరు
ప్రజా రవాణా కోసం వెంపర్లాడరు
సౌలభ్యం మాటున దాగిన చీకటి కోణాలు వెలికి తీసేదెవరు?!
ప్రజా ఉద్యమాల నిర్మాణం ఆగిందెప్పుడో
అరకొర వున్నా మద్దతు లేక నిస్సారంగా
ఓటు అమ్ముకున్నప్పుడే చస్తూ బతికే బతుకును ఆహ్వానించారులే!
కొన్ని కన్నీటి బొట్లు ఓ వారం
మళ్లీ షరా మామూలే! ఎక్కడి దొంగలు అక్కడే
గప్ చుప్!!


గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

# తెలంగాణ సాహిత్యంలో రూఢి కాని కవులు

తెలంగాణ సాహిత్య చరిత్రలో కవులు, రచయితలు, ప్రజా గేయకారులు తమ అనుభవాలనూ, సామాజిక చైతన్యాన్నీ ప్రతిబింబిస్తూ ఒక ప్రత్యేక ధారను సృష్టించారు. అయినప్పటికీ ఈ సాహిత్య ప్రవాహంలో కొందరు ప్రతిభావంతులు "రూఢి కాని కవులు"గా మిగిలిపోయారు. అంటే ప్రామాణిక సాహిత్య చరిత్రల్లో స్థిరమైన గుర్తింపు పొందలేకపోయిన వారు. ఏ సాహిత్య చరిత్రలోనైనా వివాదాలు, ఆక్షేపణలు సహజం. ప్రాచీన సాహిత్యం విషయంలో సరైన ఆధారాల లేమి, పాండులిపుల నష్టాలు, కాలనీతీతి మార్పులు వంటి అంశాలు చరిత్రకారులకు సమస్య లుగా మారాయి. ఉదాహరణకు రేణుకా చరిత్ర లేదా కాకతీయ చరిత్రలో కవుల పేర్ల గందరగోళం, కృతుల సమీకరణంలో విభేదాలు తరచూ ప్రస్తావనకు వస్తాయి. ఇలాంటి వివాదాలు కేవలం పూర్వయుగ సాహిత్యంలోనే కాక, ఆధునిక తెలంగాణ కవిత్వ చరిత్రలో కూడా కనిపిస్తాయి. ఎవరు మొదటి విప్లవకవి? ఎవరు మొదటి ప్రజా గేయకారుడు? అనే ప్రశ్నలపైనే భిన్నాభిప్రాయాలు ఉత్పన్నమయ్యాయి. ప్రాచీన సాహిత్యానికి సరైన ఆధారాలు లభ్యం కాకపోవడం ప్రధాన సమస్య. శతాబ్దాలుగా మౌఖికంగా వస్తూ, వచన రూపంలో ఆలస్యంగా రాసిన కవితలు, పద్యాలు పరిశోధనలో వివిధ వేరియంట్లుగా కనబడుతున్నాయి. తెలంగాణలో పల్లె గాయకులు, హరికథకులు, వందేమాతరం ఉద్యమకారుల పాటలు తరచుగా రచయిత పేర్లతో కూడి రాయబడలేదు. ఈ విధంగా అనేక కవుల గుర్తింపు చరిత్రలో చెదిరిపోయింది. ఇప్పటి తెలంగాణ సాహిత్యంలో కవులకు తగిన గుర్తింపు రావడం నేటి పరిశోధకుల నిరంతర కృషి ఫలితం. హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థలలో తెలంగాణ సాహిత్య పరిశోధనకు వేరే శాఖలుగా ఏర్పడటం దీనికి కారణం. ఈ పరిశోధకులు ఆర్కైవ్‌లలో దాగిన గ్రంథాలను వెలికితీశారు. ఉదాహరణకు జచ్చుర్ల నర్సయ్య కవిత్వం మీద డా. రమణ రెడ్డి చేసిన పరిశోధన (డాక్టరల్ థీసిస్, 2020) ఆ కవి చరిత్రలోని కొత్త కోణాలను వెలికితీసింది. ఇలాగే సి. కృష్ణమూర్తి యాదవ్ రచించిన తొక్కుడు బండ (ప్రచురణ: 2005, తెలంగాణ పబ్లికేషన్స్) ఆధునిక తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబించిన అగ్ర కృతి. ఆయన పేరు ఆ పుస్తకానంతరం "తొక్కుడు బండ కృష్ణమూర్తి"గా పరిణమించడం సాహిత్య పరిణామంలో ఒక ఆసక్తికర సంఘటన. ఆయన కవిత్వంలో గ్రామీణ జీవితంలోని దారిద్ర్యం, రాజకీయ మాయ, ప్రజా నిబద్ధత ప్రతిబింబించాయి.

**ఇంకా సంశయాత్మకంగా మిగిలిన కవులు**


ఇప్పటికీ కొందరు కవుల వివరాలు పరిశోధనలో సంశయాత్మకంగానే ఉన్నాయి. ఉదాహరణకు మూడవ దశలో ఉద్యమ కవిత్వం రాసిన శాలివాహన వెంకటేశం, పల్లెల్ల రామచంద్రరావు, పెద్దింటి సత్తయ్య వంటి రచయితల గ్రంథాలు లభ్యమైనప్పటికీ, వారి జీవితం, రచనల తేదీల గురించి స్పష్టత లేదు



**తెలంగాణ సాహిత్య చరిత్రలో ఇంకా అనేకమంది కవుల స్థితి రూఢి కాని దశలోనే నిలిచిపోయింది. "రూఢి కాని" అనగా నిర్ధారణ జరక్కపోవడం, లేదా ఒక కవి యొక్క కాలం, ప్రదేశం, రచనల స్వరూపం, భాషా శైలీ మొదలైన అంశాలపై ఖచ్చితత్వం లేకపోవడం అని అర్థం.**

(మూలం: ఫేస్‌బుక్ వ్యాసం "తెలంగాణ మరచిన కవులు", పేజీ: తెలంగాణ సాహిత్య వేదిక, పోస్ట్ తేదీ 15 మార్చి 2023). ఈ కవుల కవిత్వంలో భాషా సాంద్రత, సాంఘిక కంటెంట్, వ్యంగ్య ప్రతీకలు ఉన్నప్పటికీ, పాఠ్య సంరక్షణ లేకపోవడం వల్ల అవి సాహిత్య చరిత్రలో చేరలేదు. కొందరి కవితలు గ్రామీణ పత్రికల్లో మాత్రమే ముద్రించబడి ఆర్కైవ్‌లలో దొరకడం లేదు. రూఢి కాని కవుల కవిత్వం సాధారణంగా ప్రజా భాషలో, పల్లె పదసంపదలో, సామాజిక అసమానతలపై వ్యంగ్యంతో నిండిఉంటుంది. ఈ కవితల్లో 'వ్యంగ్య' (irony) ప్రధాన అలంకారంగా ఉపయోగిస్తారు ు ఉదా: "రైతు పొలం నీళ్లలో మునిగి బంగారు పంటను కడుతాడు / పాలసాల కప్పు మాత్రం మేనేజర్ కొడుక్కే దక్కుతుంది" ు అనే పంక్తులలో 'వ్యంగ్య వ్యతిరేకత' (ironic contrast) స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో శ్లేషం (pun), రూపకం (metaphor) అలంకారాలు స్పష్టంగా కనబడతాయి. వారి వర్ణన నైపుణ్యంలో దృశ్యమానం, ఆత్మస్పర్శ, ప్రతీకాత్మక భాష విస్తృతంగా ఉంటుంది. ఈ కవిత్వం ప్రధానంగా 'ప్రజా వాస్తవికత' (Peoples Realism) కు ఉదాహరణ. వీటిలో పాత్రలు ు రైతు, కూలి, గిరిజనుడు, ముసలమ్మ, కులవృత్తి కర్మికుడు ు ఇవే ప్రధాన ప్రతినిధులు. రూఢి కాని కవులను విశ్లేషించే సిద్ధాంతం "సాహిత్యంలోని దరిద్రం కాదు, చరిత్ర రికార్డు లోపం" అనే నిబద్ధతతో ఉంటుంది. ఈ దృక్పథం ప్రకారం, కవుల ప్రాముఖ్యతను వారి చరిత్రలో ఉన్న స్థానంతో కాదు, వారి భాషా సామాజిక ప్రభావంతో కొలవాలి (గ్రంథం: సాహిత్య సామాజిక శాస్త్రము, ప్రొ. వెంకటస్వామి, తెలంగాణ యూనివర్సిటీ ప్రచురణ, 2018). తెలంగాణ సాహిత్యంలో రూఢి కాని కవులు అసలు సాహిత్య చరిత్రలోని 'మౌన వర్గం'. వీరిని వెలికి తీయడం అంటే తెలంగాణ భాషా, సంస్కృతి, రాజకీయ చరిత్రను పునర్నిర్మించడం. ఆధునిక పరిశోధకులు ఈ దిశగా ముందడుగు వేస్తున్నారు. భవిష్యత్‌లో వీరి కవిత్వం పూర్తి గ్రంథరూపంలో వెలువడితే, అది తెలంగాణ సాహిత్య చరిత్రకు నూతన పుటగా నిలుస్తుంది. తెలంగాణ సాహిత్య చరిత్రలో ఇంకా అనేకమంది కవుల స్థితి రూఢి కాని దశలోనే నిలిచిపోయింది. "రూఢి కాని" అనగా నిర్ధారణ జరక్కపోవడం, లేదా ఒక కవి యొక్క కాలం, ప్రదేశం, రచనల స్వరూపం, భాషా శైలీ మొదలైన అంశాలపై ఖచ్చితత్వం లేకపోవడం అని అర్థం. తెలుగు సాహిత్య చరిత్రలో, ముఖ్యంగా తెలంగాణకు చెందిన కవుల విషయంలో, ఈ నిర్ధారణ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. కొందరు కవులు కాల పరంగా స్పష్టత లేకుండా, మరికొందరు ప్రాంత నిర్ధారణలో సందిగ్ధతతో, ఇంకొందరు రచనాధికారంపై వివాదాస్పద స్థితిలో మిగిలారు. ఇంతకు ముందు చెప్పినట్లు ఏ సాహిత్య చరిత్రలోనైనా వివాదాలు, ఆక్షేపణలు సహజమే. కారణం ప్రాచీన సాహిత్యానికి సరైన ఆధారాలు లభ్యం కాకపోవడం, లభ్యమైన సమాచారంలో సమన్వయ లోపం ఉండటం. తెలంగాణ సాహిత్య చరిత్రలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. అయినప్పటికీ నేటి పరిశోధకులు, ఉదాహరణకు సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారు ముంగిలి పుస్తకంలో (గ్రంథం: ముంగిలి – తెలంగాణ కవుల విశ్లేషణ, రచయిత: సుంకిరెడ్డి నారాయణరెడ్డి, 2016) అందించిన ఆధారాలు తెలంగాణ కవులపై కొత్త దృక్కోణాలను వెలికితీశాయి. ఈ వ్యాసం లక్ష్యం కూడా అదే. సుంకిరెడ్డి ప్రస్తావన చేసిన కవుల సూచనల ఆధారంగా ఇంకా నిర్ధారణకు రాని కవులను పరిచయం చేయడం.

**(మిగతా భాగం రేపటి సంచికలో..)**



డా. ఐ.చిదానందం
తెలుగు అధ్యాపకులు
8801444335

# అదానీ బెయిలౌట్..
# ప్రజాధనం దుర్వినియోగమా?




భారత ఆర్థిక వ్యవస్థలో కార్పొరేట్–ప్రభుత్వ సంబంధాలు ఎప్పుడూ వివాదాస్పదమే. ఇటీవల వాషింగ్టన్ పోస్ట్ పత్రిక ఒక దర్యాప్తు నివేదికలో, మోదీ ప్రభుత్వం అదానీ గ్రూపును ఆదుకోవడానికి ప్రజా నిధులను ఉపయోగించినట్లు వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, అమెరికా లాంటి విదేశీ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనకడుగు వేసిన సమయంలో, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నుంచి దాదాపు 3.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.33000 వేల కోట్ల రూపాయలు) అదానీ సంస్థల్లో పెట్టుబడులుగా మళ్లించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ప్రభుత్వం ఒక ప్రైవేటు సమూహానికి అనుకూలంగా చేసిన చర్యగా కనిపిస్తోంది. ఈ విషయం భారత రాజకీయాల్లో కలకలం రేపుతోంది, ముఖ్యంగా అదానీపై అమెరికాలో జరుగుతున్న దర్యాప్తుల నేపథ్యంలో. అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీకి మోదీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చాలా కాలంగా ఆరోపణలు వస్తున్నాయి. 2023 లో హిండెన్బర్గ్ రీసెర్చ్ నివేదిక అదానీ సంస్థల్లో స్టాక్ మానిప్యులేషన్, ఆర్థిక అవకతవకలు ఉన్నాయని పేర్కొంది. దీంతో అదానీ షేర్లు భారీగా పడిపోయాయి. ఇప్పుడు, అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ (డీఓజే) మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) అదానీపై మరిన్ని ఆరోపణలు చేశాయి. 2024 నవంబర్‌లో వెలువడిన ఇండిక్ట్‌మెంట్ ప్రకారం, అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ సోలార్ ప్రాజెక్టుల కోసం భారత అధికారులకు 250 మిలియన్ డాలర్ల లంచాలు ఇచ్చినట్లు ఆరోపించారు. ఈ లంచాలను దాచి, అమెరికా పెట్టుబడిదారుల నుంచి 2 బిలియన్ డాలర్లు సేకరించినట్లు తెలిపారు. ఇంకా 2025 అక్టోబర్ నాటికి భారత అధికారులు అమెరికా సమన్లు అందించడంలో విఫలమయ్యారని ఎస్ఈసీ కోర్టుకు తెలిపింది. ఇవి అదానీ గ్రూపు ఆర్థిక స్థితిని మరింత బలహీనపరుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో వాషింగ్టన్ పోస్ట్ నివేదిక మరింత ఆసక్తికరం. మే 2025 లో ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, ఎల్ఐసీ సమన్వయంతో ఒక ప్లాన్ రూపొందించారని అది పేర్కొంది. అదానీ పోర్ట్స్ కోసం 585 మిలియన్ డాలర్ల బాండ్ ఇష్యూ జరిగింది. దీనిని ఎల్ఐసీ మాత్రమే సబ్‌స్క్రైబ్ చేసింది. ఇంకా, అదానీ గ్రీన్ ఎనర్జీ, అంబుజా సిమెంట్స్ లాంటి సంస్థల్లో 3.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెంచారు. ఈ చర్యలు అదానీ గ్రూపు రుణాలు (2024లో 20 శాతం పెరిగాయి) తగ్గించడానికి సహాయపడ్డాయి. కానీ, ఇది ప్రజా నిధుల దుర్వినియోగమని విమర్శకులు అంటున్నారు. ఎల్ఐసీకు 30 కోట్ల మంది పాలసీ హోల్డర్లు ఉన్నారు, వీరు ఎక్కువగా మధ్యతరగతి, గ్రామీణ ప్రజలు. వారి పొదుపులను రిస్క్ పెట్టుబడుల్లో పెట్టడం సరికాదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, హిండెన్బర్గ్ నివేదిక తర్వాత ఎల్ఐసీ అదానీ షేర్లలో రూ.7,850 కోట్ల రూపాయల నష్టపోయింది.

ప్రతిపక్షాలు ఈ విషయాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్, మల్లికార్జున ఖర్గేలు ఇది 'క్రోనీ క్యాపిటలిజం' అని పిలుస్తున్నారు. పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ దర్యాప్తును ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎక్స్ (ట్విట్టర్)లో కూడా ఈ విషయం హాట్ టాపిక్. కొన్ని పోస్టులు మోదీ–అదానీ బంధాన్ని 'గుజరాత్ మాఫియా' అని వర్ణిస్తున్నాయి, మరికొన్ని ఎల్ఐసీ పెట్టుబడులు మార్కెట్ ఆధారితమని డిఫెండ్ చేస్తున్నాయి. అయితే, అదానీ గ్రూపు ఈ ఆరోపణలను 'నిరాధారం' అని ఖండించింది. ఎల్ఐసీ కూడా తమ పెట్టుబడులు డ్యూ డిలిజెన్స్‌తో చేస్తామని, ఎలాంటి ప్రభుత్వ ఒత్తిడి లేదని చెప్పింది. అదానీ బాండ్లు 10–సంవత్సరాల ప్రభుత్వ సెక్యూరిటీల కంటే 8.02 శాతం అధిక రాబడి ఇస్తున్నాయని వారు వాదిస్తున్నారు. విశ్లేషణాత్మకంగా చూస్తే, ఇది భారతదేశంలో క్రోనీ క్యాపిటలిజం సమస్యను హైలైట్ చేస్తుంది. అదానీ గ్రూపు ఓడరేవులు, విద్యుత్, మౌలిక సదుపాయాల్లో విస్తరణ జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. కానీ, దాని కోసం ప్రజా సంస్థలను ఉపయోగించడం సరికాదు. సెబీ హిండెన్బర్గ్ ఆరోపణల్లో కొన్నింటిని తోసిపుచ్చింది. కానీ ,యుఎస్ దర్యాప్తులు కొనసాగుతున్నాయి. ఇది పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఆస్ట్రేలియా ఎనర్జీ ఫైనాన్స్ డైరెక్టర్ టీమ్ బక్లీ లాంటి నిపుణులు ఇది 'క్రోనీ క్యాపిటలిజం సజీవంగా ఉంది' అని అంటున్నారు. చివరగా, ఈ వివాదం ప్రభుత్వం, కార్పొరేట్ల మధ్య సమతుల్యత గురించి ప్రశ్నలు లేవనెత్తుతుంది. పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా ప్రజా ధనం దుర్వినియోగం అయితే, అది సామాన్యులకు నష్టం. స్వతంత్ర దర్యాప్తు అవసరం, లేకపోతే ఇలాంటి సమస్యలు మరిన్ని వస్తాయి.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం అవసరం..

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- ఘనంగా ప్రారంభమైన సిఐటియు మేడ్చల్ జిల్లా నాలుగో మహాసభలు..




**కాప్రా, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** కార్మిక వర్గ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గంను ఐక్యం చేస్తూ సిఐటియు పోరాటాలను ఉధృతం చేయడం తక్షణ కర్తవ్యం అన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు.సిఐటియూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాలుగో మహాసభలు సందర్భంగా ఆదివారం చర్లపల్లి లోని సిఐఎ ఇండస్ట్రియల్ అసోసియేషన్ హాల్ (కామ్రేడ్ ఆదిరెడ్డి నగర్) రెండో రోజు ప్రతినిధుల సమావేశంతోఘనంగా ప్రారంభమయ్యాయి. మేడ్చల్ జిల్లా సీఐటీయూ సీనియర్ నాయకులు, బిఈఎల్ పరిశ్రమ యూనియన్ మాజీ అధ్యక్షులు జె.రాఘవరావు సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా మహాసభ ప్రతినిధులను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బరితెగించి కార్మిక వ్యతిరేక చర్యలను దూకుడుగా అమలు చేస్తున్నది. యజమానుల లాభాల కోసం కార్మికుల శ్రమను మరింత దోచుకోవడానికి 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కోరలు లేని నాలుగు లేబర్ కోడ్లుగా మార్చింది అన్నారు. ఫలితంగా దశాబ్దాల తరబడి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులు హరింపబడుతాయి. బానిసల మాదిరి వెట్టిచాకిరి చేయవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. దేశంలోని కోట్లాది కార్మికవర్గం ఈ లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తున్నది. కార్మిక ప్రయోజనాలకు ముప్పుగా పరిణమించిన ఈ 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి అన్నారు.

### కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చర్యలు ..

కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశంలో అవలంభిస్తున్న ఆర్థిక విధానాలు, వ్యూహాత్మక అమ్మకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ వంటి చర్యలతో ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరుస్తున్నాయి. ప్రభుత్వరంగం అంటే కేవలం ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనాలు మాత్రమే కాదు. ప్రభుత్వరంగం ద్వారా దేశ మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు లభ్యమవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల వల్ల సమాజంలో అణగారిన తరగతుల హక్కులకు మేలు జరుగుతున్నది. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వరంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నది. 2024లో మూడోసారి అధికారాని కొచ్చిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 100 రోజుల్లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయాన్ని వేగవంతం చేసింది. దేశ ఆర్థిక స్వావలంబనకు తూట్లు పొడుస్తున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు, ఈ సంస్థల్లోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చెయ్యాలని సీఐటీయూ కోరుతుందన్నారు.

### కేంద్రం వైఫల్యాలతో సంక్షేమ స్కీంలు దెబ్బతిన్నాయి..

దేశవ్యాప్తంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, గ్రామీణ ఉపాధి హామీ, ఆరోగ్యశ్రీ, ఎఎన్ హెచ్ఎం వంటి 63 సంక్షేమ పథకాలు మానవ వనరుల అభివృద్ధికి పునాది వంటివి. అయితే బిజెపి ప్రభుత్వం ప్రతి ఏడాది ఈ పథకాల బడ్జెట్ను తగ్గిస్తూ, కేవలం 60% నిధులే విడుదల చేస్తోంది. మిగతా భారాన్ని రాష్ట్రాలపై మోపుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలతో స్కీంల ప్రైవేటీకరణకు దారితీస్తూ, ఆధార్ లింక్, ప్యాకేజీ ఫుడ్, నగదు బదిలీ, సెంట్రలైజ్డ్ కిచెన్ వంటి విధానాల ద్వారా సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారు. ఆరోగ్యం, విద్య, పోషణ రంగాల్లో ప్రభుత్వ బాధ్యతను తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఈ చర్యలు పేద ప్రజల సంక్షేమానికి తీవ్ర హానికరం.

### కార్మికుల వేతనాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్మెంట్లలో కనీస వేతనాల డ్రాఫ్ట్ జి.ఓలు అశాస్త్రీయంగా ఉందన్నారు. పాత వీడిఎను కలిపి చూపారే తప్ప కొత్తగా ఒక్క పైసా పెంపు చేయలేదని విమర్శించారు. సుమారు కోటి 20 లక్షల కార్మికులు ఈ వేతనాలపై ఆధారపడి ఉన్నారని, గత 12 ఏళ్ళ తర్వాత సరైన సవరణలు జరగలేదని పేర్కొంది. 5 ఏళ్లకు ఒకసారి సవరించాల్సిన వేతనాలను 12%-%18 ఏళ్లుగా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు పారిశ్రామిక యజమానులకే లాభం చేకూరుస్తున్నాయని అన్నారు. గిగ్, ప్లాట్ఫామ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలన్ని పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మతసామరస్యానికి ప్రమాదం వాటిల్లే మతోన్మాదన్ని వ్యతిరేకిద్దాం, రాజ్యాంగాన్ని, కార్మిక వర్గ ఐక్యతని నిలబెట్టుకుందాం అన్ని పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు.

### నూతన కమిటీ ఎన్నిక..

మాహాసభలో సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీ 41 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా : జె.చంద్రశేఖర్ ఉపాధ్యక్షులుగా : ఎన్. శ్రీనివాస్, బి.వి.సత్యనారాయణ, జె.వెంకన్న, డి.శోభరాణి ప్రధాన కార్యదర్శి : ఎ.అశోక్, సహాయ కార్యదర్శిలుగా : జి.శ్రీనివాసులు, ఉన్నికృష్ణ ఐ.రాజశేఖర్, రేవతి కళ్యాణి, ఐ.రమేష్, లింగస్వామి కోశాధికారిగా పి.గణేష్ తదితరులను ఎన్నుకున్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- సూర్యాపేట మండల యూనిట్ నూతన కమిటీ ఎన్నిక



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.సీతారామయ్య అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మాండ్లపల్లి ఫంక్షన్ హాల్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.సమస్యల పరిష్కారం కోసం రిటైర్డ్ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.పీఆర్సీని ప్రకటించడంతో పాటు హెల్త్ కార్డులను అందించి, పెండింగులో ఉన్న డిఏలను విడుదల చేయాలన్నారు.సమిష్టిగా పని చేసి రాష్ట్రస్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు.సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా దండ శ్యాంసుందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగేశ్వరరావు, ఫైనాన్స్ సెక్రటరీగా కె.కృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్గా ఎస్.యాదగిరి,ఉపాధ్యక్షులుగా జి.సోమయ్య, బి.హైమావతి, జాయింట్ సెక్రటరీగా రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సురేందర్ రెడ్డి, పబ్లిసిటి సెక్రటరీగా బి.వీరయ్య, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.మేరినిర్మల, ఎండి.అబ్దుల్లా, పి.రజితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షులు ఎన్.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, విద్యాసాగర్ రావు, వేనేపల్లి శ్రీనివాసరావు, హమీద్ ఖాన్, లక్ష్మీనర్సింహారెడ్డి, పుల్లయ్య, నాగేశ్వర రావు, ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారులుగా పందిరి రఘువర ప్రసాద్, గడ్డం నరసయ్య వ్యవహరించారు.

# రాజకీయాలకతీతంగా కాలనీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**కాప్రా, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘాల సభ్యులు రాజకీయాలకతీతంగా సమిష్టిగా కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల అప్పుడే రాజకీయాల ప్రస్తావన ఉండాలే తప్ప మిగిలిన సమయంలో కాలనీలా అభివృద్ధికి సంక్షేమ సంఘాలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.వి. నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాటేపల్లి శివారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీ మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాండాల శివకుమార్ గౌడ్, నేమూరి మహేష్ గౌడ్, సిసిఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి,అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పి. వెంకట కృష్ణారెడ్డి, రమణ నాయక్, సంయుక్త కార్యదర్శులు ఎన్. వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు మరిచిన టౌన్ ప్లానింగ్ అధికారులు

- అనుమతుల జారీలో నిర్లక్ష్యం
- కమిషనర్ సీరియస్గా ఉన్నా లెక్కలేదు
- అక్రమ నిర్మాణలపై పట్టింపు లేదు..
- నోటీసులు జారీ చేసి వసూళ్లు
- మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ కు మెమోల పరంపర!

**మల్కాజిగిరి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మల్కాజిగిరి సర్కిల్ పరిధి లో నివాస గృహాల అనుమతుల జారీలో టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బిల్ డౌన్ అధికారిక వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి 21 రోజుల్లో అనుమతులు జారీ చేయాల్సి ఉండగా, టౌన్ ప్లానింగ్ విభాగం సెక్షన్ అధికారి సంగీత, డిప్యూటీ సిటీ ప్లానర్ బాల శ్రీనివాస్ దరఖాస్తు ఫైళ్లను కావాలనే తమ వద్దే ఉంచుకుని, గడువు ముగిసే చివరి రెండు రోజులలో డిప్యూటీ కమిషనర్ కు పంపుతున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, ఉన్నతాధికారులకు పంపడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. వీరి నిర్లక్ష్యం కారణంగా, డిప్యూటీ కమిషనర్ ఫైళ్ల వెరిఫికేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తి కావడం లేదు. దీంతో దరఖాస్తుదారులకు 21 రోజుల గడువులోగా అనుమతి పత్రాలు అందడం ఆలస్యమవుతోంది. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం తో ఫైళ్లను ఇన్-టైంలో పరిశీలించకపోవడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డిప్యూటీ కమిషనర్ కు ఏకంగా రెండు మెమోలు జారీ చేసినట్లు విశ్వాసనీయ సమాచారం. టౌన్ ప్లానింగ్ అధికారి బాల శ్రీనివాస్ మల్కాజిగిరి సర్కిల్ కు వచ్చిన నాటి నుండి నోటీసులు జారీ చేయడం వసూలు చేసుకోవడం తప్ప ఆయన చేసింది ఏమీ లేదని స్థానికులు మండిపడుతున్నారు. స్థానికులు ప్రజావాణిలో, వివిధ వార్తా దినపత్రికలలో అక్రమ నిర్మాణాలపైవార్తలు ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్తే తూతూ మంత్రంగా నోటీసులు జారీ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై టౌన్ ప్లానింగ్ విభాగం సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్ల, వారు చేసిన తప్పులను డిప్యూటీ కమిషనర్ భరించాల్సి వస్తుంది. టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా డిప్యూటీ కమిషనర్ పై చర్యలు తీసుకోవడం స్థానికంగా విమర్శలకు దారి తీసింది.హనుమాన్ నగర్ లో అనుమతులు లేని నిర్మాణం, గీత నగర్ , ఆర్ కే హెచ్ కాలనీ లో అదనపు ఫ్లోర్, యాప్రాల్ శైలి గార్డెన్ దగ్గర షెడ్ నిర్మాణం జరుగుతున్న వాటికి నోటీసులు జారీ చేసి చూసి



చూడనట్లు వ్యవహరిస్తున్నారు.తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకొని, బిల్ డౌన్ నిబంధనలకు అనుగుణంగా ఫైళ్లను సకాలంలో ప్రాసెస్ చేసేలా టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు, ప్రజలు కోరుతున్నారు.

# బాలికా సాధికారతే లక్ష్యం

- పద్మశ్రీ లీలా పూనావాలా



**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** బాలికా సాధికారతే తమ లక్ష్యమని లీలా పూనావాలా ఫౌండేషన్ చైర్పర్సన్ పద్మశ్రీ లీలా పూనావాలా తెలిపారు. లీలా పూనావాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్లోని జీ నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్షిప్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మా లక్ష్యం కేవలం స్కాలర్షిప్ అందజేయడం మాత్రమే కాదన్నారు. మెంటార్షిప్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల వృద్ధి ద్వారా సమాజంలో మార్పు తీసుకు రావడమన్నారు. స్వాభిమానం, సామర్థ్యం, నాయకత్వ లక్షణాలతో మహిళా నాయకులను తయారు చేయడం ధ్యేయమన్నారు. విద్యా రంగంలో లీలా ఫౌండేషన్ ముప్పై ఏళ్లుగా పని చేస్తుందన్నారు. 2030 నాటికి సుమారు 25,000 మంది బాలికల జీవితాలను, ఆయా కుటుంబాలను సానుకూలంగా ప్రభావితం చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కాన్సెంట్రిక్స్ మా ప్రధాన భాగస్వాములలో ఒకటన్నారు. పూణే, హైదరాబాద్లోని బాలికల ఇంజనీరింగ్ విద్యకు మద్దతు ఇస్తుందన్నారు. ఇటీవల 30వ లీలా స్కాలర్షిప్ అవార్డు కార్యక్రమాన్ని పుణేలో ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ వేడుకకు డాక్టర్ కిరణ్ బేడీ (భారత తొలి మహిళా ఐపీఎస్ అధికారి, పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్) ప్రధాన అతిథిగా హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కాన్సెంట్రిక్స్ హైదరాబాద్, వైజాగ్ సర్వీస్ డెలివరీ, ఆపరేషన్స్ హెడ్ హుస్సేన్ సయ్యద్ మాట్లాడుతూ ఈ ఫౌండేషన్తో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనేక మంది బాలికల జీవితాలను మారుస్తున్న ఈ ప్రయాణం ఒక గౌరవంగా భావిస్తున్నామన్నారు. హైదరాబాద్లోని జీ నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు స్కాలర్షిప్లు అందజేశారు. హైదరాబాద్ పరిధిలోని కళాశాలల్లో అండర్గ్రాడ్యుయేట్, బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, డిప్లొమా తర్వాత ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినులకు స్కాలర్షిప్లు ప్రదానం చేశారు.

# ప్రాణం పోయినా భూములు ఇచ్చేది లేదు

- మొండిగౌరెల్లిలో రైతుల తీర్మానం

**యాచారం, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ప్రాణాలైనా పణంగా పెడతామని భూములు మాత్రం ఇచ్చేది లేదని రైతులంతా ముక్తకంఠంతో చెప్పారు. మొండి గౌరెల్లిలో 19, 68, 127 సర్వే నెంబర్లలో 821.11 ఎకరాల భూ సేకరణకై ఈ నెల 23న భూసేకరణ కోసం అభిప్రాయ సేకరణ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భూ సేకరణకు భూములు ఇచ్చేది లేదంటూ రైతులంతా మరో మారు ఆదివారం గ్రామపంచాయతీ వద్ద సమావేశమయ్యారు. పలువురు రైతులు మాట్లాడారు. భూ సేకరణ చేస్తామని చెప్పి నోటిఫికేషన్ ఇచ్చి బలవంతంగా భూములను సేకరిస్తామంటే భూముల విషయంలో మాత్రం వెనక్కు తగ్గేదే లేదని చెప్పారు. ఈ ప్రాంతంలోని రైతులంతా వ్యవసాయమే ప్రధానంగా జీవనాన్ని కొనసాగిస్తున్నారని భూములను సేకరిస్తే ఎలా బతకాలని మండిపడ్డారు. అనాదిగా పూర్వికుల నుండి సంక్రమిస్తున్న భూముల్ని నేటికీ సాగు చేసుకుంటున్నామన్నారు. ఏదేమైనా



భూముల్ని ఇచ్చేది లేదని కరాకండిగా చెప్పారు. త్వరలోనే రైతులంతా చర్చించుకుని కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండిమీద కృష్ణ, మాజీ మండల బిజెపి అధ్యక్షులు తాండ్ర రవీందర్ రైతులంతా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలంగాణ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు




**హైదరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ అండర్19 ఫ్రీస్టైల్ బాల బాలికల టోర్నమెంట్ వీరాభిమన్యువ్యాయంశాల, గంగాపుత్ర సంఘం, సబ్జీ మండిలో విజయవంతంగా ముగిసింది. హర్యానా రాష్ట్రంలోని పానిపథ్ లో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ (ఫ్రీస్టైల్) పోటీలకు వెళ్లే తెలంగాణ రాష్ట్రం బాల బాలికల జట్టు ఎంపిక కావడం జరిగింది. బాలికలు : పూజ 50 కిలోల విభాగం, గీత 53, మానస 55, నైన శ్రీ 57, దర్శిని 59, లక్ష్మీ ప్రియ 62, చైతన్య 65, నిరీక్ష 68, ఉమే సఫియా 72, మౌనిక 76 విభాగంలో బాలికలు ఎంపికైనారు. బాలురు : నవీన్ 57 కేజీల విభాగం, షేక్ రెహమాన్ 61, స్టాలిన్ 65, కృష్ణ 70, సిద్దు చారి 74, అబ్దుల్ మాలిక్ 79, కార్తీక్ రాజ్ సింగ్ 86, ఆర్యన్ యాదవ్ 92, అభిషేక్ సింగ్ 97, మీర్జా అక్బర్ బేగ్ 125 విభాగాలలో బాలురు ఎంపికైనారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కుమారి శ్రీదేవి, టోర్నమెంట్ ఆర్గనైజర్ కట్ట శ్రీనివాస్, బీరం విక్రమ్, శ్యాంరావ్, రాజేందర్ తెలిపారు.

# అత్యధిక లాభాలు గడించేందుకే విద్యుత్ ప్రైవేటీకరణ

- స్మార్ట్ మీటర్లు ఆపి, పీక్ అవర్స్ టారీఫ్ ఉపసంహరించాలి
- ఏపీ విద్యుత్ వినియోగదారుల సంఘం కన్వీనర్ సుబ్బారెడ్డి
- బెంగళూరులో ఏఐఈసీఏ దక్షిణ భారత సదస్సు

**బెంగళూర్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** విద్యుత్ రంగ ప్రయివేటీకరణ, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపాలని, పీక్ అవర్స్ టారీఫ్ పద్ధతి (టీఓడీ) ఉపసంహరించాలని పలువురు రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు అఖిల భారత విద్యుత్ వినియోగ దారుల దక్షిణ భారత సదస్సు బెంగూళూర్లోని గాంధీ భవనంలో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్నాటక, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల నుండి దాదాపు 300 మంది వినియోగదారుల ప్రతినిధులు, మేధావులు, కార్మికులు, రైతులు, చిన్న వ్యాపారస్తులు, సంబంధిత పౌరులు పాల్గొన్నారు. ఏపీ నుంచి విద్యుత్ వినియోగదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ.. విద్యుత్తు, ఆధునిక సమాజంలో అత్యంత ప్రాథమిక అవసరం అని, మన ఇళ్లకు, జీవనోపాధికి, ఆసుపత్రులు, రవాణా, సమాచార, వ్యవసాయ పంపు సెట్లు, చివరికి తాగునీరు సరఫరా ప్రతిదీ విద్యుత్పైనే ఆధారపడి




ఉందని వివరించారు. ఒక్కమాటలో విద్యుత్ సమాజానికి జీవనాడి అన్నారు. ప్రజలందరికీ అవసరమైన విద్యుత్ ఉత్పత్తి, దాని సేవలను వ్యాపార సరకుగా మార్చి పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు అత్యధిక లాభాలు గడించేందుకు ప్రైవేటీకరణకు యత్నిస్తున్నారని చెప్పారు. దీనిని వ్యతిరేకిస్తూ అఖిల భారత విద్యుత్ వినియోగదారుల సంఘం (ఏఐఈసీఏ) వినియోగదారుల హక్కులు, పరిరక్షణ కోసం దేశవ్యాపిత ఉద్యమాన్ని నిర్మిస్తోందన్నారు. ఏపీ టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్ర బిజేపికి మోకరిల్లి 2 కోట్ల ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించి 1.5 లక్షల కోట్లు లభింపజేస్తోందని, 16 నెలలలోనే ట్రూ అప్ ఛార్జీల పేరుతో 15,500 కోట్లు భారం వేసిందని, విద్యుత్ ప్రైవేటీకరణ అమలుకు శ్రీకారం చుట్టిందని ఆందోళన వెలిబుచ్చారు. వాటికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, పెద్ద యెత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ సదస్సులో కిసాన్ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆంధ్రప్రదేశ్ కన్వీనర్, మాజీ ఏంపి, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు అనారోగ్య సమస్యలతో హాజరుకాకపోవడంతో.. ఆయన రాసి పంపిన సందేశాన్ని వినిపించారు. అఖిల భారత విద్యుత్ వినియోగదారుల సంఘం (ఏఐఈసీఏ) అధ్యక్షులు స్వపన్ ఘోష్ రికార్డ్ ఉపన్యాసం వినిపించారు. సామాజిక కార్యకర్త, రచయిత, మాజీ ఐఏఎస్ అధికారి, హర్యానా విద్యుత్ బోర్డ్ మాజీ చైర్మన్ ఏం.జి. దేవసహాయం, తమిళనాడు విద్యుత్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు, ఏఐఇసిఏ సలహాదారులు ఎస్.గాంధీ, కేరళ జనకీయ ప్రతిరోధ సమితి (జేపీఎస్) రాష్ట్ర నాయకులు బి.దిలీపన్ ప్రధాన ముఖ్య ఉపన్యాసం చేశారు. ఈ సదస్సుకు ఏఐఇసిఏ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ఏఐఇసిఏ వర్కింగ్ ప్రెసిడెంట్ సమరసింహ, అఖిల భారత సంఘం కోశాధికారి అజయ్ చటర్జీ, ఏఐపిఇఎఫ్ ఉపాధ్యక్షులు సోమశేఖర్ ప్రధాన ఉపన్యాసం చేశారు. కర్ణాటక విద్యుత్ వినియోగదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.జ్ఞానమూర్తి, కేరళ నుండి సురేంద్రన్, తమిళనాడు నుండి పి.మోహన్, పుదుచ్చేరి నుండి శివకుమార్, ఏఐకెకెఎంఎస్ రైతు సంఘం నుంచి దీప ప్రసంగించారు.

# బలమైన శక్తులుగా కుల సంఘాలు ఎదగాలి

- ఎంపీ ఈటెల రాజేందర్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** సంఘటితమైన బలమైన శక్తులుగా కుల సంఘాలు ఎదగాలని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో వి ఎన్ ఆర్ కాపు సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనభోజన కార్యక్రమానికి మాజీ మంత్రి తోట త్రిమూర్తులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాపు సంఘం రాష్ట్ర నాయకులు మిరియాల రామారావు లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ అన్ని కులాలలో పేద ధనిక వర్గాలు ఉంటాయన్నారు. నిజమైన పేదవాడిని గుర్తించి వారి వారి కుల సంఘాలలో ఉన్న పేదవారికి అండగా నిలవాలని సూచించారు. రాజకీయాలకు తావు లేకుండా కుల సంఘాల నిర్వహణ జరగాలన్నారు. కుల సంఘాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుల సంఘాల ఆత్మీయ కలయికలో ఎన్నో తీపి గుర్తులు ఉంటాయన్నారు. తోట త్రిమూర్తులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో కాపులు ఏకతాటిపైకి రావలసిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా నాయకులు ఎస్ మల్లారెడ్డి, విఎంఆర్ కాపు సేవా సమితి నాయకులు శివాజీ, అధ్యక్ష కార్యదర్శులు విల్లా మూర్తి, పులిగడ్డ నాగ కిషోర్, గౌరవాధ్యక్షులు చిన్నంశెట్టి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు సనక వెంకటేశ్వరరావు, వేల్పూరు వెంకట్, తోట రామ్మోహన్, జి జగన్ మోహన్, పి నాగరాజు, పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం



**అమీన్‌పూర్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ప్రజలలో భక్తి భావం పెంపొందించేందుకు నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని గ్రీన్ మెడోస్ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన రామాలయం భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించబోయే రామాలయం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి , మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎన్నికల ప్రచారానికి అనూహ్య స్పందన



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** హైదరాబాద్ జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ ప్రచారంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తుంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్,చేతి గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి నవీన్ యాదవ్‌ని అఖండ మెజారిటీ గెలిపించాలని,కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.ఆదివారం ఎర్రగడ్డ బూత్ నెంబర్ 384శంకర్ లాల్ నగర్ లో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యేను ఓటర్లు హక్కును చేర్చుకొని తమ ఓటు తప్పకుండా నవీన్ యాదవ్ గారికే ఓటు వేస్తామని భరోసానిస్తున్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత పారదర్శకంగా మద్యం లాటరీ ప్రక్రియ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- 49 మద్యం షాపులకు లాటరీ కార్యక్రమం నిర్వహణ
- మద్యం పాలసీ లాటరీ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** అత్యంత పారదర్శకంగా మద్యం లాటరీ ప్రక్రియ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్, బోధన్ రోడ్, మెదక్ ఫంక్షన్ లాటరీ నిర్వహణ ఏర్పాట్లను ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 - 27 సంవత్సరాలకు మెదక్ జిల్లా లోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏ 4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ తేదీ 23.10.2025 రోజున ముగిసిందని తెలిపారు.మెదక్ జిల్లాలోని మొత్తం (49) మద్యం షాపులకు గాను (1420) దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. దరఖాస్తు ఫీజు రూపంలో 42 కోట్ల 60 లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం జరిగిందన్నారు. తేదీ 27.10.2025 సోమవారం రోజున మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్, బోధన్ రోడ్, మెదక్ ఫంక్షన్ హాల్ నందు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెదక్ జిల్లాలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ తేదీ 27.10.2025 సోమవారం రోజున ఉదయం 9.30 గంటలకల్లా శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ నందు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం



**అమీన్‌పూర్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో క్రోమ్ వెల్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొల్లూరి మల్లేష్, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, హాస్పిటల్ సిబ్బంది, ట్రస్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



**తలకొండపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** టిడబ్ల్యూజేఎఫ్ సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టు సమస్యల పరిష్కారానికై నిరంతరం కృషి చేస్తుందని ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ అన్నారు.ఆదివారం ఆమనగల్ పట్టణ కేంద్రంలో టిడబ్ల్యూజేఎఫ్ బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జర్నలిస్టులకు అక్రిడేషన్స్,హెల్త్ కార్డులు,ఇండ్ల ప్లాట్ల కొరకై టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సాధించేవరకు పోరాడుతామని అన్నారు.ప్రభుత్వాలు మారిన జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జర్నలిస్టులంతా ఐక్యతతో ముందుకు సాగి మనకు దక్కాల్సిన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలు అందించేలా పాలకులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇటీవల రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేసిన జర్నలిస్టు మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షులు యూనుస్, టిడబ్లుజెఎఫ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి నరేష్,బ్లాక్ గౌరవ అధ్యక్షులు నర్సింహ్మ,ఉపాధ్యక్షులు చప్పిడి తిరుపతి, కోశాధికారి యాదగిరి,సంఘం సభ్యులు తూర్పు శ్రీను, ఆఫీజ్,శేఖర్, ఇమ్రాన్,ఖలీమ్, యాదగిరి యాదగిరి,రామకృష్ణ పాల్గొన్నారు.

## సేయింట్ ఆంథోన్ విద్యార్థులు జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నగాడియం స్కూల్, సంగారెడ్డిలో నిర్వహించిన అండర్-14 జిమ్నాస్టిక్స్ స్కూల్ గేమ్స్‌లో సేయింట్ ఆంథోన్ హై స్కూల్, శాంతినగర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు.ఎంపికైన విద్యార్థులు ఆర్టిస్టిక్ విభాగం, అండర్-14 బాలురు యం. విగ్నేష్, రాహుల్,యన్. వరుణ్ నాయక్,జి. అశ్విని కుమార్,సి హెచ్. జశ్వంత్, స్టీఫాన్, వీరి విజయంపై సేయింట్ ఆంథోనీ విద్యాసంస్థల అధిపతి ఈ. సొలొమోన్ రెడ్డి, డైరెక్టర్ ఈ. విజయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఈ. అరుణ రెడ్డి, జిమ్నాస్టిక్స్ కోచ్ విట్టల్, వ్యాయామ ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## అభాగ్యుల్లో మార్పు కోసమే "స్కై" సేవలు



**హైదరాబాద్, అక్టోబరహ్ 26 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో దయనీయ స్థితులలో అనాథలు, నిరాశ్రయులు, మతి స్థిమితం లేని వాళ్ళు ఎందరో అభాగ్యులు నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ల మీదనే జీవనం సాగిస్తున్నారు. ఈ అభాగ్యులందరికి ఆశ్రయం కలిపించి ఆహారం, వైద్యం, బట్టలు అందించి కుటీర పరిశ్రమలలో శిక్షణలో చేయూతను ఇస్తూ జీవనోపాధి కల్పించి వారి జీవితాలలో మంచి మార్పులకోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలనీ స్కై ఫౌండేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం మానవతా దృక్పధంతో అలోచించి సహకారం అందిస్తే కుటీర పరిశ్రమలు నెలకొల్పి ఈ అభాగ్యులందరికి సరికొత్త జీవితాన్ని అందించేవిధంగా ప్రణాళికలను రూపొందిస్తామని తెలిపింది. నగరంలో వాహనంలో సంచరిస్తూ ఆకలితో రోడ్ల పక్కన ఉన్న అనాథలు, నిరాశ్రయులు, నిరుపేదలు, సంచారజాతులవారిని గుర్తించి ఆదివారం రోజున 287వ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ వై.సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు ఇర్ఫాన్, రేవంత్, లోకేష్ పాల్గొన్నారు.

## బీసీ గర్జన గోడపత్రిక విడుదల



**మక్తల్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే చలో బీసీ గర్జన గోడపత్రికను విడుదల చేశారు. ఆదివారం మక్తల్ పట్టణంలోని ఐబిలో 42% బీసీల రిజర్వేషన్లపై అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన రాయల్ ఫంక్షన్లో జరిగే చలో బీసీ గర్జన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు.కె. రామాంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య వక్తగా రిటైర్డ్ ఐఎస్ చిరంజీవులు హాజరవుతారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని అన్నారు. బీసీలను నేటి వరకు కూడా అనగదొక్కె ప్రయత్నంలో అన్ని ప్రభుత్వాలు అనిచివేతకు గురి చేస్తున్నాయి. బుధవారం జరగబోయే చలో బీసీల గర్జన సభకు బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి తిమ్మప్ప, జ్యోతిరావు పూలే సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్ కుమార్, బిసి నాయకులు కెవి నరసింహ, మక్తల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, భీం సేన సేవా సమితి వ్యవస్థాపకులు ఎంకె నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అగ్రగామిగా అమీన్‌పూర్

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** అమీన్పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు ఆర్టీసీ కాలనీలో కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించి తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాలనీల మధ్య అంతర్గత రహదారులు నిర్మిస్తూ.. మెరుగైన రవాణా సౌకర్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మహదేవరెడ్డి, కొల్లూరి మల్లేష్, గోపాల్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు




**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.ఆదివారం కేకే భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో కనీస సౌకర్యాలు లేకుండా,ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులలో వరుస ఘటనలు జరుగుతున్న జిల్లా అధికారులు స్పందించటం లేదని విమర్శించారు. రాష్ట్ర టాస్క్ పోర్స్ అధికారుల నివేదిక బయట పెట్టాలని అన్నారు. ఇప్పటికే జిల్లా లో 17 ప్రైవేట్ ఆసుపత్రులకు పెయిన్ వేసినట్టు వార్తలు వస్తున్నాయి.25 మంది నకిలీ వైద్యులను ఐఎంఏ గుర్తిస్తే జిల్లా ఆరోగ్య అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు.తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధికారులు తనిఖీ లు చేస్తుంటే జిల్లా అధికారులు ఎం చేస్తున్నారని ప్రశ్నించారు. మందులు, టెస్ట్ లకు అంతు లేకుండా ఉన్నదని అన్నారు. ల్యాబ్, స్కానింగ్ సెంటర్ లను కూడా పర్యవేక్షణ చేయాలనీ అన్నారు.కనీసం స్కానింగ్ మెషిన్ కూడా తనిఖీ చేయటం లేదంటే ఆరోగ్య శాఖను వెంటనే మంత్రి ప్రక్షాళన చేయాలని అన్నారు.లేనిచో ఆందోళన చేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమం సిపిఎం నాయకులు మాణిక్యం, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



**మెదక్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** రైతులు ధర దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ అన్నారు. మెదక్ మండలం రాజు పల్లి లో గ్రామంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, 33 /11 సబ్ స్టేషన్ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణ తీరును, మాశ్చరైజేషన్ను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఏ విధంగా సరఫరా అవుతుందో ఎన్ని గంటలు రైతులకు అందిస్తున్నారు వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేంద్రాల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారని అందులో మాయిచ్చరైన ధాన్యానికి టోకెన్ అందిస్తున్నామని తెలిపారు. టోకెన్ అందించడంతోపాటు మిల్లులకు కూడా ట్యాగింగ్ ఇచ్చేస్తున్నామన్నారు. ధాన్యం సరఫరాకు వాహనాలన్నీ సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు బిల్లులు త్వరగా చెల్లించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోస పోవద్దని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్ లోనే ధాన్యాన్ని విక్రయించాలని వెల్లడించారు. నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతులకు అందాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సంక్షేమమే ధ్యేయం

- డీలర్లు ఐకమత్యంగా ఉండాలి
- రేషన్ డీలర్ల ఉద్యోగ భద్రతకు కృషి
- రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయకోటి రాజు
- మేడారంలో రేషన్ డీలర్ల సమావేశం



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయకోటి రాజు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మేడారం సమ్మక్క సారలమ్మ ప్రాంతంలో వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు గజ్జె గోవర్ధన్ అధ్యక్షతన రేషన్ డీలర్ల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నాయకోటి రాజు మాట్లాడుతూ రేషన్ డీలర్లు ఆదర్శంగా నిలవాలన్నారు. రేషన్ డీలర్ల సమస్యల పట్ల వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. రేషన్ డీలర్లు ఆరు నెలలుగా తమ కమిషన్ రాక ఇబ్బందులు పడ్డ విషయం గుర్తించి ఆ సమస్య పరిష్కరించేందుకు కృషి చేసినట్లు చెప్పారు. అదేవిధంగా రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం కృషి చేయాలని నాయకోటి రాజు డిమాండ్ చేశారు. కిరోసిన్ హాకర్లకు రేషన్ డీలర్లుగా ఇవ్వాలనే జీవోను ప్రభుత్వం ద్వారా తాను తీసుకొచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రేషన్ డీలర్లు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని తాము చేస్తున్న నిజాయితీ సేవ పట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు. డీలర్లు అంతా ఐకమత్యంతో ఉండాలని ఎలాంటి సమస్య అయినా ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా కదలాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నాయకోటి రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయకోటి రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు గజ్జె గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి కుసుమ రాజేందర్ కోశాధికారి బసవరాజు సాంబయ్య తోపాటు బండి లక్ష్మణ్ ,మాడిశెట్టి కొమురయ్య రైట్,షబ్బీర్, లక్కర్స్ రాజ్ కుమార్, ఏకదర్శిని, మంద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చేతికొచ్చిన పంట వర్షార్పణం

- భారీ వర్షాలకు రైతుల కన్నీటి గాధ

**మల్హర్,అక్టోబర్ 26(జనంసాక్షి) :** వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలమట్టం అయ్యింది. తెచ్చిన పెట్టుబడులు చేతికి వస్తాయని కలలు కన్న అన్నదత కలలు ప్రకృతి ప్రకోపానికి ఆవిరైయ్యాయి. వివరాల్లోకి వెళితే భూపాలపల్లి జిల్లా మాలహర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన అర్ని రాజబాబు అనే రైతు ఐదు ఎకరాలు వరి సాగు చేసాడు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంట మొత్తం నేలకు ఒరిగింది. ఐదు ఎకరాలకు పెట్టిన మొత్తం పెట్టుబడి నష్టపోయినట్లు రైతు కన్నీటి తో పర్యంతం అయ్యాడు. ఈ సందర్భంగా జనంసాక్షి పత్రికతో తన గోడు పంచుకొన్నారు. ప్రభుత్వం వరి పంటకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి అని వేడుకొన్నారు. అలాగే మల్లారం, గాదాంపల్లి, చిన్నతుండ్ల, పెద్దతూండ్ల, కొయ్యూరు, వాళ్లెంకుంట తదితర గ్రామాలలో భారీ వర్షాలు కురువడంతో రైతులు లబోదిబో అంటున్నారు. కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి పంట చేతికందకుండా వర్షార్పణం అయ్యి చేతికి అందుతుందన్న దశలో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా మండల వ్యాప్తంగా వాయుగుండం ప్రభావం తో కురుస్తున్న భారీ వర్షాలకు నేలకు ఓరుగుతున్న వరి పంటలు. అనేక తెగుళ్ల సోకుతున్న మిర్చి,పత్తి పంటలు. అరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్ళముందే వర్షార్పణంగా మారింది. మొన్నటి దాకా యూరియా కష్టాలు, తరువాత అనేక చీడపిడలు, తెగుళు ,,దోమ కాటు అనేక రోగాలకు వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని పంటలకు వివిధ పురుగు మందులు స్ప్రే చేసి పంటలను కాపాడుకొన్నారు. కొన్ని రోజులు అయితే పంట చేతికి వస్తుంది అని అనుకొనే సమయానికి వాయుగుండం రూపంలో భారీ వర్షాలు రైతులకు కన్నీటినే మిగల్చాయి. ప్రభుత్వం తమను ఆదుకోని నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు వేడుకుంటున్నారు.



# ఆక్రమణకు గురైన భూమిని ఇప్పించాలి



- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరిన ఏజెన్సీ గిరిజనులు

**నర్సంపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మండలంలోని కొమురం భీమ్ కాలనీ లో ఆక్రమణకు గురైనా గ్రీన్ ల్యాండ్ ,20 ఫీట్స్ రోడ్డు ను తమకు ఇప్పించాలని కోరుతూ పలువురు కొమురం భీమ్ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను కోరారు. కొమురం భీమ్ కాలనీ దొర ఏనుగు నారాయణ, గౌరవ అధ్యక్షుడు వాసం పాపయ్య, పటేల్ ధనసరి శ్రీను లు మాట్లాడుతూ కాలనీ లోని 117/1/507 లోని గ్రీన్ ల్యాండ్, 20 ఫీట్స్ రోడ్డు ను సువర్ణ పాక పెద్ద జగ్గారావు, బూర్క మల్లయ్య, గొంది సమ్మయ్య ,తూర్ప భూమయ్య గ్రామపంచాయితీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా భూమిని అమ్ముకొని, తప్పుడు అనుమతులతో, అంతర్గత రోడ్ కోసం తీసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నారన్నారు. ఆక్రమణకు గురైన భూమిని తమకు అప్పగించాలని కాలనీ వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజా సంఘ నాయకులు దాట్ల నాగేశ్వరరావు. సిద్ధ బోయిన లక్ష్మీనారాయణ. ఈసం సుధాకర్. పడిగే నాగేశ్వరరావు. కుంజ నరసింహారావు . కల్తీ ఎల్లయ్య. సమ్మయ్య. తదితరులు పాల్గొన్నారు

# దుగ్గొండి, వర్ధన్నపేట భూభారతి పీఓటీ రికార్డుల పరిశీలన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి):** వర్ధన్నపేట, దుగ్గొండి మండలాలకు సంబంధించిన భూభారతి, పీఓటీ రికార్డులను జిల్లా కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. ఆదివారం సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్టయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలించాలని వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ.. వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూసంబంధిత రికార్డుల ప్రామాణికత, డేటా అప్‌డేట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పారదర్శకత, వేగం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులను సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ ఫైళ్లను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజేశ్వర్, విజయ్ సాగర్, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# హనుమకొండలో దారుణం

- వీధి కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు..

**వరంగల్ ఈస్ట్ ,అక్టోబర్ 26( జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని శాంపేట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న శ్రీజ(7) అనే బాలికపై మూకుమ్మడి దాడి చేసిన వీధి కుక్కలు. స్థానికులు గమనించి కుక్కలను తరమడంతో తప్పిన ప్రాణాపాయం. సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గాయపడ్డ బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు. వీధి కుక్కల బెడదను నివారించడంలో మున్సిపల్ అధికారుల అలసత్వంపై మండిపడుతున్న స్థానికులు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బారి నుండి పిల్లలను పెద్దలను కాపాడాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

# భక్తులతో సందడిగా మారిన మల్లూరు క్షేత్రం



**మంగపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో రెండవ యాదగిరిగుట్టగా సుప్రసిద్ధి చెందిన మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల కొండలపై స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని దర్శించుకోవడం కొరకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి వరంగల్, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వచ్చారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామిని, పంచముఖాంజనేయ స్వామిని, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై స్వయంభుగా వెలసి విరాజిల్లుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామిని పక్కనే కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి మూలవిరాటకు ప్రదానార్చకుడు ముక్కామల రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు పవన్ కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ లు తిలా తైలాబిషేకాలు చేసి నూతన పట్టు వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనం గావించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను ఈవో మహేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సీతారాములు, లక్ష్మీనారాయణ, శేషు, అజయ్, గణేష్, నవీన్, నాగార్జున్, మహేష్, పుల్లయ్య లు పాల్గొన్నారు.

# మరియన్నకు రైతు నేస్తం - 2025 పురస్కారం

- హైదరాబాద్‌లో అందజేసిన వెంకయ్యనాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 26(జనం సాక్షి):** ఆదివారం స్వర్ణ భారతి ట్రస్ట్, ముచ్చింతల్, శంషాబాద్, హైదరాబాద్ నందు రైతు నేస్తం అవార్డ్ కార్యక్రమం లో భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ , ఉద్యాన, అనుబంధల శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మరియు ఎడిటర్ రైతు నేస్తం యండపల్లి వెంకటేశ్వరావు (పద్మశ్రీ అవార్డ్ గ్రహీత) చేతుల మీదుగా అధికారి అందించిన సేవలకు గాను జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న మహబూబాబాద్ రైతు నేస్తం - 2025 పురస్కారాన్నీ అందుకున్నారు. రైతులకు సేవ, నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ పంట మార్పిడి ద్వారా ఉద్యాన పంటల విస్తరణ, రైతులు పలు మేలైన యాజమాన్య పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, రైతుల విజయ గాథలు మొదలైన విషయాలను తెలియజేస్తూ ఆయిల్ పామ్, పండ్లు, కూరగాయలు, పూలు, మల్బరీ, మునగ మొదలైన పంటల విస్తరణకు రైతులకు అవగాహన చేస్తూ, 30 (ముప్పై) వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ చేసినందుకు మరియు ఉద్యాన పంటలు కూడా 10 (పది) వేల ఎకరాల విస్తరణ చేసినందుకు వారి సేవలను గుర్తిస్తూ విస్తరణ విభాగంలో రైతు నేస్తం - 2025 పురస్కారాన్నీ అందుకున్నారు.

# కాగజ్‌నగర్‌లో పోలీసుల కార్డెన్ సర్చ్



- అనుమతి పత్రాలు లేని 55 వాహనాల స్వాధీనం
- ఎస్‌డిపిఓ వహీయుద్దీన్

**కొమరం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్25 (జనంసాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సంజీవయ్య కాలనీలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వాహియొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. సరైన అనుమతి పత్రాలు లేని 55 మోటర్ సైకిల్ ను పోలీసులు స్వాధనపరచుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎవరైనా అనుమానస్పదంగా సంచరించిన పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన అట్టి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ పట్టణ పోలీసు అధికారి (ఎస్ హెచ్ ఓ) ప్రేమ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్, పోలీసులు పాల్గొన్నారు.

# మాధవ సేవగా సర్వ ప్రాణి సేవ

- జియర్ స్వామీజీకి స్వాగతం



**ఖానాపూర్ అక్టోబర్ 26 (జనం సాక్షి) :** శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయరు స్వామి కరకములచే శ్రీగోదా శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ట అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. జై శ్రీమన్నారాయణనామ స్మరణతో ప్రాంగణమంతా మారుమ్రోగింది. సృష్టికర్త దేవుడు లేనిదే జీవుడు లేడని మాధవ సేవగా సర్వప్రాణి సేవ చేసి తరించాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి అన్నారు. పట్టణంలోని విద్యానగర్ లో గల శ్రీగోదా శ్రీకృష్ణ దేవాలయ ప్రతిష్ట కార్యక్రమానికి ఆదివారం స్వామి వచ్చిన సందర్భంగా స్వామివారిని స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుండి ఆలయ ప్రాంగణం వరకు ఖానాపూర్ నిర్మల్ మామడ వికాస తరంగిణి, స్థానిక భక్తులు ఘనంగా మేళ తాళాలతో శ్రీమన్నారాయణ నామస్మరణతో ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన హొమాలను సందర్శించి స్వామివారి కర కమలములచే గోదా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్టను చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంట్లో దీపం పెట్టి పూజలు నిర్వహిస్తే ఆ కుటుంబంలో దీప కాంతి వలె శాంతి సౌభాగ్యాలు కలిగినట్లే దేవాలయాలు నిర్మించి అందులో వాళ్లకు ఇష్టమైన ఆయా దేవత విగ్రహాలను దీపారాధన చేసి పూజిస్తే ఆ గ్రామాలకు పట్టణాలకు ప్రజల శాంతి సౌభాగ్యాలకు ఆ దేవాలయం నిలయంగా మారుతుందని సూచించారు. మనిషికున్న చెడు అహంబావా మార్గాలన మలిచే శక్తి దైవభక్తి ఆధ్యాత్మిక చింతనకే ఉందని తెలిపారు. ఆలయాలు నిర్మించడం సంతోషకరమని వద్దిపర్తి వెంకటరమణ సంకల్పాన్ని రూప రెడ్డి అనిత రెడ్డి రూపంలో ఆలయ నిర్మాణ సహకారాలు అందించి సఫలం చేశారని చిన్న జీయరు స్వామి అన్నారు. ఎంత సంపాదించినా ఎంత చేసినా చివరికి మిగిలేది మంచి జ్ఞాపకాలేనని అన్నారు. శ్రీగోదా శ్రీకృష్ణ ఆలయంలో సంవత్సరాంతం నిత్య పూజ జరపాలని ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని పునీతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ప్రాంత ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బెల్లంపల్లి విద్యార్థులకు ప్రతిభా అవార్డు




**బెల్లంపల్లి, అక్టోబర్ 26, (జనంసాక్షి) :** హైదరా బాద్‌లో ఆదివారం విప్ర్ ఫౌండేషన్ జోన్ 16 తెలంగాణా ఆధ్వ ర్యంలో ఆధ్వర్యంలో కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియం లక్డీ కా పూల్ లో ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బిటెక్ విభాగాల్లో 90%తో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రతిభా అవార్డులతో సత్కరించారు. బెల్లంపల్లిపట్టణానికి చెందిన బిటెక్ మొదటి సంవత్సరంలో 9.88 జీపీఏ తో ఉత్తీర్ణులైన వారిలో వశిష్ట్ పాండే, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తెలంగాణా సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల షేక్ పేట్ సీవోఈ నుండి 99% మార్కులతో ఉత్తీర్ణులైన ప్రథమ్ పాండే, ఇంటర్మీడియట్‌లో 90% జిపిఏ తో ఉత్తీర్ణులైన ఛవి శర్మలను కండువా కప్పి ప్రతిభా అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ 16 విప్ర్ ఫౌండేషన్ అధ్యక్షుడు హరికిషన్ ఓజా, మంత్రి రామ్‌దేవ్ నాగ్లా, కోఆర్డినేటర్ ఆనంద్ శర్మ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
27 అక్టోబర్ 2025

# తోపుడు బండి సాదిక్ అలీ సేవలు పేద విద్యార్థులకు వరం



**కల్లూరు, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** పేద విద్యార్థులకు సాధిక అలీ సేవలు వరంలాంటిది ఆయన మరణం పేద విద్యార్థులకు తీరని లోటు అని ఆయన ఆశయాన్ని సతీమణి ఉష సాధిక్ కొనసాగించడం అభినందనీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఆదివారం కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్పి క్రాస్ రోడ్ సమీపానగల కాళోజినగర్లో తోపుడుబండి ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వర్గీయ సాదిక్ అలీ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ సాదిక్ అలీ తోపుడుబండి ఫౌండేషన్ స్థాపించి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొందిన వారిలో సాదిక్ అలీ ఒకరని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేలా తోపుడుబండి సంస్థ తరుపున ఆర్థికంగా చేయూత నిచ్చారని వక్తలు పేర్కొన్నారు. కరోనా సమయంలో పేదలకు అన్నదానం, వైద్య సహాయం కూడా అందించారని, గిరిజన ప్రాంతాల్లో పేదలకు తమ సేవలను విస్తరించారని అన్నారు. ఈ సందర్భంగా సాదిక్అలీ సేవలను, గుర్తిస్తూ ఆయనతో ఉన్న అనుబంధంను నేమరువేసేందుకు ఖమ్మం జిల్లా కవి మిత్రులు తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో రూపొందించిన సంస్మరణ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాదిక్అలీ చిత్రపటానికి పలువురు కవులు, విద్యా, సామాజిక వేతలు, రాజకీయ నాయకులు ఉపాధ్యాయులు అభిమానులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాలయసంస్థ విశ్రాంత అధికారి ఎం పుల్లయ్య, బంధుమిత్రులు ఫయాక్అలీ, రియాజ్, ప్రముఖ కవి కపిల రాంకుమార్, తదితరులు మాట్లాడారు. హైదారాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో సేవలందించారు. సాదిక్అలీ కుటుంబ పరంగా లాభపే క్షలేకుండా సామాజిక సేవకే తన జీవితం అంకితం చేశారన్నారు. తన సేవల ద్వారా పేదల హృ దయాల్లో నిలిచిన ఆదర్శనీయుడుగా, కవిగా, జర్నలిస్టుగా కూడా సామాజానికి సేవలందించి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొందిన వారిలో సాదిక్ అలీ ఒకరని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు చాలా కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో గురుకుల విద్యాలయసంస్థ విశ్రాంత అధికారి ఎం పుల్లయ్య, బంధుమిత్రులు ఫయాజ్, రియాజ్, ప్రముఖ కవి కపిల రాంకుమార్, కుటుంబ సభ్యులు ఉషా సాదిక్, హాబీబున్నీసా, సలీం, డాక్టర్ ఆషా, సహనం, ఉమా, దయాల కిషోర్ దత్ సుజాత దంపతులు, పలువురు కాంగ్రెస్ నాయకులు వివిధ సామాజిక వర్గాల ప్రజలు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా యర్రా శ్రీనివాసరావు నియామకం



**కోదాడ, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** కోదాడ పట్టణానికి చెందిన యర్రా శ్రీనివాసరావు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆదివారం హైదరాబాదులో రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన సంఘ ప్రతినిధులతో జరిగిన జాతీయ సదస్సులో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అఖిల భారత వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా చేతుల మీదగా యర్రా శ్రీనివాసరావు జిల్లా వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైశ్య ఫెడరేషన్ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ సంఘ పరంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చేందుకు శక్తి వంచనా లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తాకు రాష్ట్ర జనరల్ సెక్రటరీ పబ్బా చంద్రశేఖర్ గుప్తా, కోటగిరి దైవ దేనం, కట్టా రవి సంఘ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా దామర రామకృష్ణ ఎన్నిక



**చింతపల్లి, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** చింతపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తిరిగి శ్రీశైలం మాదిగ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ చేతులమీదుగా నూతన మండల కమిటీ అధ్యక్షులుగా రామకృష్ణ ఎన్నుకోబడ్డారు నియామక పత్రం అందజేశారు. ఇటీ అధ్యక్ష బాధ్యతలను ఎమ్మార్పీఎస్ నియమనిబంధనలు కనుగొనగా మాదిగ జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పి దామర రామకృష్ణ మాట్లాడారు ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులకు రాష్ట్ర అధ్యక్షులకు మరియు చింతపల్లి మండల కార్యవర్గ సభ్యులకు అందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులుగా ఊరే భాస్కరు, కార్యదర్శిగా వురే ఆంజనేయులు, కోశాధికారిగా ఎర్ర రాకేష్, మరియు సభ్యులు ఎన్నుకోబడ్డారు. నల్లగొండ జిల్లా నాయకులు వెంకటరమణ, డావాలయ్య, మైసయ్య, కంబాలపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ గేయ రచయితగా డాక్టర్ ఎర్ర హరికిషన్ ఎంపిక




**తుంగతుర్తి, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ఉత్తమ గేయ రచయితగా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఎర్ర హరికిషన్ ఎంపికయ్యారు. ఈయన రచించిన, అమ్మా ఓ భారతమ్మ, గేయానికి సంస్కృతి విలువలు అందించే సంచార జాతుల కళా ప్రదర్శన విభాగం ఉత్తమ గేయంగా ఎంపిక చేసింది. దీంతో వీరు గజ్వేల్ లో ఆదివారం జరిగిన సంచార జాతుల సమరసత ఉత్సవంలో భాగంగా మీరు రచించిన గేయానికి ప్రథమ బహుమతిగా ప్రకటించి అఖిలభారత సంచార జాతుల సంచాలకులు అప్పల ప్రసాద్ చేతుల మీదుగా ఘనంగా జ్ఞాపిక అందించి నగదు తో పాటు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన జానపద కళాకారులు, సంచార జాతుల సమన్వయకర్త మంగళంపల్లి శ్రీహరి, బండి రాజుల శంకర్, రామకృష్ణ విద్యాలయం కరస్పాండెంట్ తోపాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన జానపద కళాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన తేజ విద్యార్థులు



**కోదాడ, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** రాష్ట్ర స్థాయి చదరంగం క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎస్జిఎఫ్ వారు నిర్వహించారు. తేజ విద్యాలయ కొమరబండ విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపికయ్యారు. అండర్ 14 మహిళా విభాగంలో భూక్యా యోగిత , ఓరుగంటి అనంత లక్ష్మి, అండర్ 17 బాలుర విభాగంలో శ్రీహర్ష ఎంపికయ్యారు. ఎంపిక కాబడిన వారు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, చెస్ మాస్టర్ నర్సింహరావు అభినందించారు.

## నిరుపేద క్యాన్సర్ పేషంట్‌కు ‘నీడ’ ఆర్థిక సాయం..



**గోదావరిఖని, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** స్థానిక సప్తగిరికాలనీకి చెందిన ఐరవెల్లి స్వప్నకు భర్త యాదయ్య, మూడు సంవత్సరాల కూతురు త్రినేత్ర ఉన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం గొంతునొప్పితో బాధపడుతున్న స్వప్నకు వైద్య పరీక్షల అనంతరం అన్నవాహిక క్యాన్సర్ అని తేలింది. ఆరోగ్యశ్రీతో క్యాన్సర్‌కు కిమోతెరఫీ చికిత్స చేశారు. ఇంట్లో అమ్మానాన్న వద్ద ఉంటున్న స్వప్న వయసు మీదపడిన తల్లిదండ్రులకు భారంగా మారింది. అప్పు చేసి ఖర్చుపెట్టిన క్యాన్సర్ మూడో దశలో ఉందని, చికిత్స చేయాలని దానికి డబ్బులు ఖర్చవుతాయని కుటుంబ సభ్యులు దాతల సాయం కోరుకుంటున్నారు. స్థానిక నాయకులు విజయ్ కుమార్‌గౌడ్, నీడ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఆదివారం నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్‌గౌడ్ పేషెంట్ ఇంటికి వెళ్లి రూ. 5వేలు ఆర్థిక సాయం చేసింది. ఈ కార్యక్రమంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్‌గౌడ్, నాయకులు చిన్నమూల విజయ్‌కుమార్‌గౌడ్, సభ్యులు జలీల్‌పాషా, బత్తిని రవి తదితరులు పాల్గొన్నారు.

## ఊర కుక్కల దాడిలో చుక్కల దుబ్బ మృతి



**దస్తూరాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ఊర కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాపూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి ఊర కుక్కలు వెళ్ళగా అటు సమీపంగా చుక్కల దుప్పి కనిపించడంతో ఊర కుక్కలు చుక్కల దుప్పిని తరుముతుండగా గ్రామ సమీపంలోని వాగులోకి వెళ్ళింది, దీంతో వాగులో భారీగా ఇసుక ఉండటంతో చుక్కలు దుప్పి ఇసుకలో ఇరుక్కుపోయింది. ఊర కుక్కలు చుక్కలు దుప్పి పై దాడి చేసి హతమార్చాయి. వాగులో అటువైపుగా వస్తున్న స్థానికులు గమనించి చుక్కలు దుప్పిని రక్షించే ప్రయత్నం చేసిన అప్పటికే తీవ్రమైన గాయాలు కావడంతో సంఘటన స్థలంలోని మృతి చెందింది. సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని చుక్కలు దుప్పిని అడివి ప్రాంతాలకు తీసుకెళ్లి వైద్యులచే పోస్టుమార్టం నిర్వహించి, దహన సంస్కారాలు చేశారు.

## సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షిక సమావేశం..




**గోదావరిఖని, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో జరిగిన సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ (కొత్తగూడెం) వంశీధర్, అసిస్టెంట్ కమిషనర్ (కొత్తగూడెం) పి. చిరంజీవి హాజరై ప్రసంగించారు. వివిధ అంశాలపై హైలైట్ చేశారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ గురించి అవగాహన కల్పించడానికి..సీఎంపిఎఫ్ సంస్థ ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. సింగరేణి రిటైర్డ్ అధికారులతో ప్రాంతీయ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ సింగరేణి మేనేజ్‌మెంట్‌తో ఒప్పందం కుదుర్చుకుని కోల్‌బెల్ట్ ప్రాంతాలలో..హైదరాబాద్‌లో కూడా శిబిరాలను కలిగి ఉండటానికి ఒక కార్యక్రమాన్ని రూపొందించారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌లను ఉత్పత్తి చేసే విధానాన్ని సభ్యులకు వివరంగా వివరించారు. స్వీయ పెన్షన్ లేదా వితంతు పెన్షన్‌ను కొనసాగించడానికి వారు జీవన్‌ప్రమాణ్ యాప్ లేదా ఉమాంగ్ యాప్‌ను ఉపయోగించి లైఫ్ సర్టిఫికేట్‌ను రూపొందించవచ్చని కూడా వివరించారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు, సవరించిన రివైజెడ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీలు, వితంతు పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారంపై సభ్యులు లేవనెత్తిన సందేహాలకు రీజినల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ద్వారా సమాధానం ఇస్తారన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ఫిర్యాదులను ఎప్పుడైనా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఫోన్ ద్వారా లేదా వ్యక్తిగతంగా వారిని సంప్రదించాలని సూచించారు. పి. వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన వార్షిక జనరల్ బాడీ సమావేశంలో అధ్యక్షుడు జెవి దత్తాత్రేయులు, ప్రధాన కార్యదర్శి, ఇతర ఆఫీస్ బేరర్లు, దాదాపు 200 మంది అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన కమిటీ ఎన్నిక



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని బ్రహ్మాండ్లపల్లి ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆ సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దండ శ్యాంసుందర్ రెడ్డి, సెక్రటరీగా ఎస్. నాగేశ్వరరావు, ఫైనాన్స్ సెక్రటరీగా కె. కృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్. యాదగిరి, వైస్ ప్రెసిడెంట్స్‌గా జి. సోమయ్య, బి. హైమావతి, జాయింట్ సెక్రటరీగా పి. రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. సురేందర్ రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా బి. వీరయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎం. మేరీ నిర్మల, ఎండీ. అబ్దుల్లా, పి. రజితను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు సంఘ రాష్ట్ర, జిల్లా కార్యవర్గం శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత కంటిపొర చికిత్స శిబిరంలో ఆపరేషన్లు ప్రారంభం

- తొలిరోజు 25 మందికి ఆపరేషన్లు



**రామన్నపేట, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** మునిపంపుల భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో దేవి రెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు (ఎన్ఆర్ఐ) దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి పద్మ సహకారంతో శంకర్ నేత్రాలయ వారిచే నిర్వహిస్తున్న ఉచిత కంటిపొర చికిత్స శిబిరంలో ఆపరేషన్ తప్పనిసరి అని గుర్తించిన 25 మందికి కంటి పొర చికిత్స చేశారు. మొదటగా మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన మారయ్యకు(60) శస్త్ర చికిత్స చేశారు. అంతకముందు ఆపరేషన్ మొబైల్ థియేటర్ ను ఎన్నారై దేవిరెడ్డి వీరేందర్ రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఆర్గనైజర్ తొలుపునూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒకవైపు ఓపి సేవలు కొనసాగుతూనే 30 తారీఖు వరకు గుర్తించిన రోగులకు ఆపరేషన్లు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దేవి రెడ్డి సావిత్రమ్మ, దేవి రెడ్డి వీరేందర్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తోలుపునూరి చంద్రశేఖర్, బొడ్డుపల్లి వెంకటేశం, ఉంద్రాతి నరసింహా, శివ, తూర్పుగోదావరి శ్రీనివాస్, భిక్షం, కట్ట యాదయ్య, మన్నె పద్మా రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# హస్తకళలను పరిశీలించిన నార్వే దేశీయుడు



**చౌటుప్పల్, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** ప్రకృతి రంగుల చేనేత వస్త్రాలు, ప్రాచీన హస్తకళలు, వెదురుతో తయారుచేసిన వస్తువులు అద్భుతంగా ఉన్నాయని నార్వేకి చెందిన లార్స్ నీల్సన్, ఫ్యాషన్ డిజైనర్ స్వాతి బింటే ప్రశంసించారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం లో జాతీయ పురస్కార గ్రహీత దుద్యాల శంకర్ ఇంటిని సందర్శించారు. ప్రకృతి నుంచి సేకరించిన మూలికలతో వస్త్రాలకు రంగులు అద్దే ప్రక్రియను, మగ్గంపై వస్త్రాలను నేసే విధానాన్ని వారు పరిశీలించారు. దండు మల్కాపురంలోని టెక్స్టైల్ పార్కులో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ కే కృష్ణమూర్తి నెలకొల్పిన హస్తకళల వర్క్ షాప్ మినీ క్రాఫ్స్ ను సందర్శించారు. ప్రాచీన చేనేత హస్తకళలైన బాతిక్ బ్లాకు స్క్రీన్ టై అండ్ డై పద్ధతుల్లో నేటి తరానికి అనుగుణంగా తయారు చేస్తున్న కాటన్ వస్త్రాలను పరిశీలించారు. మరుగున పడిపోతున్న ప్రాచీన కళలను వెలికి తీసి పూర్వ వైభవం తేవడానికి కృషి చేస్తున్న కృష్ణమూర్తిని వారు అభినందించారు. వెదురుతో ఇళ్లను నిర్మించడంతోపాటు వివిధ రకాలుగా కళాకారుడు శ్రవణ్ తయారుచేసిన వినిమయ వస్తువులను వారు పరిశీలించారు. ప్రకృతికి నష్టం కలిగించకుండా చెట్లను నరకకుండా వెదురుతో నిత్యవసర వస్తువులు కళాఖండాలు సృష్టిస్తూ పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్న శ్రవన్ ను వారు అభినందించారు.

## గుండెబోయిన రామ్మూర్తి విగ్రహావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్



**హాలియా, అక్టోబర్ 26 (జనం సాక్షి) :** త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామంలో ఆదివారం దివంగత నేత మాజీ శాసనసభ్యులు గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆదివారం వారి కుటుంబ సభ్యులు నిర్వహించగా ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్, రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ లు పాల్గొని వారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాదం సంపత్ కుమార్, బాబురావ్ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు పామోజు వెంకటా చారి, కూరాకుల వెంకటేశ్వర్లు, తాటి సత్యపాల్, పిడిగం నాగయ్య, జాటావత్ రవి నాయక్, నాయకులు కామెర్ల జానయ్య, గుండెబోయినా వెంకటేశ్వర్లు, అనుముల శ్రీనివాస్ రెడ్డి, బిక్షా నాయక్, అనుముల శ్యామ్ సుందర్ రెడ్డి, మజ్జిగపు వెంకట్ రెడ్డి, పులిజాల విష్ణు, నల్గొండ సుధాకర్, మెరుగు రామలింగయ్య, సురబి రాంబాబు, నడ్డి బాలరాజు యాదవ్, మండలి రవి కుమార్, జాలా పాపయ్య, మెండే సైదులు యాదవ్, దైద రవి, రామావత్ రవి నాయక్, కిషన్ నాయక్, బొమ్మి శెట్టి వెంకటేశ్వర్లు, కిషన్ నాయక్, నడ్డి సత్యం, రాయన బోయనా వెంకన్న, దస్తగిరి, దోరెపల్లి కొండల్, నగిరి శ్రీను తదితర నియోజకవర్గం లోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# 5 లక్షల ఐఫోన్స్‌లు జలసమాధి

- నీట మునిగిన భారీ కార్గోషిప్
- రూ.4వేల కోట్ల నష్టం!

ప్రపంచ ప్రఖ్యాత షిప్పింగ్ కంపెనీ 'ఎవర్‌గ్రీన్'కు చెందిన ఒక పెద్ద కార్గో నౌక పెరూ తీరానికి సమీపంలో ప్రమాదానికి గురైంది. దీంతో ఆ నౌకలో ఉన్న సుమారు 5,00,000 ఐఫోన్ 17 మొబైల్స్ సముద్రంలో మునిగిపోయాయి. ఇంతకీ ఈ ప్రమాదం ఎలా జరిగింది?, జరిగిన నష్టం ఎంత అనే విషయాలను ఇక్కడ వివరంగా తెలుసుకుందాం. పెరూలోని ప్రాంతీయ షిప్పింగ్ లాగ్‌లు సంబంధిత అధికారుల ప్రకారం.. ఎవర్‌గ్రీన్ నౌక చైనాలోని షెన్‌జెన్ నుంచి అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌కు వెళు తుండగా కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంది. ఆ సమయం లోనే నౌక పెరూలోని కల్లావో ఓడరేవులో షెడ్యూల్ ప్రకారం ఆగింది. అయితే బలమైన గాలులు, శక్తివంతమైన అలల కారణంగా.. కంటైనర్లు పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయాయి. ప్రాథమిక నివేదికల ప్రకారం సుమారు 50 కంటైనర్లు సముద్రంలో పడిపోయినట్లు సమాచారం.సముద్రంలో మునిగిపోయిన కంటైనర్లలో.. యాపిల్ ఉత్పత్తులు ఉన్నాయా? అనే విషయంపై అటు యాపిల్ కంపెనీ.. ఎవర్‌గ్రీన్ అధికారికంగా ధృవీకరించలేదు. అయితే ఈ కంటైనర్లు దక్షిణ అమెరికా %ట% ఉత్తర అమెరికా మార్కెట్లకు వెళ్లే ఐఫోన్ 17 యూనిట్లతో నిండి ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే రూ. 4,000 కోట్లకుపైగా నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. ప్రభావం ఇలా.. ఐఫోన్ 17ను కంపెనీ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 2025లో ప్రారంభించింది. అప్పటి నుంచి వీటికి రికార్డు స్థాయి ఆర్డర్లు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఐదు లక్షల ఐఫోన్ 17లు నీటిపాలవ్వడం అనేది బాధాకరమైన విషయం. ఇది ఐఫోన్ 17 డెలివరీలను చాలా ఆలస్యం చేసే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా ఎలక్ట్రానిక్ పరికరాలు.. ఉప్పునీటిలో కలిసిపోవడం వల్ల, సముద్రంలోని జలచరాలు కూడా హాని కలిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## రూ.1,500 కోట్ల సమీకరణకు ఓలా ఓకే

న్యూఢిల్లీ:సెక్యూరిటీల జారీ ద్వారా రూ.1,500 కోట్ల నిధుల సమీకరణకు బోర్డు ఆమోదం తెలిపినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. "రైట్స్ ఇష్యూ, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్(క్యూఐపీ), ప్రైవేటు ప్లేస్‌మెంట్ లేదా ఇతర చట్టబద్ధమైన మార్గాల ద్వారా ఈక్విటీ షేర్లు/వారెంట్లు లేదా కన్వర్టిబుల్ సెక్యూరిటీలు జారీ చేసి రూ.1,500 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది." అని బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఓలా ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.అయితే నిధుల సమీకరణ కారణాలను మాత్రం వెల్లడించలేదు.2024 ఆగస్టులో బోర్సులో లిస్ట్ అయిన ఓలా ఎలక్ట్రిక్ తన ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) లో తాజా ఇష్యూ ద్వారా రూ .5,500 కోట్లు సేకరించిన ఏడాది తరువాత మళ్లీ ఇప్పుడు నిధుల సేకరణకు ఆమోదం లభించడం గమనార్హం?. 2025 మేలో, బెంగళూరుకు చెందిన కంపెనీ బోర్డు నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్లు, ఇతర రుణ సాధనాల ద్వారా రూ .1,700 కోట్ల వరకు సేకరించే ప్రతిపాదనలను ఆమోదించింది. సాఫ్ట్ బ్యాంక్, జెడ్ 47, టైగర్ గ్లోబల్ మేనేజ్ మెంట్, ఇతరులతో సహా పెట్టుబడిదారులు ఈ ఏడాది ప్రారంభంలో కంపెనీలో తమ వాటాలను తగ్గించు కున్నారు.ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ .428 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. ఇది ఒక సంవత్సరం క్రితం రూ .327 కోట్లు కాగా, మార్చిలో రూ .870 కోట్ల నష్టం కంటే తక్కువగా ఉంది. నిర్వహణ ఆదాయం రూ .828 కోట్లు. ఇది ఒక సంవత్సరం క్రితం కంటే దాదాపు సగం.

# బాంబూ ఫ్లోరింగ్

## ఇప్పుడిదే ట్రెండింగ్!



జనంసాక్షి:శుభ్రం చేయడమెంతో తేలిక. దీర్ఘకాలపు మన్నిక.. ఎలాంటి మరకలైనా తుడవగానే మాయం. నిర్మాణాలలో కనిపించని సమస్యలు. పైగా ఇంటికి సరికొత్త అందం. అనేక ప్రత్యేకతల కారణంగా వెదురు గచ్చు(బ్యాంబూ ఫ్లోరింగ్)కి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.భూతాపాన్ని తగ్గించడానికి ప్రపంచం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో పర్యావరణ ప్రియుల దృష్టి వెదురు గచ్చు మీద పడింది. ఇతర రకాల కలప కంటే దృఢంగా ఉండటం.. చూసేందుకు చక్కగా కనిపించడం.. తదితర కారణాలతో వెదురు గచ్చుకి గిరాకీ అధికమవుతోంది. వెదురు గచ్చుల్లో ఎలిగెంట్, ఎలైట్ అనే రెండు రకాలు లభిస్తాయి. వీటి తయారీ ప్రక్రియల్లో చాలా తేడా ఉంటుంది. కత్తిరించిన చిన్నచిన్న బ్యాంబూని అతికించేది ఎలిగెంట్ అయితే.. దీనికి భిన్నంగా బ్యాంబూ ఫైబర్‌తో చేసేది ఎలైట్ రకం. ఇదెంతో దృఢంగా ఉంటుంది. మొత్తం మూడు వర్ణాల్లో ఈ కలప లభిస్తుంది. ఆరేళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండటం కోసం గచ్చుకి ఆరు లేయర్ల పాలియురేథేన్ కోటింగ్ వేస్తారు. ప్రస్తుతం ఈ తరహా కలపను చైనా నుంచి దిగుమతి చేస్తున్నారు. దీంతో ఇంటిని అలంకరించాలంటే.. చదరపు అడుగుకి రూ.200-రూ.350 దాకా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంటే ఓ 100 చదరపు అడుగుల గదికి సుమారు రూ.20 వేలు అవుతుందన్నమాట. మార్కెట్లో లభించే ఇతర కలపతో తయారైన ఫ్లోరింగ్ కు చదరపు అడుగుకి రూ.300 దాకా అవుతుంది. వెదురు కలప ఇంట్లో వేయడానికి విడిగా చార్జీలుంటాయి. చదరపు అడుగుకి రూ.15 దాకా తీసుకుంటారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మీ ఇంట్లో ప్రస్తుతం ఎలాంటి గచ్చు ఉన్నా దానిపై బ్యాంబూ ఫ్లోరింగ్‌ను సులువుగా వేసుకోవచ్చు. ఒక్కరోజులో పని పూర్తవుతుంది. ఈ గచ్చు ప్రత్యేకతలు అన్నీఇన్నీ కావు. దీనిపై గీతలు కనిపించవు. కాలిపోవడమంటూ ఉండదు. కొన్నాళ్ల తర్వాత రంగు వెలిసిపోతుందన్న దిగులు అక్కరలేదు. నిర్వహణలో శ్రమపడక్కర్లేదు. సిరామిక్ టైల్సుకునే గుణం వెదురు గచ్చుకి ఉండటం వల్ల.. చాలామంది తమ బడత్వల గదుల్లో వాడుతున్నారు. చిన్నారులు కిందపడినా దెబ్బలు తగలవు. హోమ్ థియేటర్లు, పడక గదుల్లోనూ ఈ తరహా గచ్చును కోరుకునేవారి సంఖ్య పెరుగుతోంది. సంపన్న గృహాల్లోని బయటి ప్రాంతాల్లోనూ ఈ రకం కలపతో అలంకరిస్తున్నారు. ఉద్యానవనాలు, బాల్కనీలు, స్విమ్మింగ్‌పూల్, పోర్టికోల వద్ద విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం చదరపు అడుగుకి రూ.400 వరకూ అవుతుంది. అన్నిరకాల వాతావరణానికి ఎదురొడ్డి నిలబడం వల్ల వెదురు గచ్చు మీద ప్రత్యేక మక్కువ పెరుగుతోంది.



# మ్యాజిక్ కవర్స్.. ఫోన్‌ను ఫుల్ చార్జ్ చేస్తుంది

న్యూఢిల్లీ:ఫోన్ మన ఫ్రెండ్, మన స్టయిల్, కొన్నిసార్లు మన సీక్రెట్ కీపర్ కూడా! అలాంటి ఫోన్‌ను కాపాడే కవర్స్, ఫోన్ కేస్‌లను తక్కువ అంచనా వేయొద్దు! ఇవి కేవలం ప్రొటెక్షన్ కోసం మాత్రమే కాదు.స్టైల్‌నెస్, సౌలభ్యం అన్నీ కలిపిన మ్యాజిక్ కవర్స్ కూడా!ఫోన్ 'లో బ్యాటరీ' అని అరుస్తుందా? పైగా పవర్‌బ్యాంక్ కూడా మర్చిపోయారా? టెన్షన్ వద్దు! బయటికి వెళ్లి సూర్యుడి వైపు మీఫోన్‌ను చూపించండి. అప్పుడు ఈ కేస్ చెప్తుంది 'ఓకే బ్రో, నేను ఉన్నా కదా!' ఎందుకంటే ఇది సాధారణ ఫోన్ కవర్ కాదు. 'అయాన్ సోలార్ కేస్' మార్కెట్‌లో కొత్తగా వచ్చిన ఈఫోన్ కేస్ ఒక గంట సూర్యరశ్మిని ఉపయోగించి మీ ఫోన్‌ను ఫుల్ చార్జ్ చేస్తుంది. వైర్లు లేవు, ప్లగ్ లేదు. పైగా బ్యాక్‌గా ఛార్జింగ్ స్టయిలిష్ డిజైన్‌తో కూడా వస్తుంది. ఇది తొందరగా ఐదు శాతం పవర్‌ను సమర్థంగా ట్రాన్స్‌ఫర్ చేయగలదు. అంటే ఎక్కడైనా, చార్జింగ్ ఎఫిషియెన్సీ పూర్తి అయితే, తర్వాత రోజులకు ఇది, ఒక పవర్‌బ్యాంక్ లాగా బ్యాటరీని స్టోర్ కూడా చేస్తుంది. ధర 99 డాలర్లు అంటే రూ. 8,778.ఫోన్‌లో ఫొటో తీసుకుంటే వెలుతురు తక్కువగా ఉందా? వీడియో తీయాలంటే ముఖం స్పష్టంగా కనిపించడం లేదా? ఇక ఆ సమస్యలకు పూర్తి లైట్ సొల్యూషన్ వచ్చేసింది! అదే ఈ 'సెల్ఫీ ఎల్ఈడీ రింగ్ లైట్ కేస్'. ఫోన్ కవర్‌లా కనిపించే ఈ కేస్‌లోనే లైట్ దాగి ఉంటుంది. బటన్ నొక్కగానే గుండ్రంగా వెలిగే రింగ్ లైట్ బయటికి వస్తుంది. ఒక్కసారి నొక్కితే లైట్ ఆన్, తర్వాత అప్షన్లతో మీ అవసరానికి సరిపోయేలా వెలుతురు తక్కువగా లేదా ఎక్కువగా సర్దుకోవచ్చు. సెల్ఫీలు, వీడియోలు, మేకప్, రీల్‌లు ఏదైనా సరే, మిమ్మల్ని ఒక స్టార్‌లా మెరిపించే బాధ్యత ఇది తీసుకుంటుంది. అదనపు వైర్లు, బ్యాటరీల అవసరం లేకుండా, దీనిని యూఎస్‌బీ ద్వారా చార్జ్ చేసుకోవచ్చు. ధర బ్రాండ్, డిజైన్ బట్టి మారుతుంది.పెద్ద గేమ్ కంట్రోలర్‌ను జేబులో పెట్టుకొని వెళ్లడం సాధ్యం కాదు. కాని, ఫోన్‌కు ఎప్పుడూ అంటిపెట్టుకొని ఉండే కేస్‌లో దాచేస్తే ఎలా ఉంటుంది ? అదే ఈ 'ఎమ్‌కాన్ కంట్రోలర్'. ఇది బయటికి సాధారణ ఫోన్ కేసులా కనిపించినా, లోపల మాత్రం గేమింగ్ మాయ దాగి ఉంటుంది. దీని సైడ్‌లో ఉన్న రెండు బటన్లను ఒకేసారి నొక్కగానే అసలు సరదా మొదలవుతుంది! అప్పటిదాకా, ఫోన్ వెనుక దాగి ఉన్న గేమ్ కంట్రోలర్ ఒక్కసారిగా బయటికి వచ్చేస్తుంది. కనెక్ట్ చేయడం చాలా సులభం. స్క్రీన్‌ను గేమింగ్ కోణంలో సెట్ చేసి, గ్రిప్‌ను లాక్ చేస్తే, ఇక దీనికున్న స్మూత్ బటన్లతో ఆట నిశ్శబ్దంగా, స్మూత్‌గా సాగిపోతుంది. తక్కువ బరువుతో, స్టయిలిష్‌గా పాకెట్‌లో సులభంగా ఇమిడిపోయేలా దీని డిజైన్ ఉంటుంది. ధర 129 డాలర్లు, అంటే సుమారు రూ. 11,439.

## విపణి

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.55 | ₹ 5.57 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,15,150 | ₹ 1,25,620 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,70,000

### మలేసియా ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సంప్రదాయ నృత్యంలో పలుపంచుకున్న అమెరికా అధ్యక్షుడు

# మళ్లీ ట్రంప్‌మార్క్ డ్యాన్స్



కౌలాలంపూర్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చాలా రోజులు తర్వాత మళ్లీ ఫుల్ జోష్‌లో కనిపించారు. ఆనందంలో డ్యాన్స్ చేస్తూ కేరింతలు కొట్టారు.మలేషియా పర్యటనలో భాగంగా ట్రంప్ ఇలా స్టెప్పులు వేయడం విశేషం. ట్రంప్ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మలేసియా పర్యటనకు వెళ్లారు. అమెరికా నుంచి దాదాపు 23 గంటల పాటు విమాన ప్రయాణం చేసిన ట్రంప్.. ఆదివారం కౌలాలంపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌కు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఘన స్వాగతం పలికారు. అయితే, ఎయిర్ ఫోర్స్ వన్ నుంచి కిందకు దిగగానే ట్రంప్ రెడ్ కార్పెట్‌పై నడుచుకుంటూ వస్తుండగా.. అక్కడ ఓ బృందం మలేషియా సంప్రదాయ నృత్యం చేస్తోంది. దీంతో, వారి సంగీతం, నృత్యం ట్రంప్‌కు నచ్చడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టులో డ్యాన్స్ చేస్తున్న వారిపైపు నడిచి ట్రంప్ తన మార్క్ డ్యాన్స్ చేయడం మొదలుపెట్టారు. ఇక అతిథి ట్రంప్‌తో పాటు.. మలేషియా ప్రధాని అన్వర్ కూడా సంగీతానికి అనుగుణంగా స్టెప్పులేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇదిలా ఉండగా.. ఆసియాన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునేందుకు ట్రంప్.. మలేషియా పర్యటనకు వచ్చారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రసంగించనున్నారు. ఆసియాన్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, జపాన్ కొత్త ప్రధాని తకాయిచి, దక్షిణ కొరియా నేతలు కూడా పాల్గొననున్నారు.



# కాపాడకపోతే చావే గతి

## సౌదీ అరేబియాలో చిక్కుకున్న ఉత్తరప్రదేశ్ వాసి తనను రక్షించాలంటూ భారత ప్రభుత్వానికి వినతి



న్యూఢిల్లీ: గల్ఫ్ కష్టాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఉపాధి కోసం వెళ్లిన భారతీయులు అక్కడి యజమానుల చేతుల్లో అష్టకష్టాలు పడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)కు చెందిన ఓ వ్యక్తి తన కన్నీటి గాథను వినిపించాడు. సౌదీ అరేబియాలో ఉండిపోయానని, తనను ఈ చెర నుంచి విడిపించి, ఎలాగైనా స్వదేశానికి చేర్చాలని, లేకపోతే చావుతప్ప మరో మార్గం లేదని కన్నీటితో వేడుకున్నాడు.తన పాస్‌పోర్టు లాక్కున్నారని చెప్పాడు. తనను కాపాడాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరాడు. వీడియోలో అతడి వెనుక ఒంటె కనిపిస్తోంది. అతడి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఢిల్లీకి చెందిన ఓ న్యాయవాది ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేశారు. బాధితుడిని రక్షించాలని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌కు విన్నవించారు. వీడియోలో బాధితుడు భోజ్‌పురి భాషలో మాట్లాడుతూ ఏం చెప్పాడంటే.. "మా ఊరు అలహాబాద్ జిల్లాలోని హండియా. పని కోసం సౌదీ అరేబియాకు వచ్చా. నా పాస్‌పోర్టును యజమాని లాక్కు న్నాడు. ఇంటికి తిరిగి వెళ్తానని చెబితే చంపేస్తానని బెదిరించాడు. నా తల్లిని చూడాలని ఉంది. ఈ వీడియోను మీరంతా షేర్ చేయండి. నా ఆవేదన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చేరాలన్నదే నా కోరిక. మీరంతా నాకు సహకరించండి. మీరు ముస్లిం అయినా, హిందూ అయినా ఎవరైనా సరే నాకు అండగా ఉండండి. దయచేసి నన్ను ఆదుకోండి. నాకు జీవితం ప్రసాదించండి. లేకపోతే మరణమే గతి" అని అభ్యర్థించాడు.ఈ వ్యవహారంపై సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. బాధితుడి జాడ తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించింది. అతడికి సంబంధించిన వివరాలు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోవడం సాధ్యం కావడం లేదని పేర్కొంది. అయితే, బాధితుడి ఆవేదనను సౌదీ అరేబియా సెక్యూరిటీ డిపార్టుమెంట్ కొట్టిపారేసింది. అతడి ఆరోపణలకు ఆధారాల్లేవని తేల్చిచెప్పింది. సోషల్ మీడియాలో వీక్షణలు (వ్యూస్), తద్వారా ఆదాయం పెంచుకోవడానికి ఈ ఎత్తుగడ వేశాడని అనుమానం వ్యక్తం చేసింది.

కఫాలా వ్యవస్థ రద్దయినా..

సౌదీ అరేబియాలో కఫాలా వ్యవస్థను రద్దు చేసిన తర్వాత కూడా భారతీయుడు యజమాని చెరలో చిక్కుకుపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆధునిక బానిసత్వంగా విమర్శలు ఎదుర్కొంటున్న కఫాలా వ్యవస్థను సౌదీ ప్రభుత్వం ఇటీవలే రద్దు చేసింది. విదేశీ కార్మికుల పాస్‌పోర్టు లాక్కోవడం, నిర్బంధించడం, వేధించడం నేరమే అవుతుంది. వలస కార్మికుల హక్కుల విషయంలో ఇదొక కీలకమైన సంస్కరణ అని చెబుతున్నారు. సౌదీ అరేబియాలోని కార్మికుల్లో ఎక్కువ మంది భారతీయులే కావడం గమనార్హం.

### ఆర్‌బీఐ మార్గదర్శకాలు.. పేటీఎం ఆఫ్‌లైన్ బిజినెస్ బదిలీ!

న్యూఢిల్లీ: పేమెంట్ అగ్రిగేటర్లకు రిజర్వ్ బ్యాంకు సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్స్ వ్యాపారాన్ని తన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్‌(పీపీఎస్ఎల్)కు బదిలీ చేసేందుకు పేటీఎం మాతృసంస్థ 'వన్97 కమ్యూనికేషన్స్' ఆమోదం తెలిపింది.తద్వారా గ్రూప్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్స్ వ్యాపారాలు పీపీఎస్ఎల్ పరిధిలోకి వస్తాయని పేర్కొంది.ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్ వ్యాపార నిర్వహణకు పీపీఎస్ఎస్ ఇప్పటికే ఆర్‌బీఐ నుంచి ప్రాథమిక అనుమతి పొందినట్లు వివరించింది. పేమెంట్ అగ్రిగేషన్ కార్యకలాపాలన్నీ ఒకే సంస్థ నియంత్రణలో ఉండటం వల్ల.. సమన్వయ సామర్థ్యాలు మరింత పెరుగుతాయని కంపెనీ చెప్పుకొచ్చింది."క్యూఆర్ కోడ్‌లు, సౌండ్ బాక్సులు, ఈడీసీ మెషిన్ పేమెంట్లు ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్స్ వ్యాపారం కిందకు వస్తాయి. పీపీఎస్ఎల్ ఇప్పటికే పేరొందిన పేమెంట్ల వ్యవస్థలో బడి బదిలీ ప్రక్రియ ఉంటుంది. కావున ఆర్థిక ఫలితాలపై ఎలాంటి ప్రభావం ఉండదు" అని కంపెనీ వివరణ ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్స్ బిజినెస్ ఆదాయం రూ.2,850 కోట్లుగా నమోదైంది. కంపెనీ మొత్తం ఆదాయంలో 47% వాటా ఇది.

# ట్రంప్ విషయంలో అదే నిజమైంది

- అధ్యక్ష పోటీపై స్పందించిన కమలా హారిస్



వాష్టింగన్: అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు, భారత సంతతి మహిళ కమలా హారిస్? తాజాగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను తప్పకుండా ఏదో ఒకరోజు అమెరికాకు అధ్యక్షురాలిని కావచ్చు అని అన్నారు.భవిష్యత్తులో శ్వేతసౌధంలో ఓ మహిళా అధ్యక్షురాలు ఉంటుందన్న విశ్వాసం ఆమె వ్యక్తం చేశారు. దీంతో, ఆమె వ్యాఖ్యలపై అమెరికన్లు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు.అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తాజాగా ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్ష పదవి కోసం నేను మరోసారి పోటీచేసే అవకాశం లేకపోలేదు. నా మనవరాళ్ల వారి జీవితకాలంలో కచ్చితంగా ఓ మహిళా అధ్యక్షురాలిని చూస్తారు. బహుశా అది నేనే కావచ్చు. అయితే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ విషయమై నేను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నాకు ఇంకా రాజకీయ భవిష్యత్తు ఉందని భావిస్తున్నాను. వాస్తవానికి నేను చేయాల్సిన పని ఇంకా పూర్తి కాలేదు. నా కెరీర్ మొత్తాన్ని దేశ సేవలో గడిపాను. అది నా రక్తంలో ఉంది అని చెప్పుకొచ్చారు.ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనపై స్పందిస్తూ..'ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ గురించి తాము చేసిన హెచ్చరికలు నిజమే అని ఇప్పుడు నిరూపితం అయ్యాయి. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వస్తే ఫాసిస్ట్‌లా ప్రవర్తిస్తారని, నిరంకుశ ప్రభుత్వాన్ని నడుపుతారని మేము ముందే చెప్పాం. మా అంచనా నిజమైంది. ట్రంప్ న్యాయశాఖను ఆయుధంగా మలచుకుంటూనారని చెప్పారు, ఇప్పుడు సరిగ్గా అదే చేస్తున్నారు' అని ఆరోపించారు.ఇదిలా ఉండగా.. తదుపరి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి సంబంధించి నిర్వహించిన పోల్స్‌లో డెమోక్రట్ల తరపున ఆశావహుల రేసులో కమలా హారిస్? వెనుకంజలో ఉన్నారు. ఇదే విషయాన్ని ఆమె వద్ద ప్రస్తావించగా, తాను వాటిని పట్టించుకోనని తెలిపారు. ఒకవేళ ఇలాంటి పోల్స్‌ను పట్టించుకొని ఉంటే, తాను గత ఎన్నికల్లో పోటీచేసేదాన్ని కాదని తెలిపారు. ఇక, గత ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి తరఫున కమల పోటీచేసిన విషయం తెలిసిందే.

# ఉక్రెయిన్‌పై మళ్లీ క్షిపణుల వర్షం

## డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా..

కీవ్(జనంసాక్షి): ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తోపాటు పలు ప్రాంతాలు లక్ష్యంగా రష్యా శుక్రవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లతో దాడులు కొనసాగించింది. ఈ దాడుల్లో నలుగురు చనిపోగా, 20 మంది వరకు గాయపడ్డారు.కీవ్‌పై వేకువజామున జరిగిన బాలిస్టిక్ క్షిపణి దాడిలో ఇద్దరు చనిపోగా, 13 మంది గాయపడ్డారు. దాడుల్లో ఒక భవనానికి నిప్పంటుకుంది. కూల్చిన క్షిపణి శకలాలు బహిరంగ ప్రదేశంలో పడిపోవడంతో సమీపంలోని వాహనాలు, భవనాల కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు.నీప్రోపెట్రోవిస్క్ ప్రాంతంపై జరిగిన మరో దాడిలో ఇద్దరు చనిపోగా ఏడుగురు క్షతగాత్రులయ్యారు. పలు అపార్ట్‌మెంట్ భవనాలు, నివాస గృహాలు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. రష్యా ప్రయోగించిన 9 క్షిపణులు, 63 డ్రోన్లను గాను నాలుగు మిస్సైళ్లు, 50 డ్రోన్లను మధ్యలోనే కూల్చివేసినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.నిత్యం భయపెడుతున్న రష్యా దాడుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడానికి వెంటనే పేట్రియాట్ రక్షణ వ్యవస్థలను తమకు సమకూర్చాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా, యూరప్, జీ7 దేశాలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నగరాలకు రక్షణ కల్పించేందుకు అమెరికా నుంచి త్వరలోనే 25 పేట్రియాట్ వ్యవస్థల ను కొనుగోలు చేయనున్నామన్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ అధ్యక్షతన లండన్‌లో జరుగుతున్న యూరప్ దేశాల నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

### ఔరంగాబాద్ రైల్వే స్టేషన్

# పేరు మారింది

ఔరంగాబాద్: భారతీయ రైల్వే మరో రైల్వే స్టేషన్ పేరును మార్చింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ పేరును ఛత్రపతి శంభాజీనగర్ స్టేషన్‌గా మారుస్తూ సెంట్రల్ రైల్వే నిర్ణయం తీసుకుంది.ఔరంగాబాద్ నగరం పేరును మార్చిన మూడేళ్ల తరువాత సెంట్రల్ రైల్వే.. ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ పేరును 'ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్'గా మార్చింది. ఈ కొత్త స్టేషన్‌కు కోడ్ 'సీపీఎస్ఎన్' అని సెంట్రల్ రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది.ఈ ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్ దక్షిణ మధ్య రైల్వేలోని నాందేడ్ డివిజన్ కిందకు వస్తుంది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ఇటీవల ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ పేరును మార్చడానికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023లో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని నాటి ప్రభుత్వం ఔరంగాబాద్ నగరం పేరును అధికారికంగా ఛత్రపతి శంభాజీనగర్‌గా మార్చింది. శివాజీ మహారాజ్ కుమారుడైన శంభాజీ మహారాజ్‌కు నివాళిగా నగరం పేరును మార్చారు.



## విద్యుత్ ఘాతంతో రైతు మృతి

**నిజంసాగర్ అక్టోబర్ 26 (జనంసాక్షి)**
నిజం సాగర్ మండలంలోని ఆరేడు గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుఘాతానికి గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. నిజంసాగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆరేడు గ్రామానికి చెందిన గాండ్ల బసప్ప (38) నిజంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లో గల తన వ్యవసాయ పొలంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో బోరు మోటారు మరమ్మత్తుకై నీటిలో దిగి సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

# అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు కాంగ్రెస్ ప్యానెల్ లేదు

- మంత్రుల అండదండ ప్రచారాన్ని నమ్మవద్దు
- కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం
- బ్యాంకు అభివృద్ధికి ప్రభుత్వ సహకారం
- జిల్లా అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 26 (జనంసాక్షి):** జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో ఉండటంతో జిల్లాకు చెందిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం లాంటి ముఖ్య నేతలతో జరిపిన చర్చల అనంతరం తీసుకున్న నిర్ణయం మేరకు కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎలాంటి ప్యానెల్‌ను ప్రకటించలేదని స్పష్టం చేస్తున్నామని మానకొండూరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కొన్ని దినపత్రికల్లో ఆ ప్యానెల్ సభ్యులకే మంత్రుల అండదండ ఉందని, అర్బన్ బ్యాంకులో చైర్మన్ సీటును కైవసం చేసుకోబోయేది వారే అని వస్తున్న ప్రకటనలను జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అర్బన్ బ్యాంకు ఓటర్లు నమ్మవద్దని, ఇది పూర్తిగా అసత్య ప్రచారమని పత్రిక ముఖంగా తెలియజేస్తున్నామన్నారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల బరిలో నిలిచిన వారిలో ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీ వారే ఉన్నందున కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు మాత్రమే పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంకు చరిత్రలో ఎక్కువ కాలం పాలకవర్గాన్ని నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, ఈసారి అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో విజయం సాధించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, అర్బన్ బ్యాంకు వినియోగదారులు, ఖాతాదారుల సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తీసుకోవడంతోపాటు త్వరలో కొలువుదీరనున్న నూతన అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి, బ్యాంకు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తోడ్పాటు అందిస్తుందని, కార్పోరేట్ స్థాయిలో బ్యాంకును ఆధునీకరించడం, సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

### ఎయిర్ పిస్టల్ రాష్ట్ర స్థాయి షూటింగ్‌కు
# ఎంపికైన పులి సనిషిత



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (జనంసాక్షి) :**
అండర్ 19 బాలికల విభాగంలో 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో స్వదేశీ షూటింగ్ అకాడమీలో జరిగిన ఎయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో వేములవాడకు చెందిన ఉపాధ్యాయులు పులి రామ్ గోపాల్ గౌడ్ -సుధారాణిల కూతురు పులి సనిషిత 10 మీటర్స్ ఎయిర్ పిస్టల్ షూటింగ్ లో మొదటి స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించి,రాష్ట్రస్థాయి స్కూల్స్ గేమ్ ఫెడరేషన్ స్కూల్స్ గేమ్ ఫెడరేషన్ కు ఎంపిక అయినది. ఈ సందర్భంగా సనిషిత మాట్లాడుతూ మా తల్లిదండ్రులు మరియు శిక్షకులు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లా స్థాయిలో రాణించి గోల్డ్ మెడల్ సాధించడం మరియు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి కూడా వెళ్ళి, జాతీయ స్థాయిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంచిపేరు తీసుకవస్తానని, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరియు శిక్షకుల విలువైన మెలుకువలు మరువలేనివన్నారు.సనిషిత రాష్ట్ర స్థాయి ఎయిర్ పిస్టల్ షూటింగ్ కు ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సనిషితను అభినందించారు.

# అభినయ కల్చరల్ ఆర్ట్స్ కళోత్సవాలు ప్రారంభం



గోదావరిఖని, జనంసాక్షి : స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో అభినయ కల్చరల్ ఆర్ట్స్ 42వ కళోత్సవాలు ఆదివారం ప్రారంభమ య్యాయి.కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి అతిథులు ప్రారంభించారు. అభినయ సంస్థ వ్యవస్థాపకులు రేణికుంట్ల రాజమౌళి, గోదావరి కళాసంఘాల సమాఖ్య అధ్యక్షులు కనకం రమణ, రేణికుంట్ల సుశీల, రేణికుంట్ల రాజసులోచన, కృషి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షులు కాసిపాక రాజమౌళి, బోడకుంట వెంకట్రాజం,కాంపల్లి నర్సింగరావు, నాట్య గురువులు కొట్టె నాగరాజు, విష్ణు, గుణశ్రీ, శ్రావణి, బట్టల గీత, అంజలి, మాదవి, సీనియర్ నటులు లెల్లెల వెంకటేశ్వర్‌రావు,మేకప్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.జ్యోతి ప్రజ్వలన అనంతరం విజయదుర్గ కోలాట బృందం, గీతరాజ్ అకాడమి కోలాట బృందం,శ్రావణి దాక్ష్యాయని శాస్త్రియనృత్య బృందం ప్రదర్శనలతో కార్యక్రమం ప్రారంభం అయింది.పోటీల అనంతరం సాయంత్రం సభ కార్యక్రమాలలో అతిథుల చేతులమీదుగా బహుమతుల తో పాటు అభినయ అవార్డులు, అభినయ ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు.ఉత్సవాలలో 200 మంది కళాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేణిగుంట్ల రాజమౌళి,కనకం రమణ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా అభినయ కల్చరల్ ఆర్ట్స్ స్థాపించి కళాకారులకు ఎంతో ఆదరణగా నిలుస్తున్నారన్నారు.ఈ సంస్థ మునుముందు పారిశ్రామిక ప్రాంత నాయకులు,ప్రజల సహకారంతో ఇంక ఎన్నో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. తకళాకారులు ఈ సద్వినియోగాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.



### విద్యా వైద్యం మౌలిక వసతులు
# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

**ఇందిరమ్మ ఇండ్లు మోడల్ హౌస్ ప్రారంభం : ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు**

**గాంధారి అక్టోబర్ 26 జనం సాక్షి :** ఎల్లారెడ్డి నియోజకవర్గ గాంధారి మండల కేంద్రంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొదటగా ఇందిరమ్మ మోడల్ హౌస్ను ప్రారంభించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ గాంధారి పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన కొత్త మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే తమ సొంత నిధులతో రూ.9 లక్షలు కేటాయించారు. అదే పాఠశాలలో ఆగ్మెంటెడ్ వర్చువల్ రియాలిటీ ల్యాబ్ అలాగే కొత్త కంప్యూటర్ ల్యాబ్ కూడా ప్రారంభించారు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్యలో మరింత అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.రూ.12 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్, మాట్లాడుతూ... "విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధి పట్ల మన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గాంధారి ప్రాంత అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు త్వరలో చేపడతాము అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు యువత, మహిళాలు, కాంగ్రెస్ నాయకులు, వివిధ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి వెంటనే
# రైతులను ఆదుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 26 (జనం సాక్షి)**
అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసి ముద్దై రైతులకు కష్టార్జిత పంట నష్టపోతున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు తమ రక్తం చెమటతో పండించిన వరి పంటను ఐకెపి కేంద్రాలకు తరలించి రాసులుగా వేసారని, పట్టాలు కప్పినప్పటికీ భారీ వర్షాలతో గాలులు వీచి పట్టాలు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయిందని తెలిపారు. ఐకెపి కేంద్రాలలో సరైన వసతులు, భూమి సదుపాయాలు లేక రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తిరస్కరించడం అన్యాయం. రైతుల పక్షాన ప్రభుత్వం నిలబడి వెంటనే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. మెచ్యూర్ పేరుతో వారాల తరబడి రైతులను కేంద్రాల్లో వేధించడం సరికాదుని అన్నారు. తేమ శాతాన్ని పెంచి తడిసిన ధాన్యాన్ని సడలింపుతో కొనుగోలు చేయాలని, రైతులకు కనీసం పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులు తమ జీవితాధారం అయిన పంటను రక్షించుకోలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణమే ముందుకు వచ్చి నష్టపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లేనిపక్షంలో రైతులు నిరసనలకు దిగే పరిస్థితి వస్తుంది, అని చంద్రశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వారికి సభ్యులు వెంకట్ గౌడ్ మోతి రామ్ నాయక్ కొత్త నరసింహులు ముధం అరుణ్ కుమార్ దొడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యాన్ ఢీ కొట్టి వ్యక్తి మృతి

**మల్లాపూర్ అక్టోబర్ 26, (జనంసాక్షి)**
మల్లాపూర్ మండలము లోని ముత్యంపేట గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం TS 16 UD 3749 నెంబర్ గల ఐచర్ వ్యాన్ టూ వీలర్ నంబరు TS 21 C 1544 ను టక్కరు ఇవ్వగా టూ వీలర్ నడుపుతున్న వ్యక్తి ఎర్ర బావయ్య,వ (52) సం, కులం మాదిగ గ్రామం సాతరాం క్రిందపడి తలకు గాయాలయి అక్కడికక్కడే చనిపోయినాడు మృతుని బాడీని అంబులెన్స్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సైకే రాజు తెలిపారు.

# ఓపెన్ జిమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- 5లక్షల కేటాయించిన మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



చిగురుమామిడి అక్టోబర్ 26(జనంసాక్షి):ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ జిమ్ లను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తుందని,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామంలో 5లక్షల రూపాయలతో నిర్మించిన ఓపెన్ జిమ్ ను ఆదివారం కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓపెన్ జిమ్ ను నిర్మించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.ఓగులాపూర్ గ్రామానికి 5లక్షల రూపాయలు మంజూరు చేసి ఓపెన్ జిమ్ ను నిర్మించినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కు,మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డికి, సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు వారు ధన్యవాదాలు తెలిపారు.ప్రజలు ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం చేయడానికి ఓపెన్ జిమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు.ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అరగంటపాటైనా వ్యాయామం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ బోయిని శ్రీనివాస్, మాజీఉపసర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బద్దం నారాయణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండ్రా అనిల్,ఏలేటి వెంకటరెడ్డి,పాలకేంద్రం చైర్మన్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కవ్వంపల్లి రవి,గడ్డం చంద్రారెడ్డి,బూడిద వెంకట్, ముసుకు తిరుపతిరెడ్డి బద్దం అనంతరెడ్డి బద్దం నారాయణరెడ్డి సుధాకర్ రెడ్డి బూడిద మహిపాల్, కురుమ ఒదయ్య, కవ్వంపల్లి రాములు, బోయిని కొమరయ్య, ఇల్లెందుల రాజు,బద్దం రాజేశ్వర్ రెడ్డి, కొమరయ్య, బొమ్మగాని పరశురాములు గౌడ్, కళ్లెం రాజేశ్వర్ రెడ్డి,బూడిదల శేఖర్,పో రెడ్డి రాజిరెడ్డి, గ్రామస్తులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.


# కొత్తపల్లి కృష్ణారావుకి మాతృ శ్రీ వైద్య సేవా పురస్కారం



**ఖమ్మం (జనం సాక్షి) :** తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, తెలుగు భాషా కల్చరల్ అసోసియేషన్, తిరుపతి కి చెందిన ఐయస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణారావు అవార్డ్ అందుకున్నారు. ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాల యంలో కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఫార్మసీ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న కొత్తపల్లి కృష్ణారావుకు "తెలుగు మాతృశ్రీ వైద్య సేవా పురస్కారం" అందుకున్నారు. జాతీయ స్థాయిలో కవి సమ్మేళనాలలో... వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌సిడి, యోగా ప్రాణాయామ ప్రక్రియలలో ఉత్తమ ఫలితాలు ఆయన సాధించారు. రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి గారైన పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ ఆఫీస్ సిఈఓ దయాకర్ రెడ్డి తెలుగు కళా రత్నాలు సాహితీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ యు.వి.రత్నం చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ ఉత్తమ వైద్య సేవా పురస్కారం అందుకున్న కొత్తపల్లి కృష్ణారావు ను కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ నెల్లూరి చందన, డాక్టర్ శిరీష, స్టాఫ్ నర్స్ పుష్పలత, HEO వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్ రాధాకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ అనురాధ అభినందించారు.

# ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన మూలమలుపులు

- మోడల్ స్కూల్ వద్ద పలు ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న ప్రయాణికులు



**చిగురుమామిడి అక్టోబర్26 (జనంసాక్షి):**
కొత్తపల్లి నుండి హుస్నాబాద్ కు వెళ్లే ప్రధాన రహదారిపై పలు గ్రామాల్లోని మూల మలుపులు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.చిన్న మూల్క నూర్ మోడల్ స్కూల్ వద్ద వందలాదిమంది విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. యమ డేంజర్‌గా ఉన్న మూలమలుపు వద్ద సంబంధిత అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు గాని ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సుందరగిరి గ్రామ శివారులోని పెసరిపల్లెతో పాటు పెట్రోల్ పంపు దాటిన తర్వాత మరో మూలమలుపు చాలా ప్రమాదక రంగా మారాయి. ఈ మూలమలుపుల వద్ద ఇటీవల చాలా ప్రమాదాలు జరిగాయి.మూలమలుపుల వద్ద విపరీతంగా చెట్లు సైతం ఉండడంతో డ్రైవర్లు గుర్తించలేకపోతున్నారు. సుందరగిరి చౌరస్తాలో నిత్యం వాహనాలు రోడ్డుపై పార్కింగ్ లు చేస్తుండడంతో మరింత ప్రమాదకరంగా మారింది. బొమ్మనపల్లి,నవాబుపేట గ్రామాల నుండి క్వారీ లారీలు అతివేగంతో రావడంతో నిత్యం రోడ్డు రద్దీగా మారుతుంది.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్న ముల్కనూరు పాఠశాల వద్ద వెంటనే స్పీడ్ బేకర్ తో పాటు,మరిన్ని జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.చిన్నచిన్న నిర్లక్ష్యం పనుల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని అధికారులు స్పందించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

## మా వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

**గంభీరావుపేట అక్టోబర్ 26( జనం సాక్షి)**
కామారెడ్డి వైద్యులు డాక్టర్ షేక్ మక్బూల్ అలీ ఎండి అనస్తీసియా, డాక్టర్ షమీనా మహమ్మద్ ఎండి జనరల్ ఫిజీషియన్ లా కుమారుడు షేక్ జిసాన్ అలీ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేశారు. సుమారు 50 వేల రూపాయల విలువ గల మందులు టానిక్స్ టాబ్లెట్లు వృద్ధులకు అందించారు. దీనితోపాటు 50 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ మక్బుల్ మాట్లాడుతూ మా గురువుగారైన నరసయ్య గౌడ్ వృద్ధుల సేవా కార్యక్రమములో నాకు వారి శిష్యుడిగా అవకాశం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. కామారెడ్డి నుండి వచ్చి మా వృద్ధాశ్రమం లోని వృద్ధులకు వైద్య సేవలు చేసి మానవత్వాన్ని చాటినందుకు అభినందనలతో పాటు ఆశ్రమ నిర్వాహకులు నంది అవార్డు గ్రహీత మల్లు నరసయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు

# తెలుగు యువతికి అంతర్జాతీయ గౌరవం

- ఏఐ ఆధారిత ఇన్నోవేషన్‌లో విశేష ప్రతిభ
- ప్రపంచవ్యాప్తంగా 85 దేశాల మహిళా ఇంజినీర్లలో ఎంపిక
- ఎనర్జీ రంగంలో సాంకేతిక పరిష్కారాలు
- తండ్రి జగిత్యాల డీఎస్పీకి తగ్గ తనయ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 26 (జనంసాక్షి):** కరీంనగర్‌కు చెందిన తెలుగు యువ ఇంజినీర్ హనుష దురిసేటి మరో అంతర్జాతీయ గుర్తింపు సాధించారు. సొసైటీ ఆఫ్ ఉమెన్ ఇంజినీర్స్ (ఎస్‌డబ్ల్యూఈ) సంస్థ నుంచి ఆమెకు 'రైజింగ్ టెక్నికల్ కాంట్రిబ్యూటర్ అవార్డు' లభించింది. ఈ అవార్డును ప్రపంచవ్యాప్తంగా 85 దేశాల్లోని మహిళా ఇంజినీర్లలో ప్రారంభ దశలోనే విశేష సాంకేతిక కృషి చేసిన వారికి అందిస్తారు. ప్రస్తుతం హనుష ఐరన్ మౌంటెన్ అనే సంస్థలో ప్రొడక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆమె రూపొందిస్తున్న ఏఐ ఆధారిత సాంకేతిక పరిష్కారాలు ఎనర్జీ రంగంలో డేటా మేనేజ్‌మెంట్‌ను మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. హనుష సీబీఐటీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్ నుంచి పద్మశ్రీ బీవీ రాజు బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందుకున్నారు. తర్వాత జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చేశారు. అక్కడ ఊప్ స్టార్ట్ ఇంటర్‌ప్రెనర్‌షిప్ కాంపిటీషన్‌లో 50 బృందాల్లో మొదటి స్థానం సాధించారు. సాంకేతికతతో హౌసింగ్ సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్ట్ రూపొందించారు. ఆపై ఇజ్రాయెల్‌లో జరిగిన టెక్నియన్ మెడికల్ హ్యాకథాన్‌లో రెండో స్థానం పొందారు. హనుష అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల హ్యాకథాన్‌లలో జడ్జ్‌గా కూడా సేవలందిస్తున్నారు. వీటిలో హార్వర్డ్ (హ్యాక్ హార్వర్డ్), యేల్ (వైహ్యాక్స్), యూసీ బర్క్లీ (కాల్‌హ్యాక్స్), జార్జియా టెక్ (హ్యాక్ఏటీఎల్), యూనివర్సిటీ ఆఫ్ ఆస్టిన్ వంటివి ఉన్నాయి. యువ ఆవిష్కర్తలకు మార్గదర్శకత్వం అందిస్తూ, కొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తున్నారు. హనుష రూపొందించిన ఏఐ ఏజెంట్లు కంపెనీలకు వేలాది లీజు ఒప్పందాలు, భూమి పత్రాలు, చట్టపరమైన డాక్యుమెంట్లను సులభంగా చదివి విశ్లేషించే సామర్థ్యాన్ని ఇస్తాయి. ఈ ఏజెంట్లు చెల్లింపులు, రిన్యూవల్ తేదీలు, రిస్క్ ఫ్యాక్టర్లు వంటి అంశాలను గుర్తించి సమయానికి సూచిస్తాయి. దీంతో సమయం, వ్యయం రెండూ తగ్గుతాయి. 'ఈ అవార్డు నాకు కొత్త ఉత్సాహం ఇచ్చింది.

ఏఐ ఆధారిత ఇన్నోవేషన్ ద్వారా పరిశ్రమలతోపాటు సమాజానికి కూడా ఉపయోగపడే పరిష్కారాలను అందించాలనేది నా లక్ష్యం' అని హనుష దురిసేటి తెలిపారు. హనుష తండ్రి దురిసేటి రఘు చందర్ జగిత్యాల డీఎస్పీగా పని చేస్తున్నారు. తండ్రికి తగ్గ తనయగా హనుష పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. హనుష అంతర్జాతీయ స్థాయిలో అవార్డు సాధించడంపై వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కరీంనగర్ వాసులు అభినందనలు తెలిపారు.

# రాజ్యాధికార సాధనతోనే యాదవులకు గుర్తింపు

- యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్



**రాయికల్ అక్టోబర్ 28(జనం సాక్షి) :**
రాజ్యాధికార సాధనతోనే యాదవులకు గుర్తింపు వస్తుందని, అందులో భాగంగా యాదవులు సర్పంచ్ లు ఎంపీపీ లు జడ్పీటీసీ లు జడ్పీ చెర్మన్ లు ఎమ్మెల్యే లుగా పోటీ చేసి గెలుపే లక్ష్యంగా యాదవులు ముందుకు సాగాలని యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. ఆదివారం రాయికల్ మండలం కొత్తపేట గ్రామ యాదవ సంఘ సభ్యుల సమావేశాన్ని యాదవ సంఘ భవనలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రెబ్బాస్ మల్లయ్య యాదవ్, మంత్రి రాజు కుమార్ యాదవ్, వేల్పుల రవి యాదవ్, జాల భూమేష్ యాదవ్, యాదవ్, దానవేణి రాజుయాదవ్, గోనే నరేష్ యాదవ్,పంచతి శంకర్ యాదవ్,దనరేకుల తుక్కారం యాదవ్..లతో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొని సభ్యత్వ నమోదుతో సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం,న్యాయంగా యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన తదితర విషయాలు చర్చించారు. అనంతరం కొత్తపేట గ్రామ యాదవ సంఘ సభ్యులు మొత్తం "51" సభ్యత్వం తీసుకోగ వారికి జిల్లా ఇంచార్జిలతో కలిసి సభ్యత్వ రసీదులందించారు అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు గా గనవేని అశోక్, కోలా కిషన్, కడ పెద్ద భూమయ్య నియమించిన జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ తెలిపారు..ఈ కార్యక్రమలో సంఘ పెద్ద మనుషులుగోనే రాయమల్లు, ఆసరి వెంకటేష్, పంచతిరాజేష్, రాగుల మల్లయ్య, దానవేణి మల్లేష్, గాజవేణి భీమయ్య,తమ్మనవేణి కొమురయ్య, సందవేణి గంగాధర్, దానవేణి రాములు, ముద్దం స్వామి, కడ భూమయ్య, ముద్దం సురేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు..




# శ్రీచైతన్య సీజ్ వెనుక జీహెచ్‌ఎంసీ కుట్రకోణం

## తల్లిదండ్రుల వాకబులో సంచలన వాస్తవాలు

- భవన యజమాని-అధికారుల మధ్య అక్రమ లావాదేవీలే కారణమా?
- సర్కిల్ ఉప కమిషనర్ బర్తరఫ్‌కు డిమాండ్
- విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన

*శేరిలింగంపల్లి శ్రీచైతన్య పాఠశాల సీజ్ వెనుక జీహెచ్‌ఎంసీ కుట్రకోణం బయటపడింది. ఆదివారం వందలాది తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరి ప్రిన్సిపల్, ఏజీఎంతో వాకబు చేశారు. 2022 నుంచి నోటీసులు ఇచ్చామని అధికారులు చెబుతున్నా, యాజమాన్యానికి అక్టోబర్ 14న మాత్రమే మొదటి నోటీసు అందింది. నాలుగు రోజుల్లోనే 18న హఠాత్తుగా సీజ్ చేశారు.*

ద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన

శేరిలింగంపల్లి, అక్టోబర్ 26 (జనంసాక్షి): శేరిలింగంపల్లి శ్రీచైతన్య పాఠశాల సీజ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతూ సంచలనాలకు కేంద్రబిందువుగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వ చర్యలు చేపట్టిన నేపథ్యంలో గత వారం రోజులుగా తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం వందల సంఖ్యలో పాఠశాల భవనం వద్దకు చేరుకున్నారు. ప్రిన్సిపల్, ఏజీఎంతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సీజ్ వెనుక వాస్తవాలు ఆరా తీశారు. సహనం కోల్పోయిన తల్లిదండ్రులు యాజమాన్యాన్ని గట్టిగా నిలదీయడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు 2022 నుంచి విడతలవారీగా నోటీసులు ఇచ్చినట్టు చెబుతున్నారు. కానీ పాఠశాల యాజమాన్యానికి ఇప్పటివరకు ఎలాంటి నోటీసు అందలేదు. అక్టోబర్ 14న మాత్రమే మొదటి నోటీసు అందింది. దానికి స్పందించేందుకు సమయం ఇవ్వకుండానే అక్టోబర్ 18న హఠాత్తుగా సీజ్ చేశారు. ఇది సమంజసమేనా? అని ప్రిన్సిప ల్, యాజమాన్యం ప్రశ్నిస్తున్నారు.

భవన యజమాని–ఉప కమిషనర్ మధ్య బేరాలు సరిగా కుదరకపోవడంతోనే పాఠశాలపై ప్రతాపం చూపారనేది తల్లిదండ్రుల ఆరోపణ. శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి తప్పుడు ధోరణితో ముందుకు సాగినట్టు స్పష్టమవుతోంది. ఏసీపీ చెప్పినట్టు పలుమార్లు నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు. కానీ అధికారిక ఆధారాలు ఎక్కడా లేవు. ప్రిన్సిపల్ దీన్ని నిర్ద్వందంగా అంగీకరించారు. నోటీసులో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నప్పటికీ నాలుగు రోజుల్లోనే సీజ్ చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఇది భవన యజమాని, ఉప కమిషనర్ మధ్య అంతర్గత వ్యవహారమేనని, దీని భాగంగానే అధికార దర్పం ప్రదర్శించి వెయ్యి మంది విద్యార్థుల భవిష్యత్తును నడిరోడ్డుపై పడేశారని విద్యావంతులు, సామాజికవేత్తలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా లాంటి సంస్థ మెడికల్ కాలేజీ విషయంలో విద్యా సంవత్సరం ముగిసే వరకు చర్యలు తీసుకోమని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ ఉప కమిషనర్ దుర్మార్గంగా వ్యవహరించారని స్వచ్ఛంద సంస్థలు దుయ్యబడుతున్నాయి. ఆదివారం ఈ అక్రమాలు వెలుగులోకి రాగానే తల్లిదండ్రులు పాఠశాల గేటు ముందు భారీ నిరసన చేపట్టారు. ఉప కమిషనర్ ప్రశాంతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయవ్యవస్థ, మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకొని తక్షణం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మీడియాను తప్పుదోవ పట్టించడం ఆమె బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ అని మీడియా కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. జవాబుదారీతనం లేని ఉప కమిషనర్, ఏసీపీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని తల్లిదండ్రులు హెచ్చరించారు. భవన యజమాని, ఉప కమిషనర్ అక్రమ లావాదేవీలు వారిద్దరూ తేల్చుకోవాలని, సోమవారం వచ్చి భేషరతుగా క్షమాపణ చెప్పి పాఠశాలను పునఃప్రారంభించాలని, లేకపోతే ఆగ్రహావేశాల ఫలితం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# చివరి గింజ వరకు కొంటాం

- రైతులకు పూర్తి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ చైర్మన్ రొండి రాజు

**వేములవాడ, అక్టోబర్ 26 (జనంసాక్షి):**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం వేములవాడ పట్టణంలోని బాలనగర్ తో పాటు రూరల్ మండలంలోని లింగంపల్లి, బొల్లారం, మర్రిపల్లి, హనుమాజిపేట గ్రామంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా, కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, రైతులకు ఏ విషయంలోనైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా, ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని కఠిన హెచ్చరిక జారీ చేశారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉండడమే తెలంగాణ అభివృద్ధికి మూలం అని వారు పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని వారు తెలియజేశారు. ?రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకు కృషి చేస్తున్నామని, తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టే



పరికరాన్ని కూడా అందుబాటులో ఉంచామని, అవసరమున్న రైతులు ఈ పరికరాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, డైరెక్టర్లు ఖమ్మం గణేష్, కత్తి కనకయ్య, విద్యాసాగర్, పరశురాం, నాయకులు కూరగాయల కొమరయ్య, సంఘ స్వామి యాదవ్, తోట రాజు, పులి రాంబాబు, అన్నారం శ్రీనివాస్, పుల్కం రాజు, పీర్ మహమ్మద్, దాడి మల్లేశం, అంబాటి చందు, సాయిని అంజయ్య, కుతాడి రాజేశం, కొక్కుల బాలు, కొండ శేఖర్, నాగుల విష్ణు, రమేష్, గంటల ప్రకాష్, బాబున్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు

**ముత్తారం అక్టోబర్ 26 (జనంసాక్షి) :** ప్రజల భద్రత, నేరాల నియంత్రణ,నిందితుల ను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్ని ముత్తారం ఎస్సై రవికుమార్ అన్నారు. ఆదివారం ముత్తారం మండల కేంద్రంలో కాసార్ల గడ్డ సమీపంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమోరాలను ప్రారంభించి మాట్లాడారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో సీసీ కెమోరాలు అందుబాటులోని వస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు,అసాంఘికకార్యకలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతవరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థా నిక ఎస్ఐలు ప్రత్యేక చొరువ చూపాలన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఐ రామకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో మిర్చి వ్యాపారులు మారం శ్రీను దేవేందర్ రెడ్డి,నాయకులు గాధం శ్రీనివాస్, రాజు తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## యాదవుల ఐక్యతకు చిహ్నం సదర్

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్ అక్టోబర్ 26 జనం సాక్షి :** యాదవుల ఐక్యతకు చిహ్నం సదరు అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మొయినా బాద్ కేంద్రంలో అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్యను ప్రత్యేకంగా స్టేజీపై సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లగుల్ల అశోక్ యాదవ్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు చిహ్నం సదరు అని ఆయన అన్నారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ సదరు సమ్మేళనం మొయినాబాద్ లో అంగరంగ వైభవంగా యాదవులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, టిపిసిసి కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు పల్లగొల్ల మల్లేష్ యాదవ్, అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లగొల్ల అశోక్ యాదవ్, బాకారం మాజీ సర్పంచ్ సుధాకర్ యాదవ్, రవీందర్ యాదవ్, లక్ష్మీపతి యాదవ్, ముదిగొండ ఈశ్వర్, యాదవ సంఘం సభ్యులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాపై రికార్డుల మోత

### ఇక సెలవంటూ రోహిత్ భావోద్వేగ పోస్ట్!

- సిడ్నీలో రికార్డు శతకంతో వీరవిహారం
- వన్డేల్లో అత్యధిక శతకాలు.. హిట్‌మ్యాన్ చరిత్ర
- సచిన్ తర్వాత రెండో భారతీయుడిగా 2500 పరుగుల మైలురాయి
- విరాట్‌తో 68 సార్లు శతక భాగస్వామ్యం.. రికార్డు




**సిడ్నీ, అక్టోబర్ 26 (జనసాక్షి):** ఆస్ట్రేలియా పర్యటనలో రికార్డులు సొంతం చేసుకున్న భారత ఓపెనర్ రోహిత్ శర్మ భావోద్వేగ పోస్ట్‌తో అభిమానులను కలిగించాడు. ఫామ్‌పై సందేహాలు వ్యక్తం చేసిన విమర్శకులకు చెక్ పెట్టిన హిట్‌మ్యాన్, సిడ్నీలో రికార్డు బ్రేకింగ్ శతకంతో వన్డే వరల్డ్‌కప్‌కు సిద్ధతలు చెప్పకనే చెప్పాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక్క విజయం మాత్రమే సాధించినా, రోహిత్ 202 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సాధించాడు. వన్డే కెప్టెన్సీ కోల్పోయిన తర్వాత స్వేచ్ఛగా ఆడిన అతడు, పెర్త్‌లో త్వరగా ఔటైనా ఆడిలైడ్‌లో శ్రేయస్ అయ్యర్‌తో సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. సిడ్నీలో విరాట్ కోహ్లీ (74 నాటౌట్)తో కలిసి 168 పరుగుల జోడీతో భారత్‌కు 9 వికెట్ల తేడాతో విజయం తెప్పించాడు. అక్కడే అతడి 33వ వన్డే శతకం, 50వ ఇంటర్నేషనల్ శతకం సాధించాడు. ఆస్ట్రేలియా వన్డేల్లో అత్యధిక శతకాలు (9) కొట్టిన పర్యాటక ఆటగాడిగా రోహిత్ చరిత్ర సృష్టించాడు. సిరీస్ ముగిసిన తర్వాత ఆదివారం సిడ్నీ విమానాశ్రయంలో దిగిన ఫోటోతో 'వన్ లాస్ట్ టైమ్.. సైనింగ్ ఆఫ్ ఫ్రమ్ సిడ్నీ' అని పోస్ట్ చేసి, భారతీయ క్రికెట్ ప్రేంఖలకు భావోద్వేగాలు కలిగించాడు. కంగారూ బౌలర్లను ఉతికించి శతకంతో రెచ్చిపోయిన హిట్‌మ్యాన్, ఆసీస్‌పై 2500 పరుగుల మైలురాయిని సాధించి సచిన్ టెండూల్కర్ తర్వాత రెండో భారతీయుడిగా చరిత్రలో నిలిచాడు. ఆస్ట్రేలియా గడ్డపై వన్డేల్లో అతడికి ఇది 6వ శతకం. విరాట్‌తో కలిసి 68 సార్లు శతక భాగస్వామ్యం చేసి, సచిన్ (99) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. 2008 నుంచి ఆస్ట్రేలియాలో ఆడిన గొప్ప జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న రోహిత్, 'ఇక్కడ ఆడటం నాకు ఇష్టం.. ఈ విజయంతో ముగించడం సంతోషకరం' అని అన్నాడు. టెస్ట్, టీ20ల నుంచి రిటైర్ అయినా వన్డేల్లో కొనసాగుతున్న అతడు, 2027 వరల్డ్‌కప్ వరకు ఆడాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఈ పోస్ట్‌తో రిటైర్మెంట్ ఊహాగానాలు రేగినా, రోహిత్ ఫామ్‌తో అభిమానులు ఆశలు పెంచుకున్నారు.

# సోఫీ డెవిన్‌కు 'గార్డ్ ఆఫ్ ఆనర్'!

### న్యూజిలాండ్ దిగ్గజం వన్డే కెరీర్ ముగింపు



**న్యూజిలాండ్, అక్టోబర్ 26 (జనసాక్షి):** మహిళల వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ ప్రయాణం ముగి సింది. ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టిన వైట్ ఫెర్న్స్ లీగ్ దశలో ఓటములతో ఇంటిదారి పట్టింది. టీమిండియా చేతిలో ఓడిన తర్వాత సెమీస్ చేరలేకపోయిన బాధ జట్టు సభ్యుల్లో కనిపించింది. ఆదివారం ఇంగ్లండ్ దెబ్బకు ఘోర పరాజయం ఎదురైంది. వన్డేల్లో 4000 పరుగులు, 100 వికెట్లతో మొదటి మహిళా క్రికెటర్‌గా డెవిన్ చరిత్ర సృష్టించింది. అయితే, ఇంగ్లండ్ స్పిన్నర్లు ముప్పుతిప్పలు పెట్టి వైజాగ్‌లో 8 వికెట్ల తేడాతో ఓటమి తెప్పించారు. ప్రపంచకప్ ఆరంభానికి ముందే తన చివరి వన్డే టోర్నీ అని వెల్లడించిన కెప్టెన్ సోఫీ డెవిన్ కెరీర్ ముగిసింది. నిరుడు న్యూజిలాండ్‌ను తొలిసారి టీ20 వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన ఆమె వన్డేల్లో ముద్దాడాలనుకుంది. కానీ, 7 మ్యాచుల్లో ఒక్క విజయంతో సెమీస్ అవకాశం చేజార్చుకుంది. చివరి మ్యాచ్‌లో 23 పరుగులు చేసి ఒక వికెట్ తీసినా, జట్టు 159 పరుగులకు కట్టుబడి ఓడిపోయింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇంగ్లండ్, న్యూజిలాండ్ క్రికెటర్లు ఇరువైపులా నిలబడి 'గార్డ్ ఆఫ్ ఆనర్' ఇచ్చారు. చప్పట్లు కొట్టి, ఆలింగనాలు చేసుకుని, సుదీర్ఘ కెరీర్‌కు అభినందాలు తెలిపారు. ట్విట్టర్‌లో భావోద్వేగాలు వెల్లువెత్తాయి. క్రికెట్‌కు ఆదరణ లేని న్యూజిలాండ్‌లో యువతకు స్ఫూర్తిగా నిలిచిన డెవిన్ 2006 అక్టోబర్ 22న తొలి వన్డే ఆడింది. పేస్ ఆల్‌రౌండర్‌గా ఓపెనర్‌గా రాణించి, 159 వన్డేల్లో 9 శతకాలు, 18 అర్ధశతకాలతో 4279 పరుగులు చేసింది. బంతితో 111 వికెట్లు పడగొట్టి, అత్యుత్తమ 3/24 సాధించింది. 2020లో కెప్టెన్‌గా నియమితురాలై, 2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బ్రాంజ్ మెడల్, గత టీ20 వరల్డ్‌కప్ విజయాలు సాధించింది. మానసిక ఆరోగ్యం కోసం ఆ తలపులో రెండుసార్లు బ్రేక్ తీసుకున్నా, మహిళల క్రికెట్‌కు అంబాసడర్‌గా నిలిచింది. ఇక టీ20ల్లో కొనసాగుతుంది.




# అప్పుడు రియాన్.. ఇప్పుడు ఉమా ఛెత్రీ..

- అస్సాం యువకెరటలు భారత జట్టులో మెరవడం!
- ఈశాన్య రాష్ట్రాల నుంచి క్రికెట్ తారలు దూసుకొస్తున్నారు
- వన్డే ప్రపంచకప్‌లో అరంగేట్రం.. 157వ ప్లేయర్‌గా చరిత్ర
- చిన్నప్పటి నుంచి కలలు.. డబ్ల్యూపీఎల్‌లో మెరిసిన యంగ్‌స్టర్
- సోషల్ మీడియాలో అభినందాలు.. ముఖ్యమంత్రి కంగ్రాట్స్

**గోలాఘాట్, అక్టోబర్ 26 (జనసాక్షి):**

భారత క్రికెట్‌లో ఢిల్లీ, ముంబై, పంజాబ్ రాష్ట్రాల ఆటగాళ్లే హవా వీచుతున్నారు. మహిళల జట్టులో మాత్రం పలు రాష్ట్రాల నుంచి క్రికెటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. క్రికెట్‌కు ఆదరణ పెరగడంతో ఈశాన్య రాష్ట్రాల నుంచి కొత్త తారలు దూసుకొస్తున్నారు. నిరుడు రియాన్ పరాగ్ టీమిండియాకు ఆడగా, ఇప్పుడు ఉమా ఛెత్రీ వన్డేల్లో అరంగేట్రం చేసింది. ఫుట్‌బాల్, బాక్సింగ్‌కు పాపులర్ అయిన అస్సాం నుంచి టీమిండియా జెర్సీ వేసుకున్న రెండో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది ఉమా. వన్డే ప్రపంచకప్‌లో అస్సాం నుంచి మహిళల వన్డేల్లో రెండో ప్లేయర్‌గా ఉమా ఛెత్రీ అరంగేట్రం చేసి ఈశాన్య క్రికెట్‌కు కొత్త అధ్యాయం రాసింది. పదమూడో సీజన్ వన్డే ప్రపంచకప్‌లో వికెట్‌కీపర్ రీచా ఘోష్ గాయపడడంతో ఛెత్రీకి అవకాశం దక్కింది. ఆదివారం బంగ్లాదేశ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌కు ముందు వైస్‌కెప్టెన్ స్మృతి మంధాన నుంచి డెబ్యూట్ క్యాప్ అందుకుందీ యంగ్‌స్టర్. తద్వారా మహిళల వన్డేల్లో ఎంట్రీ ఇచ్చిన 157వ ప్లేయర్‌గా నిలిచింది. ఆమె కంటే ముందు అస్సాం నుంచి రితూ ధ్రుబ్ 2013–14లో వన్డే, టీ20ల్లో తొలి మ్యాచ్ ఆడింది. ఐపీఎల్‌లో చెలరేగి ఆడుతున్న రియాన్ పరాగ్ పురుషుల జట్టు తరఫున 2024లోనే అరంగేట్రం చేశాడు. శ్రీలంకపై తొలి వన్డే ఆడాడీ అస్సామీ క్రికెటర్. గోలాఘాట్ జిల్లాలోని కందులిమరి ఉమా సొంతూరు. చిన్నప్పటి నుంచి క్రికెటర్ అవ్వాలనే లక్ష్యం పెట్టుకున్న ఆమె భారత 'ఏ' జట్టుకు ఆడింది. దేశవాళీ క్రికెట్‌లో బ్యాటింగ్‌తో పాటు వికెట్‌కీపింగ్‌లో అదరగొట్టింది. సీనియర్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహించాలని కలలు కనేది. అనుకున్నట్టే వన్డేల్లో ఎంట్రీ ఇచ్చేసింది. అది కూడా ప్రపంచకప్‌లో అరంగేట్రం అంటే మామూలు విషయం కాదు. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ తరఫున మెరిసిందీ యువకెరటం. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో వికెట్‌కీపర్‌గా అరంగేట్రం చేసింది. రెగ్యులర్ వికెట్‌కీపర్ యాస్తికా భాటియా గాయపడడంతో సెలెక్టర్లు ఉమాకు అవకాశం ఇచ్చారు. అస్సాం క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలికిన ఆమెకు సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంతా బిస్వా సర్మా ఎక్స్ వేదికగా కంగ్రాట్స్ చెప్పారు. అయితే ఉమా తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

## హడలెత్తించిన రాధా, చరణి..


**120లోపే పరిమితమైన బంగ్లా!**
**వర్షం అంతరాయంలో 27 ఓవర్ల పోరు**
**రాధా 3-30, చరణి 2-23**
**షర్మీన్ 36తో టాప్ స్కోరర్**
**సెమీస్ ఆశలు బలపడ్డాయి**

**నవీ ముంబై, అక్టోబర్ 26 (జనసాక్షి):** మహిళల ప్రపంచకప్ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తడాఖా చూపించారు. డీవై పాటిల్ స్టేడియంలో వర్షం అంతరాయంతో 27 ఓవర్లకు కుదించిన పోరులో బంగ్లాదేశ్‌ను 119 పరుగులకే పరిమితం చేశారు. రాధా యాదవ్ (3–30), శ్రీ చరణి (2–23) మిడిల్ ఓవర్లలో వికెట్ల వేటకు తెరతీసి బంగ్లా బ్యాటర్లను బెంబేలెత్తించారు. పేసర్ రేణుకా సింగ్ తొలి ఓవర్లోనే ఓపెనర్ సుమైయా అక్తర్(2)ను ఔట్ చేసి షాక్ ఇచ్చింది. రుబియా హైదర్(13), షర్మీన్ అక్తర్ (36) ఆచితూచి 30 దాటించారు. 9వ ఓవర్ చివరి బంతికి రుబియా స్లిప్‌లో షాట్ ఆడగా శ్రీచరణి క్యాచ్ తప్పింది. కానీ తర్వాత దీప్తి శర్మ రుబియాను ఔట్ చేసి 34 వద్ద రెండో వికెట్ తీసింది. వర్షం మళ్లీ అంతరాయం కలిగించేసరికి షర్మీన్, కెప్టెన్ నిగర్ సుల్తానా(9) క్రీజులో ఉన్నారు. 27 ఓవర్లు నిర్ణయించిన అంపైర్లు ఇన్నింగ్స్ మళ్లీ ప్రారంభించగా రాధా యాదవ్ మెరుపు త్రోతో సుల్తానాను రనౌట్ చేసింది. షర్మీన్ జతగా శోభన మోస్త్రే(26) దూకుడుగా ఆడి 21వ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టింది. కానీ రాధా వేసిన తదుపరి ఓవర్లో మిడాఫ్‌లో డియోల్ చేతికి చిక్కింది. షోర్నా అక్తర్(2)ను రాధా బౌల్డ్ చేసింది. పదవ ఓవర్లో అరుంధతి రెడ్డి డైవింగ్ క్యాచ్‌తో ఏడో వికెట్ పడింది. చివరి ఓవర్లో రీతూ మోనీ(11) సిక్సర్ కొట్టినా బంగ్లా 119లో ఆగిపోయింది. ఈ విజయంతో భారత సెమీస్ ఆశలు బలపడ్డాయి.

# గంజాయి గుట్టు రట్టు.. 8 మంది అరెస్టు

- హౌసింగ్ బోర్డ్‌లో చైతన్య లాడ్జ్‌పై పోలీసుల దాడి
- హైదరాబాద్ నుండి గంజాయి కొనుగోలు
- లాడ్జ్‌లో గంజాయి తాగుతూ అధిక రేట్లకు విక్రయం
- 735 గ్రాముల గంజాయి, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితులను కోర్టు ముందు హాజరుపరిచిన పోలీసులు

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 26(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలోని చైతన్య లాడ్జ్‌లో గంజాయి వ్యాపారం సాగుతున్నట్టు పోలీసులకు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాసులు మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం ఆదివారం స్టేషన్ ఎస్ఐ తన సిబ్బందితో కలిసి చైతన్య లాడ్జ్‌లో తనిఖీలు చేపట్టారని,ఈ సందర్భంగా రూమ్ నంబర్ 106 నందు ఎనిమిది



మంది యువకులు ఉన్నారని తెలిపారు.అరెస్టయిన వారిలో బొందాల రేణుకుమార్ (25),మైలగాని సందీప్ (22),ఆరకు విశ్వాస్ (25), ఎడ్ల వంశీ (22),(ఆకాశ్ సింగ్ దూల్పేట్ హైదరాబాద్ వీరిని పోలీసులు అదుపులో తీసుకోలేదు),కొత్త వెంకటేశ్ (30),కొత్త మనోజు కుమార్ (20),ఉడుతల ఆది కృష్ణగౌడ్ (20),గూల్ల పరమేష్ (20) ఉన్నారు.వీరు అనుమానాస్పదంగా ఉన్నారని గుర్తించి వారిని ప్రశ్నించగా, ప్రధాన నిందితుడు ఆకాష్ సింగ్ హైదరాబాద్‌లోని దూల్‌పేట ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసి నాగర్ కర్నూల్‌కు తీసుకొచ్చి, లాడ్జ్‌లో ఉంటూ తాగుతూ, అవసరం ఉన్న వారికి అధిక ధరలకు అమ్ముతున్నట్లు వెల్లడించారు.ఆదివారం 6 నుండి 9 వరకు ఉన్న వ్యక్తులు గంజాయి కొనుక్కొని వెళ్ళేందుకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో పోలీసులు మొత్తం 735 గ్రాముల గంజాయి,7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేసిన 8 మంది నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి న్యాయస్థానం ముందు హాజరుపరి చారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక దృష్టి కొనసాగుతోందని, ఇలాంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.ఈ కార్యక్ర మంలో సిఐ అశోక్ రెడ్డి, ఎస్సై గోవర్ధన్ కానిస్టేబుల్ భీముడు సిబ్బంది ఉన్నారు.

# జూబ్లీహిల్స్‌లో మంత్రుల విస్తృత ప్రచారం

## రంగంలోకి పొన్నం, సీతక్క, తుమ్మల, జూపల్లి సహా కాంగ్రెస్ నేతలు

- డివిజన్లవారీగా ఓటర్లను కలుస్తూ.. భరోసా ఇస్తున్న వైనం
- నవీన్ యాదవ్‌ను గెలిపించి ఆదరించాలని విజ్ఞప్తి
- ప్రచారంలో దూసుకుపోతున్న సీతక్క, పొన్నం ప్రభాకర్
- ఈ ఉప ఎన్నికతో బీఆర్ఎస్ కథ పరిసమాప్తం : తుమ్మల



**హైదరాబాద్ బ్యూరో/ఖైరతాబాద్, అక్టోబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ భవిష్యత్ ను నిర్దేశించే జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో చారిత్రక తీర్పు ఇవ్వాలని జూబ్లీ హిల్స్ ఓటర్లకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.ఆదివారం నాడు వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పదేళ్ల బీ.ఆర్.ఎస్ పాలనలో హైదరాబాద్ లో విధ్వంసం జరిగిందని,అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలైన బీ.ఆర్.ఎస్ ఉప ఎన్నికలో చేసే కుయుక్తులు తిప్పి కొట్టాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మినీ ఇండియా లాంటి హైదరాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి విజనరీగా పని చేస్తున్నారని ఉప ఎన్నికలో జూబ్లీ హిల్స్ ఓటర్లు సీఎం రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలవాలనీ మంత్రి తుమ్మల కోరారు. స్థానికుడిగా, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నవీన్ యాదవ్‌ను గెలిపించడం ద్వారా జుబ్లీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని మంత్రి తుమ్మల తెలిపారు. అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. స్థానిక సమస్యలు మాధుర నగర్ కాలనీలోని మౌలిక వసతుల లోపాలను, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

### పొన్నం.. డోర్ టు డోర్



యూసుఫ్‌గూడా డివిజన్ కృష్ణనగర్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్,శివసేన రెడ్డి, సంజయ్ గౌడ్, ఇతర ముఖ్య నేతలు డోర్ టూ డోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు మంత్రి పొన్నం. భారీ ర్యాలీగా వెళ్తూ మహిళలను వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ఇక్కడ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నీటి సమస్య ఏర్పడిందని, గుండాయిజంతో రాజకీయం నడిపి పోలీసులను పెట్టి ఈ ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మన సమస్యలు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గెలవడంతో అక్కడి ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని వివరించారు. నవీన్ యాదవ్ విద్యావంతుడు, యువకుడు, స్థానికుడు, ఉత్సాహంగా పనిచేసే వ్యక్తి కాబట్టి ఆశీర్వదించి ఓటు వేయాలని కోరారు.

### ఓటర్లలో ఉత్సాహం నింపుతున్న సీతక్క





జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా మధురానగర్‌లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, మహిళా కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్. స్వయంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రతి గడపకు చేరుకున్న మంత్రి సీతక్క.. గత మూడు సార్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చినా అభివృద్ధి జరగలేదని ప్రజలకు గుర్తుచేశారు. మధురానగర్‌లో స్ట్రీట్ కార్నర్ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, ఈ ఉపఎన్నికల తర్వాత జూబ్లీహిల్స్‌లోనూ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. సీతక్క ప్రచారంతో కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ పెరుగుతుంది. ఉదయం 8 గంటల కే ప్రచారం ప్రారంభించి.. గల్లీలో తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తున్నారూ. ఎంతో ఓపిగ్గా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాల్సిన అవసరాన్ని వివరిస్తున్నారు.

### గల్లీ బిడ్డ నవీన్‌కు ఒక్కసారి ఛాన్సివ్వండి : మంత్రి సీతక్క





బోరబండ డివిజన్‌లో నివసిస్తున్న పాలమూరు వాసుల ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడారు. పాలమూరు బిడ్డ రేవంత్ అన్నను బలపరచాలంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని పాలమూరు వాసులు చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈసారి గల్లీ బిడ్డ నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇవ్వండి అని మంత్రి ప్రజలను కోరారు. అన్నా అంటే నేనున్నానంటూ అందరికీ అందుబాటులో ఉండే నవీన్‌ను గెలిపించుకోవాలని, దీంతో అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పదేళ్లలో పడ్డ ఇబ్బందులను తరిమికొట్టే అవకాశం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల చేతుల్లోనే ఉందని, అందుకే చేతి గుర్తుకు ఓటేసి ఆదరించాలని పిలుపునిచ్చారు.

### అపార్ట్‌మెంట్‌వాసులతో ఆత్మీయ సమ్మేళనం




సోమాజిగూడ డివిజన్‌లో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వారితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా సోమాజిగూడ ఇన్చార్జ్ భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఎంపీ చామల మాట్లాడుతూ.. నవీన్ యాదవ్ యువకుడని, ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. ఇక్కడ ప్రగతి పరుగులు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ యాదవ్ సతీమణి వర్షా యాదవ్, రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ డాక్టర్ రియాజ్, సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత యాదవ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి విజాయారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం రచనల్లో ప్రతిబింబించాలి

- బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బీఎస్ రాములు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** యువరచయితలు ,కవులు,కవయిత్రులు సామాజిక న్యాయం కోసం సాహిత్యాన్ని సృష్టించాలని పూర్వ బి.సి.కమీషన్ చైర్మన్ బి.ఎస్.రాములు పిలుపునిచ్చారు.తాను దేశమంతా పర్యటించి ప్రత్యామ్నాయ సాహిత్య సృష్టితో ప్రజా ఉద్యమాలను నిర్మించానని తెలిపారు.దళిత బహుజ నులు చైతన్యవంతులై రాజ్యాధికారం చేపట్టిన నాడే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని అభిప్రాయ పడ్డారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారతీయ సాహిత్యం అనువాద ఫౌండేషన్ సౌజన్యంతో విమలా సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన రెండు పుస్తకాల ఆవిష్కరణల సభ జరిగింది.ఈ సందర్భంగా బి.ఎస్.రాములు రాసిన “అఖిల భారత పర్యటన,మామిడి పెల్లి ఇంద్రాణి రాసిన”ఇంద్ర-కమలం” పుస్తకాలను బైస్ దేవదాస్,బి.ఎస్.రాములు ఆవిష్కరించారు.ఇంద్రాణి చిన్న వయసులోనే అద్భుత కవిత్వం రాశారని అతిథులు కొనియాడారు.సరళమైన భాషలో,వస్తువైవిధ్యంతో సరికొత్త అభివ్యక్తి తో ఇంద్రాణి అద్భుత కవిత్వం రాశారని వక్తలు కొనియాడారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథులుగా సాహితీవేత్తలు సంగిశెట్టి శ్రీనివాస్, డా.జెల్ది విద్యాధర్,నారగోని,బైస దేవదాస్, డా.అనంత పద్మనాభరావు, మువ్వా శ్రీనివాసరావు, కవయిత్రులు జ్వలిత,జాజుల గౌరి, డా.రాధా కుసుమ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. బి.ఎస్.రాములు ఎందరో దళిత బహుజన యువతీ యువకులను కవులుగా, కథారచయితలుగా తీర్చి దిద్దిన ప్రత్యామ్నాయ సాహిత్యోద్యమ నిర్మాతగా, బహుజన తాత్విక సిద్ధాంత కర్తగా అతిథులు అభివర్ణించారు. యువ కవయిత్రి ఇంద్రాణి “ఇంద్ర కమలం” కవితా సంపుటిలో అనేక అంశాలపై అధునాతన ప్రతీకలతో సహజ భావోద్వేగాలతో అద్భుత కవిత్వం పండించారన్నారు. బి.ఎస్.రాములు, మరెందరో సహకారం వల్లనే తాను కవయిత్రిగా వెలుగులోకొచ్చానని,తన కుటుంబ సభ్యులు సహకారం వల్లనే కవయిత్రిగా మారానని తెలిపారు.ఈ సందర్భంగా అతిథులతో పాటు గ్రంథ రచయితలను ఘనంగా సన్మానించారు.

# కీచక టీచర్ సస్పెన్షన్!

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- వెల్లడించిన ఎంఈఓ వెంకటయ్య గౌడ్

వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 26( జనం సాక్షి): తాండూరు మండలం కరణ్ కోట్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్ టీచర్ రాఘవేందర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ వెంకటయ్య గౌడ్ తెలిపారు.టీచర్ రాఘవేందర్ రెడ్డి అదే పాఠశాలకు చెందిన విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై జిల్లా విద్యాధికారి రేణుకాదేవి విచారణకు ఆదేశించడంతో ఎంఈఓ వెంకటయ్య గౌడ్ కరణ్ కోట్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో విచారణ చేపట్టారు.ఈ నివేధికను జిల్లా విద్యాధికారికి పంపించారు. బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ రాఘవేందర్ రెడ్డిపై సస్పెండ్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. సోమవారం ఉత్తర్వులను అందజేయడం జరుగుతుందని చెప్పారు

# సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య, కానిస్టేబుల్ వీఎస్ఎన్ మూర్తి తెగువ భేష్

- యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీసీపీ, కానిస్టేబుల్ ను పరామర్శించిన కేంద్ర మంత్రి
- వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్న బండి సంజయ్
- మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పిన వైద్యులు





**హైదరాబాద్ (జనంసాక్షి) :** సంఘ విద్రోహ శక్తులకు, రౌడీషీటర్లకు మద్దతిచ్చే వాళ్లు కూడా సంఘ విద్రోహశక్తులుగానే పరిగణించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు రాజీ పడొద్దని, ముఖ్యంగా సంఘ విద్రోహ శక్తులను కఠినంగా అణిచి వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో పోలీసులకు కేంద్రం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. రౌడీషీటర్ అన్సారీ దాడిలో గాయపడి సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్, కానిస్టేబుల్ వీఎస్ఎన్.మూర్తి లను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం పరామర్శించారు. డీసీపీ, కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ అన్సారీ దాడితో డీసీపీ, కానిస్టేబుల్ తీవ్ర గాయాలు అయ్యాయని ఈ సందర్భంగా వైద్యులు కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుతం మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ చైతన్య, కానిస్టేబుల్ ను పరామర్శించిన బండి సంజయ్ వారు చూపిన తెగువను కొనియాడారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని, సంఘ విద్రోహ శక్తులను అణిచి వేయాల్సిందేనని చెప్పారు. ఈ విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు.

## మద్యం తాగి బస్సు నడిపే డ్రైవర్లు టెర్రరిస్టులతో సమానం

- హైదరాబాద్ సీపీ సజ్జనార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మద్యం సేవించి వాహనాలు నడిపేవారు టెర్రరిస్టులతో సమానమని సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై వారి చర్యలు ఉగ్రవాద చర్యల కన్నా ఏమాత్రం తక్కువ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 20 మంది ప్రాణాలను బలిగొన్న కర్నూలు బస్సు ప్రమాదం నిజానికి ప్రమాదం కాదని, అది ఒక తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన దారుణ మారణకాండ అని ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. కర్నూలు ప్రమాద ఘటన వివరాలను సజ్జనార్ పంచుకున్నారు. బి. శివ శంకర్ అనే బైకర్ మద్యం మత్తులో తన బైక్‌పై నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 2:24 గంటలకు ఓ పెట్రోల్ బంకులో బైక్‌లో ఇంధనం నింపుకున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నమోదయ్యాయని, సరిగ్గా 2:39 గంటలకు ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు. అతని బాధ్యతారాహిత్యం క్షణాల్లో ఎన్నో కుటుంబాలను సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థిని వాట్సాప్, ఫొటో గ్యాలరీ చెక్ చేసిన ప్రిన్సిపాల్

- విద్యార్థిని గోప్యతకు భంగం కలిగించారని తల్లిదండ్రుల ఆందోళన
- సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు

**జోధ్‌పూర్ (జనంసాక్షి) :** పాఠశాలకు ఫోన్ తీసుకొచ్చిన ఓ విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై రాజస్థాన్ విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. విద్యార్థిని వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించారనే ఆరోపణలతో జోధ్‌పూర్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాల యాక్టింగ్ ప్రిన్సిపాల్‌ను శనివారం సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే, జోధ్‌పూర్‌లోని పీఎం శ్రీ మహాత్మా గాంధీ ప్రభుత్వ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని శనివారం స్కూల్‌కు మొబైల్ ఫోన్ తీసుకొచ్చింది. ఈ విషయం గమనించిన యాక్టింగ్ ప్రిన్సిపాల్ షకీల్ అహ్మద్, ఆమె నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫోన్ లాక్ తీసి, అందులోని వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో పాటు కాల్ వివరాలు, గ్యాలరీని కూడా తనిఖీ చేశారు. అంతేకాకుండా, క్లాసులో ఆమె పక్కన కూర్చునే అబ్బాయి గురించి కూడా ప్రశ్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని, విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసింది. వెంటనే పాఠశాలకు చేరుకున్న కుటుంబసభ్యులు, ప్రిన్సిపాల్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఫోన్‌లో ఏవైనా వ్యక్తిగత వివరాలు ఉంటే ప్రిన్సిపాల్ వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆరోపిస్తూ విద్యాశాఖకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణలో ప్రిన్సిపాల్ షకీల్ అహ్మద్ తన తప్పును అంగీకరించారు. పాఠశాలలో పరీక్షలు జరుగుతున్నందున, విద్యార్థిని రీల్స్ ఏమైనా రికార్డ్ చేసిందేమోననే అనుమానంతోనే ఫోన్ చెక్ చేశానని తన రాతపూర్వక వాంగ్మూలంలో పేర్కొన్నారు. అయితే, ఆయన చర్య విద్యార్థిని గోప్యతకు భంగం కలిగించడమేనని నిర్ధారించిన సెకండరీ ఎడ్యుకేషన్ డైరెక్టర్, తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370